# జయకాంతన్



# ఋషిమూలం

## మూలం: తమిళం

## అనువాదం: ఏండీ సుందరేశన్

# RUSHIMOOLAM

(Jayakanthan’s Tamil Novella)

తెనుగు అనువాదం© Kurinji Publications, California, US

First Edition, 2020

© D. Jayakanthan/Andy Sundaresan

***Cover Design:***
Amirr Butt

The translator acknowledges with thanks the permission to reproduce Artist Maya’s illustrations from Ananda Vikatan.

**Printed at:**
The Copy World
1375 University Avenue
Berkeley, CA 94702
Telephone: 1-800-690-2679 (Toll Free)

# ఋషిమూలం

## (జయకాంతన్ కథ)

### మూలం: తమిళం

### అనువాదం:

### ఏండీ సుందరేశన్

**Published By**

**Kurinji Publications**
**10944 San Pablo Avenue # 610**
**El Cerrito, CA 94530-2377**
**Email:**
**rangan.sundaresan@gmail.com**

# ఇందులో . . . .


**అనువాదకుని ముందుమాట/**

**జయకాంతన్ ముందుమాట/**

**ఋషిమూలం/1**

**ఊగెడు కుర్చీలు/**

**అనుబంధం/**

# అనువాదకుని ముందుమాట

*"నేను చూసినవే - అంటే, ఈ లోకంలో నాకు పరిచయమైనవీ, నేను విన్నవీ, అనుభవించినవీ - నేను ఈ ప్రపంచంకి తెలియజేస్తున్నాను; అవే మీకు మళ్ళీ చూపిస్తున్నాను. అవి అసహ్యంగా, అల్పంగా లేక ఘనంగా, ప్రౌఢిమగా ఉన్నా అందువలన నాకేం నింద? కాకపోతే, నాకేం కీర్తి?"*

- జయకాంతన్

ఇందులోని రెండు కథలూ వివాదాస్పదమైనవి. కథావస్తువు స్త్రీ పురుష సంబంధాలు, వాటి స్థితిగతులు, లక్షణాలు, గురించి. జయకాంతన్ తమిళ సాహిత్యంలో మరెవరూ ఎంచుకోని, నిషేధమని భావించే అంశాలని నిష్ఠూరంగానే అయినా స్పష్టంగా ఇక్కడ మనకి తెలియజేస్తున్నారు.

ఈ కథల్లో రచయిత వక్కాణించి చెప్పే సందేశం ఇదే: సమాజం మానసికంగా ఆరోగ్యవంతంగా ఉండాలంటే ప్రజలకి స్త్రీ పురుష సంబంధాల విషయాల్లో సరైన అవగాహన ఉండాలి. ఈ కథల పాత్రలు తమ జీవితాలచుట్టూ బలంగా అమర్చుకున్న అవగాహన ఎటువంటిదో జయకాంతన్ స్పష్టంగా చెప్తున్నారు. అలాంటి అవగాహనని అర్థం చేసుకోడానికి, విముక్తులు కావడానికి ఇటువంటి కథలు దోహదం చేస్తాయని ఆశించవచ్చు.

**"ఋషిమూలం** కథానాయకుడు రాజారామన్ 'ఒక మెంటల్ పేషంటు'; వాడిగురించి ఇందులో నేను మీకు చూపేదంతా ఒక శోచనీయమైన చిత్రణ" అని రచయిత మనకి గుర్తు చేస్తున్నారు. యౌవనావస్థలో, అజాగ్రత్తవల్ల సంభవించిన అనుభవం రాజారామన్ మనసుని చిత్రహింసచేసింది. ఆ అనుభవం మింగుడుకాకపోవడంతో ఆపరాధ భావం ఒక జాడ్యంగా అతన్ని ఎడతెగకుండా వెంటాడుతూనేవుంది; ఆదే ఆఖరికి అతని విషాదాంత జీవితంని తీర్చిదిద్దందని మనకి బోధపడుతుంది.

**ఊగెడు కుర్చీలు** ఒక ఆడ్డదిడ్డమైన కుటుంబం (dysfunctional family) కథ. ఇంటి యజమాని అలంకారవల్లి సంతానంని అనుమానస్పదతో, నిష్కర్షగా, ఏలుతోంది. ఆమె ఆధిపత్యంలో - కట్టుబాట్లతో - వశమైపోయి మానసిక వ్యధలో

చిక్కుకున్న నలుగురు వయసువచ్చినవారి కథ ఇది. అందరూ పెద్ద చదువులు చదివి, మంచి ఉద్యోగాలూ సంపాదించినవారే. కాని ఆ తల్లి ఆధిపత్యంలోనే వాళ్ళ జీవితం సాగుతోంది. అంతరంగ స్వేచ్ఛ లేక, తల్లి దాక్షిణ్యంతోనే, 'పిల్లలు'గానే వారందరూ రోజులు గడుపుతున్నారు. ఈ కుటుంబంలో మనం చూసేది నిశ్చలత్వమే, మరేం లేదు!

ఊగెడు కుర్చీలు ఈ కుటుంబంని అట్టపెట్టుకున్న మందస్థితికి ఉపమానం. ఊగెడు కుర్చీలవలన గమనంకి సాధ్యం లేదు. ఈ కుటుంబం వేరే దిశలో కొనసాగాలంటే అందుకు మూల శక్తి బయటనుంచి వచ్చితీరాలి. అంతకుముందు, అంతరంగికంగా, ఆ కుటుంబ సభ్యులలో ఎవరి మనసులోనైనా ఒక ప్రేరణ లేవాలి!

జానకి తన్ను ఆవరించుకున్నబంధాల నుండి బయటికి రావాలని ఆలోచించింది. ఆమె విద్యావంతురాలు. పెద్ద ఉద్యోగం చేస్తోంది. ఆమె ఆప్త మిత్రుడు సుందరం ఆమె అంతరంగ స్వేచ్ఛకి దోహదం చెయ్యాలని వచ్చాడు. అదీ సఫలమవలేదు!

ఏతావాతా ఈ కథల్లోని పాత్రలందరూ తమకి మించిన శక్తులతో పోరాడారనీ, ఆఖరికి ఆ శక్తులే వాళ్ళ జీవితాలని తీర్చిదిద్దాయని మనకి అర్థమవుతుంది.

ఈ కథలు తెలుగులో అనువదించడానికి నాకు అనుమతి ఇచ్చిన జయకాంతన్ కొమార్తె దీపలక్ష్మికి నా కృతజ్ఞతలు.

********

# జయకాంతన్ ముందుమాట[1]

ఈ **ఋషిమూలం** అనే కథని నేను **దినమణి కదిర్** పత్రికలో మూడు వారాలు రాసాను. ఆ తరువాత **దినమణి కదిర్** లో ఒక పాఠకుని ఉత్తరం ప్రచురించి "ఇక ఇటువంటి కథలు **దినమణి కదిర్** లో ప్రచురించడం జరగదు" అని సంపాదకుని హామీ కూడా వెలుబడింది. ఆ తరువాత ఈ **ఋషిమూలం** కథని శ్లాఘించి వందలకొలదీ ఉత్తరాలు నాకూ, సంపాదకునికీ వచ్చాయి. ఇప్పటిలోకూడా సాహిత్య సభల్లో, పాఠకుల సమ్మేళనల్లో, సమయం దొరికినప్పుడెల్లా దీన్ని విమర్శించడం జరుగుతోంది; దీనిగుంచి ఎన్ని అభిప్రాయాలున్నాయో అవన్నీ నేను వినివున్నాను.

"దీన్ని రాయడం మూలం ఒక మంచి కథ రాసాను" అనే నమ్మకం తప్ప ఈ సమాజంని నేను ఉద్ధరించాను లేక దాని పరువుతీసాను అనే ఏ భావనా నాకు లేదు. ఒక రచయతగా నాకంటువంటి లక్ష్యం లేదు. కాని ఈ సమాజంని పైకెత్తే ఉద్యమంలో ప్రజలందరికీ ఎంత వాటా ఉందో, అది నాకూ ఉంది. అందరిలాగే నేనూ ఒక బుట్ట మన్ను పొయ్యడానికో, వోటు వెయ్యడానికో సిద్ధంగా ఉన్నాను; నేను కథలు రాస్తున్నాను అనే నెపంతో ఆ కృషిలో నా వంతు నిరాకరించడం న్యాయం కాదు.

నన్ను పంచ వర్ణ ప్రణాళికల ప్రచారంకి రాయమని అడుగుతే ఆ పనికూడా నేను సంతోషంగా చేస్తాను. కాని దానికీ, కథలు రాయడానికీ చాలా భేదముంది. నేను పదేపదే చెప్పినదే మళ్ళీ ఇక్కడ మీకు గుర్తు చేస్తున్నాను:

***నేను చూసినవే - అంటే, ఈ లోకంలో నాకు పరిచయమైనవీ, నేను విన్నవీ, అనుభవించినవీ - నేను ఈ ప్రపంచంకి తెలియజేస్తున్నాను; అవే మీకు మళ్ళీ***

[1] రచయత సెప్టెంబరు, 1969లో రాసిన వ్యాసం సారాంశం

*చూపిస్తున్నాను. అది అసహ్యంగా, అల్పంగా లేక ఘనంగా, ప్రౌఢిమగా ఉన్నా అందువలన నాకేం నింద? కాకపోతే, నాకేం కీర్తి?*

నా మొట్టమొదటి కథల సంపుటంలో, నేను కమ్యూనిస్టుగా ఉన్న రోజుల్లోనే, పైన చెప్పినట్టు రాసాను.

నేను తటాలున దిశ మారినట్టు, తోవ తప్పినట్టు, నా వెనుక వస్తున్న కొందరు గోలపెడ్తున్నారు. స్వాభిమానం వలనో లేక పని ఒత్తిడిలో నాకున్న అశ్రద్ధ వలనో వాళ్ళకి ఎటువంటి జవాబు ఇవ్వకపోయినా, 'సరేలే, అలాగే కానీ!' అని విసుగ్గుంటూ నేను ఏమీ అనకుండా ఉరుకోవడమూ జరిగింది.

ఎటువంటి సిద్ధాంతంకీ, గుంపుకీ ఏనాడూ నేను వశమైపోలేదని మీకు మళ్ళీ గుర్తుచేస్తున్నాను.

"ఈ **ఋషిమూలం** కథ వలన షోషలిజంకి ఏం లాభం?" అని వీళ్ళు అడుగుతున్నారు. "మన దేశంలో ఎన్నో సామాజిక ప్రశ్నలున్నాయే, దీనిగురించి ఎందుకు రాయాలి?" అని అడుగుతున్నారు. "ఇటీవల తంజావూరు కీళ్వేణ్మని గ్రామంలో జరిగిన హత్యాకాండలో సజీవంగా 45 రైతులు దహనమైపోయారే, వాళ్ళగుంరించి రాయరేం?" అని అడుగుతున్నారు. "విద్యార్థుల మధ్య చెలరేగుతున్న పోరాటాలగురించి రాస్తే ఎంత బాగున్ను!" అని అంటున్నారు.

వీళ్ళందరి సలహాలకి నా వందనం అని అనడం తప్పిస్తే సాహిత్యరీతిగా నేను మరేం జవాబు ఇవ్వలేను. 'వీటిగురించి రాయకూడదు!' అని నేనెక్కడా రాసినట్టు నాకు గుర్తు లేదు; 'రాయను' అనికూడా అనలేదు.

నేను రాసినవి విమర్శించాలని పూనుకున్న వీరందరూ నేను రాయని వాటిగురించి ఉపదేశం చెయ్యడం నాకు చోద్యంగా ఉంది. 'ఇదేనా వీళ్ళకున్న సమీక్ష జ్ఞానం?' అని అడగాలనివుంది.

నా కథలని మించి నన్ను గణించాలని చాలామంది ఆతురతతో ఉన్నారు; కాని ఇలాగ విమర్శ చేసేవారందరూ తమ అసలు స్వరూపం నాకు తెలియజేస్తున్నారు.

అజ్ఞానంతోబాటు తాము ఏలుకున్న సిద్ధాంతాలపైన తమకున్న మూఢభక్తిని దండోరా వేసి ఊరంతా తెలియజేయాలని వీళ్ళకి ఆశ. కాని తమకని సొంతంగా ఒక డోలు లేకపోవడంవలన జయకాంతన్ అనే డోలుని వాయించడమే జరుగుతోంది; అది నాకూ సంతోషమే!

కాని ఈ మొండి విమర్శకులలో చాలామంది చాటుచున్నదంతా వారి జ్ఞానశూన్యత మాత్రమే!

అంతేకాదు. వీళ్ళందరు ఈ రోజుల్లో పాటించే నియమాలను గతించిన కాలంలో నేనూ పాటించానని, అవన్నీ ఇప్పుడు నేను తోసిపారేసాననే భావనతో వీళ్ళకి నా మీద పగ, కోపం వచ్చేసాయి! అవే వీళ్ళ విమర్శలకి ఆధారశ్రుతిగా, రచ్చ చేసే గుంపుల కూతలుగా పనిచేస్తున్నాయి.

దానికి మించి, నన్ను ఎగతాళి చేస్తూ, నాకొక బిరుదివ్వాలనే భావన వీళ్ళ కోపంలో కనిపిస్తోంది . . .

"జాగ్రత్త! ఈ సమాజం నిన్ను తోసిపారేస్తుంది!" అనే హెచ్చరిక ఆ కోపంలో కనిపిస్తోంది . . .

వీళ్ళందరూ తమకే తెలియక ఆజ్ఞానంతో ఈ తప్పులు చేస్తున్నారంటే వాళ్ళ ఎరుకకోసం కొన్ని విషయాలు ఇక్కడ నేను చెప్పదలచుకున్నాను; ఎందుకంటే, ఈ విమర్శనలలో పాల్గొన్న అందరూ నన్ను అపార్థం చేసుకున్నారు.

"మానవాభ్యుదయంకోసమే నా సాహితీ ఉద్యమం! సోషలిజ సమాజమే నా గమ్యం! నేను కోరేది విప్లవం! కార్మిక వర్గం జిందాబాద్! నేనేది రాసినా అది సామాన్య ప్రజలకోసమే!" అని విజృవీగుతూ, రంగం మీద పెద్ద పెద్ద అంగలు వేస్తూ రాజులాగ నడవడం నాకు అసభ్యంగా ఉంది!

ఇందుకు అర్థం - 'ఇలాగ పెద్ద పెద్ద అంగలు వేస్తూ రాజులాగ నడిచేవారందరూ అనాగరికులు!' - అని కాదు నా ఉద్దేశం! వారందరూ రాజు పాత్ర ధరించే గొప్ప నటులే కావచ్చు.

నేను ఏ పాత్రకీ చెందని వ్యక్తి; నేను నేనే.

వెంటనే, “ఇంతకుముందు ఒక పుస్తకం అవతారికలో రాసినది మీకు గుర్తుందా? దానికి విరుద్ధంగా ఇప్పుడు అంటున్నారే?” అని తమిళ సినిమాల్లో మనం తరచుగా చూసే దిగనాడిన కథానాయకిలాగ వీళ్లు వాపోవడం చూస్తే నాకు నవ్వాలనివుంది.

అప్పుడు నేనొక కమ్యూనిస్టుగా ఉన్నరోజుల్లో నేను వల్లించనివన్నీకూడబెట్టుకొని, అపార్థం చేసుకొని ఇప్పుడు నేను కమ్యూనిస్టు కాదనే కారణంచేత అదే విధంగా పొరబాటున నన్ను అంచనా వేస్తున్నారని నాకు బోధపడింది.

నేనెటువంటి రాజకీయ పక్షంలో ఉన్నా నా సాహితీ జీవితంని ఎటువంటి కళంకమూ తాకకుండా ఇంతవరకూ కాపాడుకున్నాను.

కూలీలు, పేదలు, ఆకలితో అలమటించే జీవులు, వ్యభిచారిణిలు: వీళ్ళగురించి నేను కథలు రాసినప్పుడు మార్క్సిజం (Marxism) మూలంగా వాటిని రాసాను అని చాలామంది అంటున్నారు.

నేను కాదనను; అది అలాగేనా అని నాకు తెలీదు, అందువలనే కాదనను. మార్క్సిజంలో నేర్చుకున్న ప్రత్యేక జ్ఞానం నా మనుగడకి సాయం చెయ్యలేదు. కాని కమ్యూనిస్టు పార్టీలో ఉన్న కారణంవలన వాళ్ళందరూ అలా అనడం విని నేను చాలా గర్వపడేవాడిని; ఇప్పుడుకూడా అదే భావన నాకుంది.

ఇప్పుడేమో నేను ఫ్రాయిడ్ (Freud) ని ఆధారం చేసుకొని కథలు రాస్తున్నాను అని వీళ్లు అంటున్నారు!

ఇదీ నేను కాదనను. ఎందుకంటే నాకు ఫ్రాయిడిజం (Freudism) గురించి ఎక్కువగా తెలియదు!

ఫ్రాయిడ్ అనే పేరు - అతను జెర్మనీ దేశంలో పుట్టిన ఒక ప్రజ అని - నేను వినివున్నాను. కార్ల్ మార్క్స్ అనే వ్యక్తికి ఆర్థికశాస్త్రంలో ఎంత ఘనత ఉందో

అదేలాగ మానసిక శాస్త్రంలో ఫ్రాయిడ్ కి ఉంది అని ఆ ఇద్దరిగురించీ పరిచయమున్నవారు చెప్పడం నేను వినివున్నాను.

ఫ్రాయిడిజంని ఆధారం చేసుకొని కథలు రాస్తే అందుకు సిగ్గుపడనక్కరలేదు; కాని ఇది నాకివ్వబడిన మితిమీరిన గౌరవం అని మాత్రం ఇక్కడ చెప్పదలచుకున్నాను.

నన్ను ఎదిరించే విమర్శకులలో చాలామందికి నేను ఫ్రాయిడిజం వ్యాపింపజేస్తున్నానని  ఫ్రాయిడిజం మీదే పగ వచ్చేసింది!

ఇది ఎంత శోచనీయం!

ఇటీవల రష్యాలో ఒక విశ్వవిద్యాలయంలో పాఠ్యప్రణాళిక చర్చలలో ఫ్రాయిడిజం ప్రవేశపెట్టాలని ఒక ప్రబోధకుడు తన ఉద్దేశం తెలియజేసారు. నేనిక్కడ దానిగురించి ప్రస్తావించడానికి కారణం ఫ్రాయిడ్ కార్ల్ మార్క్స్ కి విరోధి కాదని తెలియజేయడానికే.

ఫ్రాయిడ్ కూడా తన సిద్ధాంతాలు కొన్ని స్పష్టపరచడానికి సాహిత్యంనుంచి కొన్ని ఉదాహరణలు చూపుతాడు.

మానసిక శాస్త్రంకి, సాహిత్యానికి అనుక్రమం ఉందని నిరూపించడానికే నేను దీన్ని ఇక్కడ చెప్తున్నాను.

ఇంత ఎందుకు? నా కథలు చదివి, మానసిక శాస్త్రంలో సేవ చేస్తున్న విద్యార్థులు,  వారి బోధకులు నన్ను కలుసుకొని, తమ కృషికి అవి తోడ్పడుతన్నాయని నన్ను పొగడేవారు.

ఐనాకూడా, అందుకని, వారి పట్టాలు స్వీకరించి, నేను కథలు రాయలేను.

ఈ సమాజం నన్ను తోసిపారేస్తుందని నాకెటువంటి భయమూ లేదు. నన్ను ఎదిరించే ఈ కూతలలో నాకు కనిపించేది వీళ్ల హఠం, మూర్ఖపుపట్టు మాత్రమే.

నేను ఎది రాసినా అది  సామాజిక  ప్రశ్నలగురించే, మరి దేనిగురించీ కాదు.

నాకు సమాజంతో ఉన్న బంధంమీద 'మానవుడూ, సమాజమూ,' అనే ముద్ర తప్పిస్తే మరేం ముద్ర వెయ్యడానికి నేను ఏకీభవించను.

ఈ సమాజంతో నాకు స్నేహం ఉంది; పగ కూడా ఉంది. ఇది వర్ధిల్లుతోంది, క్షీణించుతోంది.

నిజమైన సాహిత్యం ఉత్పత్తి చెయ్యగలిగిన ఏ రచయిత అయినా సరే, 'నేను ఈ సమాజం ఉద్ధరించడానికి రాస్తున్నాను!' అనే వాగ్దానంతో మొదలుబెట్టాలనే అవశ్యకత లేదు.

నేను వ్యక్తిగత స్వేచ్ఛకోసం (Individual Freedom) వాదాడుతున్నానని నన్ను కొందరు విమర్శించడమూ జరుగుతోంది.

వ్యక్తిగత మనోభావం ఆచరించేవారందరూ సమాజంకి విరోధులు అనే భావన శుద్ధ తప్పు. శిథిలమవుతున్న సమాజంలో దానితోబాటు క్షీణించకుండా, రేపు రాబోతున్న సమాజంకి ప్రతినిధిగా కొందరే నిలబడగలరు.

"లైంగిక ప్రశ్నలగురించే మీరు కథలు రాస్తున్నారు!" అని కొందరు నామీద పైబడుతున్నారు.

లైంగిక ప్రశ్న అనేది కేవలం పడగగదికి చెందిన ప్రశ్నకాదు; అదికూడా ఒక సామాజిక ప్రశ్నే.

ఆకలిలాగే, దాని ప్రభావం - సంస్కృతి, సొగసు, నిజాయితీ, జీవిత శైలి - వీటిమీద ఇంకా తీవ్రంగా పని చేస్తుంది.

సమాజంలో జరిగిన ఒక అవినీతికి ఋజువు వెదుకుతున్న పరిశోధకులకి కనిపించేది కోవలం ఆకలి మాత్రమే కాదు; స్త్రీ పురుష సంబంధాలలో ఒక దుష్ట సమూహం ఎంత ఘోరమైన దుర్నీతులకి దారి తీసిందనికూడా వాళ్లు చూస్తారు.

పరాధీనులు తిరుగుబాటు చేసినప్పుడూ, భూస్వాముల సముదాయం కూలినప్పుడూ, ఆ సమాజంలోని స్త్రీ పురుష సంబంధాలమధ్య ఘర్షణలు, ఒత్తిడి

సహజం అని మనం గుర్తుచేసుకుంటే అక్కడ లైంగిక ప్రశ్నలకీ పెద్ద వాటా ఉందని మనకి అర్థమౌతుంది.

లైంగిక ప్రశ్న అనేదేదో కేవలం ఐశ్వర్యవంతుల ప్రశ్న అని భావించడం అపరిమితమైన అజ్ఞానం.

స్త్రీ పురుష సంబంధాల విషయాల్లో సరైన అవగాహన లేకుండా పెరిగే వ్యక్తి ఆరోగ్యవంతమైన వ్యక్తి కాలేడు; అటువంటి వ్యక్తులున్న సమాజంలో అభివృద్ధి, సౌభాగ్యం కనిపించవు.

ఈ **ఋషిమూలం** కథలో రాజారామన్, శారదా ఆంటీల మధ్య ఏర్పడిన బంధుత్వం ఎటువంటి సమాజంలోనీ సాధ్యమే; కాని దాని మూలంగా ఉద్భవించే పరిమాణాలు **ఋషిమూలం** కథలో వర్ణించినట్టు ఈ సమాజంలోనే చోటుచేసుకుంటాయి.

అంటే మనకంటే పురోగమిచ్చిన సమాజంలో ఇటువంటి ఘటనలు జరగవు అని కాదు; అక్కడ వీటికి అంత ప్రాముఖ్యత ఇచ్చి అందువలన వాళ్ళు నశించిపోరు.

నా శారదా ఆంటికి రాజారామన్ కంటే స్వస్థమైన మనసుంది; అందువలనే ఆవిడకి దాన్ని మింగడానికి వీలైంది; విశాలహృదయంతో ఆవిడ ఆ తప్పుని మరచిపోయింది.

కాని రాజారామన్కి లైంగిక విషయాల్లో భయం మాత్రమే ఉంది, ఆరోగ్యవంతమైన దృక్పథం లేదు. అందువలనే అతను తన్ను తనే క్షమించుకోలేకపోయాడు.

తన కథ ఎలా అంతమవాలని రాజారామనే తీర్పు చెప్పేసాడు: చెరువుగట్టులో కూర్చొని, అటునించి ఇటు కనిపించే శ్మశానభూమిలో కాలుతున్న ప్రతీ కట్టెలకుప్పలో అతను తన్ను పెట్టి దహనం చేసుకుంటున్నాడు.

నా విమర్శకులని నేను ఇప్పుడు అడుగుతున్నాను: “ఇదిగో, వినండి! దీనికి మీ సమాధానం ఏమిటి? రాజారామన్ పలికే మాటలన్నీ రచయిత వ్యక్తిగత ప్రచార సందేశాలని మీరు నిశ్చయించారంటే - ‘మీరందరూ మితిమీఱిన బుద్ధిమంతులు!’

(నన్ను క్షమించండి!) అని నాకు నవ్వాలనిపిస్తేంది. ఇంతకన్నా నాజూకుగా మీకు ఏం చెప్పాలో నాకు తెలీదు!

కాని ఆ రాజారామన్ మీద నాకు మనఃపూర్తియైన పశ్చాత్తాపం ఉంది - అంటే ఒక పేషంటు దగ్గర డాక్టరుకున్న పశ్చాత్తాపం లాగ - అన్నమాట.

మానసిక క్షోభలో చిక్కుకున్న ఒక రోగి తన భావేశాలని సొంత దృష్టికోణంలో వివరిస్తున్నట్టు నేను ఈ కధ రాసాను. కాని పాఠకులు అవన్నీ నా వ్యక్తిగత భావనలు అని అపార్థం చేసుకున్నారంటే నా రచనావిశేషం గురించి నేనింకా ఎక్కువగా గర్వపడాలనిపిస్తోంది!

**ఋషిమూలం** రాజారామన్ని స్తుతించే కావ్యం కాదు; ఇది జీవితమనే నదిలో ప్రయాణం చేసి అవతలి ఒడ్డుకి చేరవలసిన ఒక జీవి ఈ తీరంలోనే మెల్లమెల్లగా నశించిపోవడం చూపే ఒక ఘోరమైన చిత్రం. ఇదొక కళాకారుడు తన చెయితో రాసిన ఒక Case Sheet.

అతన్ని ఋషి అని నేను అనలేదు; అతనూ అనలేదు.

అలా అన్నవాళ్ళందరినీ చూసి అతను నవ్వాడు కూడా.

అతని వాదనలు కొట్టిపారేయడానికి సగటు బుద్ధి చాలు. కార్ల్ మార్క్స్, గాంధీలని వ్యాఖ్యానించనక్కరలేదు.

రాజారామన్ మానసిక వైకల్యంతో అల్లాడుతున్న ఒక రోగి. అతని మనసులో వాదనలు, ఎదురు వాదనలు, రక్షణ వ్యవస్థలు, నిరాకరణలు, ఒప్పుదలలు ఎంత అద్భుతంగా చెలరేగుతున్నాయని చూస్తే అతనిలా ఐపోయినందుకు మనం బాధ పడాలి.

మూర్ఖత భావంతో పాటించే సామాజిక, కుటుంబ కట్టుబాట్లూ (taboos), తమకు తామే ప్రజలు అలవరించుకున్న ఆక్షేపణలూ (inhibitions) - ఇవన్నీ సామాజిక ప్రశ్నలేకదా?

ఇటువంటి నకిలీ ఆక్షేపణలని మతాలూ, మతాధిపతులూ, పోషించి ప్రచారం చేసినప్పుడు బాల్జాక్ (Balzac) వంటివారు స్వేచ్ఛకీ విచ్చలవిడితనానికీ మధ్యన ఉన్న తెరలని చింపేసి బట్టబయిలు చేసినప్పుడు వాళ్ళ రచనలనికూడా 'ఇవన్నీ

బూతు కథలు!' అని సమాజంని 'ఉద్ధరించే' ఉద్యమంలో పాల్గొన్న కొందరు ఘోషించారన్నది నిజం; కాని కార్ల్ మార్క్స్ వాళ్ళతో ఏకీభవించలేదు.

ఇవాళ మన సమాజమే ఒక మతంగా మారిపోయింది; ప్రతీ వ్యక్తీ సగం సన్యాసిగా నటించే అలవాటు బాగా పెరిగిపోవడం నేను చూస్తున్నాను.

అందువలనే ఇక్కడ Sex ఒక ప్రశ్నగా ఐపోయింది; ఇది ఒక సామాజిక ప్రశ్న.

ఇటువంటి కట్టుబాట్లు ఉన్నా ఈ సమాజం మెచ్చదగిన వ్యక్తులని ఉత్పత్తి చెయ్యడం లేదు. పెద్ద చదువూ, ఆర్థిక అంతస్తు ఉన్నాకూడా మానసిక రుగ్మతలని ఎదుర్కోవడానికి మానసికంగా సిద్ధంగా ఉన్న వ్యక్తులు ఉద్భవించడానికి ఎన్నో ఆటంకాలున్నాయి.

ఇదే **ఊగెడు కుర్చీలు** కథ.

శక్తిగల వ్యక్తులు ఈ సమాజంకి ప్రధానం; లేకపోతే అది సమర్థించుకోలేక కూలిపోతుంది.

సమాజ పురోభివృద్ధికి దోహదం చెయ్యలేని వ్యక్తివాదంకి అర్థం లేదు. చెక్కగానుక నూనె ఉత్పత్తికి ఉపయోగించే ఎద్దులలాంటి వ్యక్తులే - రవంతైనా కళాత్మక, సాంస్కృతిక అపేక్ష లేనివారే - ఆ సమాజంలో కనిపిస్తారు. వారికి Philistines[2] అని పేరుంది; ఆ సమాజం ఒక పారని మురికిగుంట.

రాజకీయ, ఆర్థిక రంగాల్లో అభ్యుదయకర వాదనలు ప్రయోగించేవారిని చూస్తే నాకు చోద్యంగా ఉంది. స్త్రీ పురుష సంబంధాలు, వ్యక్తిత్వం అనే విషయాల్లో వాళ్ల దృక్పథంలో ఒక పెట్టుబడిదారుకున్న వివేకం కూడా లేకపోవడం, వారి వాదాల్లో ఒక అనుభవశాలికి ఉండవలసిన పరిజ్ఞానం కూడా కనిపించకపోవడం, ఎంత శోచనీయం! అంతేకాదు. అజ్ఞానులు, తెలివిమాలినవారు అని వీళ్ళు వర్ణించేవారిలాగే వీళ్ళలోనూ భూస్వామ్య మనస్తత్వం (Feudal Mentality) ఆకొట్టుకొనివుందని వీళ్ళ విమర్శనలు మనకి తెలియజేస్తున్నాయి.

---

[2] Smug and ignorant, and indifferent or hostile to artistic and cultural values

ఒక సాహిత్యపరుడుగా నాకు వీళ్ళకున్న రాజకీయ, ఆర్థిక ప్రశ్నల దృక్పథంలో ఎటువంటి పొత్తూ లేదు; కాని ఒక బుద్ధిజీవిగా (Intellectual) నాకు వీళ్ళతో ఒద్దిక ఉంది.

ఈ సమాజంలో మేమందరం మా మా వ్యక్తిగతభావలతో మెలగవలసిన అవశ్యకత ఉంది. ఈ తరంలోని వ్యక్తిగత జీవులే వచ్చే తరంకి అగ్రేసరులని నా నమ్మకం.

అందువలనే, ఈ వాతావరణంలోనా వ్యక్తిత్వం (Individuality) కాపాడుకోవాలనే ప్రజ్ఞతో నేను జీవిస్తున్నాను.

********

# ఋషిమూలం

# ఋషిమూలం

## 1

కృష్ణయ్యర్ ఇంటిముందు అగ్రహారం పొడుగునా తూర్పు- పడమటి దిశలో రైలు పట్టాలు కనిపిస్తాయి. రోజువారీ వాటిమీద రైళ్లు పది పన్నెండు సార్లు - ఆ గ్రామస్తులలో చాలామందికి గంట, సమయం తెలియాలని - ప్రయాణం చేస్తాయి. ఇంటి వెనుక కావేరీ నది ప్రవహిస్తోంది. ఎక్కడో కొండల ప్రాంతంలో ప్రసిద్ధిగా పుట్టి, చూసేవారందరినీ మైమరపించి, నురుగు కక్కుతూ, దారిలో గండశిలలని రాచుకుంటూ చివరికి అఖండ కావేరి అని పేరు పొందిన ఆ నది ఇప్పుడు లేదు; తనిక అనుభవించలేని పాత ముచ్చటలు నెమరువేసుకుంటూ, బోసి నవ్వులు నవ్వుతూ, ఆవలించుకుంటూ రోజులు గడిపే ఒక ముసలమ్మలాగ, నీరసంతో, నిమ్మళంగా తన గమ్యంకి ఈ కావేరి ప్రవహిస్తోంది.

ఇటీవల సన్యాసిగా ఐపోయిన కృష్ణయ్యర్ రెండవ కొడుకు రాజారామన్ ఇంటి ముందున్న తాటాకుల పందిరి మధ్యవున్న సిమెంటు దిబ్బమీద కూర్చొని, దూరంలో కనిపించే రైలుబండినీ, మర్రికొమ్మలు గాలిలో ఆడుతూంటే ఆ ప్లేట్ ఫారంనీ చూస్తూవుంటాడు; లేకపోతే ఇంటి వెనుకన కావేరీ సెలయేరు ఒడ్డున మెట్ల పక్కనేవున్న శిధిలమైన దేవాలయంలో - మధ్యాహ్న వేళ, మనుషుల రాకపోకలు ఎక్కువగా లేని సమయంలో - కనిపిస్తాడు. ఆ దృశ్యం ఎలా వర్ణించడం? వెలాకిలా పడుకొని, కుడికాలుని నిలువుగా లేవనెత్తి, దానిమీద ఎడమకాలుని ఆనుకొని ఎడం పాదంని - కుంపటిలోని నిప్పుని విసురుతునట్టు - జోరుగా ఊపుతుంటాడు! కొన్నిసార్లు శరీరంని కుడిపక్కగా నెట్టిపొడుచుకొని, తల నుంచి వాలే కేశంని అరచెయిలో భరించుకొని కావేరీనదిని తేఱిచూస్తుంటాడు; అప్పుడుకూడా నిలువుగా ఉన్న ఆ కుడికాలు, దానిమీద ఆడుతున్న ఎడం పాదం అలాగే ఉంటాయి! వాడి నల్లగడ్డం వెండ్రుకలు పిల్లగాలిలో కదులుతూ, సెలమీద దుమ్ములో కలిసి మాసిపోతూంటే, వాడి కుడిచెయి వేళ్ళమధ్య నిప్పు ముట్టించిన ఒక బీడీ కనిపిస్తుంది!

రాజారామన్ పడుకొనివున్నా, లేక కూర్చొనివున్నా, అందులో ఒక గాంభీర్యం ఉంటుంది! ఆ భంగిమ చూడడానికి చాలా ఇంపుగా ఉంటుంది!

కావేరీ గట్టుదగ్గర కూర్చొనివున్నా లేక తనింటి ముందు పందిరిలోవున్నా రాజారామన్ చూపు ప్రత్యేకంగా ఎవరిమీదా ఉన్నట్టు కనిపించదు. ఆ గ్రామంలో అతనంటే అందరికీ తెలుసు; కాని వాడికి తన ఎదుట నిలబడే మనుషులుకూడా ఎవరని తెలియదు. వీడి కళ్ళు తెరిచివున్నా ఎదుటవున్న మనిషికి వీడు తన్ను చూడనేలేదనే భావనే కలుగుతుంది. రాజారామన్ చూపులో తన్నే అతనొక అన్యుడుగా చూస్తున్నాడా అనిపిస్తుంది. తనకి దిన చర్యలలో బాగా పరిచయమైనవారినీ, తోబుట్టువులనుకూడా, గభీమని "నువ్వెవరు?" అని వాడు అడిగేస్తాడేమో అనే ధోరణి అందులో కానవస్తుంది. అలవాటుగా వాడెవరుతోనూ మాటాడడు; కాని ఎవరైనా మాటిస్తే తనూ మాటాడుతాడు, కాని అప్పుడుకూడా తనలో వున్న మౌనం భంగంమవకుండా మాటాడతున్నట్టు ఒక ప్రతిధ్వనిగా అది వినిపిస్తుంది. వాడు మాటాడినా అది మౌనంలాగే ఉంటుంది; అందువలన వాడితో ఎవరూ మాటాడరు.

కొన్ని సమయాల్లో ఏదో గుర్తుచేసుకొని రాజారామన్ నవ్వుతాడు. అది చాలా రమణియంగా ఉంటుంది. ఆ దృశ్యం చూసే కొందరికి భరించలేని శోకం కలుగుతుంది. ఆ నవ్వులో - వాడి మీసం, గడ్డం, మించి - రాజారామన్ ఒక చంటిపాపలాగ కనిపిస్తాడు.

** ** **

కృష్ణయ్యర్ కుటుంబం సనాతన ఆచారాలు అనుసరించే కుటుంబం. పెద్ద కొడుకు రఘుపతికి తండ్రిలాగ శాస్త్రజ్ఞానం లేకపోయినా ఆ కుటుంబం పేరూ, ప్రతిష్ట నిలబెట్టడానికి అనుగుణంగా అన్నీ ఆచారాలూ అనుసరించడం అతను అలవాటు చేసుకున్నాడు.

కృష్ణయ్యర్ తనకంటే జ్ఞానస్తుడు, లౌకిక విషయాలో తనకంటే విద్యావంతుడు, సమర్థుడైన రాజారామన్ వలన తన కుటుంబంకి మంచి పేరూ ప్రతిష్ట రాబోతుందని గాఢంగా నమ్మారు. కాని వాడు గడ్డం, మీసాలు, కాషాయ వస్త్రం, చింపి గుడ్డెలతో తిరిగివచ్చినప్పుడు అతను లేరు. వాడు దేశాంతరంలో ఉన్న పది సంవత్సరాలూ

‘రాజారామన్!’, ‘రాజారామన్!’ అని అర్థించుతూ, ఆఖరికి గత సంవత్సరం అతను కన్నుమూసారు.

రాజారామన్ని ఈ అవస్థలో, అతని అనాచార అలవాట్లు చూసిన అగ్రహారం పెద్దలందరూ “మంచిది. వీడిలా చేస్తున్న పాపాలేవీ చూడకుండా అతను పోయారు; అతను నిజంగానే పుణ్యాత్ముడు!” అని కృష్ణయ్యర్ గురించి చెప్పుకొనేవారు.

జుగప్సతో ముఖం ముడుచుకునే అదే పెద్దలు రాజారామన్ని నేరుగా చూసినప్పుడు, ఆ మొహంలోని నవ్వు చూసి, ఆనందించి, “అసలు ఎందుకయ్యా సన్యాసికి ఆచారాలూ, అనుష్ఠణాలూ?” అని తమకు తామే ఓదార్చుకునేవారు.

గత సంవత్సరం కృష్ణయ్యర్ పోయినప్పుడు ఇల్లునిండా గుమిగూడిన అతని బంధువులూ, ముగ్గురు కొమార్తెలూ ఆస్తికి పూర్తిగా పెద్దవాడు రఘుపతి అర్హుడని తెలుసుకొని, అతని ‘అదృష్టం’ గుర్తుచేసుకొని నిట్టూర్పు వదిలారు. బాహటంగా తమ నిరాశ వెల్లడి చెయ్యలేక “అయ్యో, రాజారామన్ లేడే!” అని వాళ్లు వాపోయారు.

కృష్ణయ్యర్ ఇంతకు ముందే తన ముగ్గురు అమ్మాయిలకి తగినవిధంగా ఆస్తి పంచడమైంది. రెండవ కొడుకు రాజారామన్ తప్పకుండా తను తుదిశ్వాస విడిచేముందు తిరిగివస్తాడనే నమ్మకం వలన పెద్దవాడికి ఆస్తిని పంచిన తరువాత చిన్నవాడి ఆస్తులని కృష్ణయ్యర్ తనే సొంతంగా నిర్వహించారు.

రాజారామన్ తిరిగిరావడానికి ముందే తను పోతే, వాడి ఆస్తులన్నీ తనలాగే నిర్వహించి. వాటిలో ఎటువంటి లాభమూ ఎదురు చూడక, వాటిని వాటితోనే కలిపి, పెట్టుబడిచేసే బాధ్యత రఘుపతికి అని కృష్ణయ్యర్ వీలునామాలో రాసారు. రాజారామన్ వచ్చిన తరువాత - వాడు తప్పక వచ్చి తీరుతాడు అని అతని నమ్మకం - వాడి వాటా రఘుపతి అందజెయ్యాలనే నిబంధన అందులో ఉంది!

ఆ కుటుంబంలో రాజారామన్కి ‘అంబి’ అని ముద్దుపేరు ఉంది. వాడు తన బంధువులని, ఆస్తిని మానుకొని పది సంవత్సరాలైపోయినా అతని ఆస్తులని ‘అంబి మామిడి తోట’, ‘అంబి వరి పొలం’, ‘అంబి పంట కోత’ అని ఊరులో అందరూ ప్రస్తావించేవారు.

రాజారామన్ వలన తన కుటుంబంకి కీర్తి, యశస్సు రాబోతుందని కృష్ణయ్యర్ గొప్పగా ఎదురుచూసారు.  ఆ నమ్మకం వాడు తన సుపుత్రుడు అనే అపేక్ష వలన మాత్రం కాదు. అలాగైతే ఆ పిచ్చి నమ్మకం పెద్దకొడుకు రఘుపతి విషయంలోనే చోటుచేసుకొనివుండవచ్చు. అలాగ కాకుండా రాజారామన్ దగ్గర మాత్రం అతనికి ఆ విశ్వాసం ఎర్పడడానికి కారణముంది.

రాజారామన్కి కుఱ్ఱవాడుగానే వేదాధ్యయనంలో మంచి అపేక్ష; వాడు కఠిన మత ఆచార సంప్రదాయాలు పాటించేవాడు. రఘుపతి జగడాలమారి; గూండా; అల్లరి చేసేవాడు. వాడికి చదువు రాదని ఊరులో అందరూ అనేవారు.

రాజారామన్ ముందు అగ్రహారంలోని పాఠశాలలోనూ, ఆ తరువాత మాయవరం హైస్కూల్లోనూ చదివాడు. హైస్కూలు చదువు పూర్తైనప్పుడు వాడికి పదిహేనేళ్ళు నిండాయి. వాడు కాలేజీలో చదవాలని కృష్ణయ్యర్ నిశ్చయించారు. అతని పరంపరలో కృష్ణయ్యర్ తప్పిస్తే ఎవరూ ఆంగ్లేయభాష నేర్చుకోలేదు. అతను మాత్రం తన హైస్కూలు చదువు ముగించి  చిదంబరం అణ్ణామలై విశ్వవిదాయాలయంలో చేరి ఒక సంవత్సరం ఐన వెంటనే  "ఇక చాలు!" అని ఆపేసారు. అందువలనే ఇప్పుడు  'మన అబ్బాయి చదవనీ! వీడికి ఇదొక మంచి తరుణం! వీడిని చదవించడానికి నాకూ డబ్బుంది!' అని అతను ఆలోచించారు.

అతను రాజారామన్ని అణ్ణామలై విశ్వవిదాయాలయంలో చేర్చారు.

అప్పుడు కృష్ణయ్యర్ బాల్య స్నేహితుడు సాంబువయ్యర్ చిదంబరంలో ఒక హోటలు నిర్వహించేవారు.

సాంబువయ్యర్ ఒక పాలఘాట్ బ్రాహ్మణుడు. సాధువైన మనిషి. తనూ, తన హోటలు తప్పిస్తే అతనికి మరేం చింతలేదనిపిస్తోంది. ఎప్పుడైనా ఆలోచన వస్తే అతను కృష్ణయ్యర్కి ఒక కార్డు రాసి పంపుతారు.

"కృష్ణా, నిన్న ఎవరితోనో మాటాడుతూ నిన్ను గుర్తుచేసుకున్నాను. నాకు నిన్ను చూడాలనివుంది; రేపు వస్తాను. నువ్వు మరేం పనిమీద ఎక్కడకీ వెళ్ళవద్దు!" అని తను మాటాడుతున్నట్టే పెద్ద పెద్ద అక్షరాలతో అతనికి కార్డులు రాసి పంపుతారు.

సాంబువయ్యరికి శరీరం, శారీరం, రెండూ కొంచెం ఎక్కువే. అతను మెల్లగా మాటాడితే గొంతు మూసుకొని, అసలు ఏ ధ్వనీ బయట వినిపించదు. అందువలనే అతను దమ్ము పట్టి, ఎత్తు స్థాయిలో, పొట్ట పట్టుకొని గట్టిగా మాటాడతారు.

సాంబువయ్యర్ ఉత్తరం చదివినప్పుడు అందులోని పెద్ద అక్షరాలు కృష్ణయ్యర్కి ధ్వనిలాగ వినిపిస్తాయి.

సాంబువయ్యర్ గ్రామంకి వచ్చారంటే కృష్ణయ్యర్కి ఒక రోజంతా నిమిషాలుగా గడచిపోతున్నట్టనిపిస్తుంది.

పొద్దున్న ఆరుగంటలకి వచ్చే పాసంజరు రైలులో సాంబువయ్యర్ వస్తారు; రాత్రి పదిగంటలకి వెళ్తున్న మరొక పాసంజరు రైలులో అతను తిరిగి వెళ్ళిపోతారు. ముప్పై మైళ్ళ దూరం; పాసంజరు రైలు కాబట్టి గంటన్నర ప్రయాణం.

అలవాటుగా ప్రతీనెలా వారానికొకసారి - శెలవుకని హోటలు మూసేసిన బుధవారం - సాంబువయ్యర్ కృష్ణయ్యర్ని చూడడానికి వస్తారు.

కృష్ణయ్యర్ భార్య ఉన్న రోజుల్లోనూ సాంబువయ్యర్ ఒంటరిగానే వచ్చేవారు. ఇరవైఐదు సంవత్సరాలముందు కృష్ణయ్యర్ భార్య ఇందుమతి తన ఆరవ ప్రసవంలో కన్నుమూసింది. ఆవిడ ఉన్నంతవరకూ ఇంటిలో ఇద్దరికీ విందు భోజనం వడ్డించిన తరువాత, ఒక స్తంభం దగ్గర నిలబడి ప్రతీసారి "మీరు మళ్ళీ వచ్చినప్పుడు మీ ఆవిడతో రండి!" అని అంటూ ఉండేది.

సాంబువయ్యర్ లజ్జతో, భోజనం చేస్తూనే, తలెత్తకుండా, "సరేలేండి . . . మీరూ ఒక సారి రావొచ్చుగా?" అని అడుగుతారే కాని ఒకసారి కూడా అతని భార్య ఈ ఇంటికి రాలేదు; ఈ ఇంటినించి ఎవరూ వెళ్ళలేదు.

అన్యోన్యమైన మిత్రులు కృష్ణయ్యర్, సాంబువయ్యర్ కలుసుకున్నారంటే ఇద్దరూ ఈ ప్రపంచమే మరిచిపోతారు. అతను వస్తున్నారని తెలియగానే కృష్ణయ్యరు ఆ రోజు తన వ్యవహారాలన్నీ తాత్కాలికంగా ఆపేస్తారు. పొద్దున్న ఆరుగంటలకి రైలు స్టేషన్ కి వచ్చి తూర్పు దిశలో వచ్చే పాసంజరుకోసం కాచుకొని నిలబడతారు.

రోజంతా - ఒక చెయిలో గొడుగు, మరొక చెయితో పంచె కొన పట్టుకొని - నవ్వుతూ, మాటాడుకుంటూ జతగా ఇద్దరూ పొలాలు, తోటలు తిరుగుతారు. బిగ్గరగా

అరుస్తూ పొద్దున్నా, సాయంకాలమూ, కావేరీలో ఒక గంట స్నానం చేస్తారు. తోటలోనో, నుయ్యిగట్టులోనో, అగ్రహారంలోనో లేక ఇంటికెదురుగా కనిపించే పాకలోనో కూర్చొని ఏదైనా కొఱుకుతారు. ఆ ఆ ఋతువుకి తగినట్టు పళ్ళు - పనసపండుని నెయ్యిలోనో, లేక అరటిపండుని తేనెతోనో తడిపి - తింటుంటారు. తన తాళంచెవుల గుత్తినుంచి వేలాడుతున్న చాకుతో దోసకాయని తునకలు చేసి కృష్ణయ్యర్ సాంబువయ్యర్కి అతిథి సత్కారం చేస్తారు.

ఒక కంచం నిండా తమలపాకుకట్ట, వక్కపొడి, పొగాకు; ఒక కూజానిండా తాగడానికి నీరు; ఉంటాయి. సాయంకాలం ఇంటిలోని నౌకరులు వీళ్ళు ఎక్కడున్నారని వెతుక్కొని, వీళ్ళు అడక్కుండానే, కాఫీ, టిఫను తీసుకొని వస్తారు. రాత్రి భోజనం తరువాత ఎదుటనున్న స్టేషన్ ప్లేట్ ఫారంలో ఇద్దరూ విశ్రాంతి తీసుకుంటారు. సాంబువయ్యర్ని సాగనంపడానికి నౌకరులు చేతులు కట్టుకొని దూరంలో నిలబడతారు; ఆఖరికి రైలు వచ్చే సమయం దగ్గరపడుతూంటే కృష్ణయ్యర్ "మీరీ రాత్రి ఉండి రేపు వెళ్ళవచ్చుగా?" అని తన పాత పాడుతారు.

"అది నాకోసం కాచుకొనిపుంటుంది . . . నేను 'ఇవాళ రాత్రి వచ్చేస్తాను' అని చెప్పి వచ్చాను. అది ఒంటరిగా ఉంటుంది. పొద్దున్న నాకు పని ఉంది . . . " అని ఏదో ఒక కారణమో లేక అన్ని కారణాలూ చెప్పుకుంటూ సాంబువయ్యర్ శెలవు పుచ్చుకుంటారు. అప్పుడెల్లా రఘుపతి మాత్రం 'సాంబు అంకుల్,' 'సాంబు అంకుల్,' అని ఇతని చుట్టూ తిరుగుతుంటాడు.

రాజారామన్ని చూడాలంటే వాడిని పిలవాలి, అప్పుడే వస్తాడు. ఎవరైనా మాటాడితేనే తనూ మాటాడతాడు. కాని ఎదడిగినా స్పష్టంగా జవాబు చెప్తాడు. వచ్చిన పని అవగానే "ఇక నేను వెళ్ళనా?" అని పెద్దల ధోరణిలో అడుగుతాడు. ఉత్తికే, పిచ్చాపాటికి ఎవరైనా పిలిచారంటే వాళ్ల మొహంలోని తెలివితక్కువతనం బాగా కనిపిస్తుంది, అది చూసి చిన్నగా నవ్వుకోవలసిందే!

'సాంబు అంకుల్' రాగానే రాజారామన్ని వెదుకుతారు. కృష్ణయ్యర్ పిల్లలందరూ తల్లిప్రేమ అంటే ఏమిటో తెలియక పెరిగినవారే, కాని రాజారామన్ మాత్రం అతనికి అలా కనిపిస్తాడు. వాడి తల్లి ఉన్న రోజుల్లోనూ రాజారామన్ అలాగే కనిపించేవాడు.

అందువలనే సాంబువయ్యర్కి వాడంటే దాక్షిణ్యం. వాడి కళ్ళలో కాంతిగా ప్రకాశించే ఎందులోనో అతనికి ఒక విధమైన పారవశ్యం; వాడికి తల ముందుభాగంలో బాగా గొరికేసిన తరువాత ఒక పిలక; చెవుల్లో ఎఱ్ఱని కమ్మలు; మోకాలువరకూ మూసుకున్నట్టు బాగా ఎత్తి తొడుక్కున్న తువ్వాలు; బక్కపలచని ఆ శరీరంలో పక్కటెముకలు బాగా కనిపిస్తున్న ఛాతీమీద జందెం. చూడగానే 'వీడొక వేదవిత్తు' అందరికీ అనిపిస్తుంది.

సాంబువయ్యర్ వాడిని రమ్మని పిలిచినప్పుడెల్లా రాజారామన్ తన గదిలో ఏదో చదువుతుంటాడు, లేకపోతే ధ్యానంలో ఉంటాడు. వాడు వచ్చిన తరువాత వాడిని ఎందుకు పిలిచారని అతను మరిచిపోతారు! వాడిని దయతో చూస్తారు; దగ్గరకి రమ్మని పిలిచి, వాంఛతో ముద్దులాడతారు: "నువ్వు బాగా చిక్కిపోయావ్ . . . సరిగ్గా భోజనం చేస్తున్నావా? ఎప్పుడూ చదువుతూంటే మంచిది కాదోయ్! కొంచెం ఆటలు కాడా ఆడాలి! గల గలా నవ్వుతూ ఉండాలి . . . " అని ఉపదేశించేవారు. అప్పుడుకూడా రాజారామన్ ఏమీ అనక ఊరుకుంటాడు.

కృష్ణయ్యర్ మాత్రం ఇవన్నీ చూసి సాంబువయ్యరికి సంతానం లేని కొఱత గుర్తు చేసుకొని ఒక నిట్టూర్పు వదలుతారు.

రాజారామన్ బాగా పాడతాడుకూడా; వాడి కంఠస్వరం ఒక ఇంపైన సంగీత వాద్యంలాగ ఉంటుంది. వాడికి ఎటువంటి సంగీతాభ్యాసం లేదు; కాని శ్రుతి శుద్ధంగా ఉంటుంది, తాళం తప్పదు.

సాంబువయ్యర్ తను వచ్చినప్పుడెల్లా ఒకసారైనా రాజారామన్ పాట వినకుండా ఉరికి తిరిగి వెళ్ళారంటే తనేదో పోగొట్టుకున్నట్టు ఉరుకి వచ్చినతరువాత బాధ పడతారు.

పాడమని అడగ్గానే రాజారామన్ పాడతాడు; ఎటువంటి నిర్లక్ష్యత, సంకోచం ఉండదు. తనలో నిత్యమూ వ్యాపించుకొనివున్న నాధప్రవాహం అందరూ విని అనుభవించనీ అనే ఔదార్యం తోచగానే ఒక ద్వారం తెరిచినట్టు, అడిగిన మాత్రం కళ్ళు మూసుకొని, నోరి తెరిచి, ఒక ఉపాసకుడులాగ పాడతాడు.

వాడు మహిషాసురమర్ధిని స్తోత్రం, సుప్రభాతం పాడినప్పుడు అవన్నీ వాడే రాసాడా అని శ్రోతలు పరవశమైనట్టు పాడతాడు. వాడి సంస్కృత ఉచ్చారణ స్పష్టంగా ఉంటుంది; అలాగే తమిళ స్తోత్రాలు పాడినప్పుడు తమిళ ఉచ్చారణ సముచితంగా ఉంటుంది.

పాడి ముగించి, రాజారామన్  కళ్ళు తెరిచి మౌనంగా చూసినప్పుడు 'ఇక నేను వెళ్ళనా?' అని అడిగినట్టుంటుంది. కొన్నిసార్లు అలాగ అడిగేస్తాడుకూడా! ఇతరులతో తనకి సహచర్యం  అనవసరం అనే ధోరణి వాడిలో కనిపిస్తుంది. తన్నెవరో, ఎక్కడికో పిలుస్తున్నట్టూ, తనూ నిత్యం సిద్ధంగా ఉన్నట్టూ కనిపిస్తాడు.

** ** **

సాంబువయ్యర్ ముందే కృష్ణయ్యర్కి చెప్పివున్నారు: "కృష్ణా, హైస్కూల్  చదువు పూర్తైనవరకూ అంబి నీ కొడుకు. ఆ తరువాత వాడిని చిదంబరంలో నాతో వదిలేయ్! వాడి కాలేజీ చదువు - పూర్తిగా నా బాధ్యత, నేను చూసుకుంటాను. సరేనా, ఏమంటావ్?  . . నీవేం అనక్కరలేదు, ఇదే నా ప్లాను!" అని  దృఢంగా అనేసారు.

అలాగే, రాజరామన్కి పదిహేనేళ్ళు నిండగానే కృష్ణయ్యర్ వాడిని చిదంబరంలో కాలేజీలో చేర్చి సాంబువయ్యర్ ఇంటికి వచ్చి  శారదా ఆంటీ చేతుల మీదుగా అప్పగించారు.

అప్పుడే కృష్ణయ్యర్ సాంబువయ్యర్ భార్య శారదాని మొట్టమొదటిసారిగా చూసారు.

ఆవిడని చూడగానే రాజారామన్ ఐదు సంవత్సరాలముందు కన్ను మూసిన తన తల్లిని గుర్తుచేసుకున్నాడు. ఆ ప్రజ్ఞతో వాడి హృదయంలో ఒక విధమైన ఆహ్లాదం, భయం చోటుచేసుకున్నాయి. తన హృదయ స్పందన తన చొక్కాయికి పైన ఇతరులకి తెలిసిపోతుందనే కలవరంతో తన చెయితో బాగా అణచుకున్నాడు.

కృష్ణయ్యర్ శారదా ఆంటీ దగ్గఱ వాడిని ఒప్పగించి శెలవు తీసుకున్నప్పుడు రాజారామన్ వెక్కి వెక్కి ఏడ్చాడు; అది వాడికే వింతగా కనిపించింది.

"ఇదేం పెర్రితనం? మీ అంకుల్ నీ గురించి ఎప్పుడూ గొప్పగా పొగడుతుంటారే? ఇంతేనా నువ్వు?" అని నవ్వి, మందలించుతూ శారదా ఆంటీ  వాడిని బలంగా కౌగిలించుకుంది.

పట్టుచీరలోని ఆమె వాసన, ఆవిడ శరీరంలోని సౌమ్యం, ఆవిడ మనసులోని ఆదరణ, ఆ కౌగిలిలో సుఖం - అవన్నీ వాడికి సరికొత్త అనుభవాలు.

అప్పుడుకూడా రాజారామన్ మనసులో ఆంటీని తన తల్లితో సరిపోల్చుకున్నాడు.

తన తల్లికంటే ఈ ఆంటీ కొంచెం పొడుగాటి మనిషి. ఛాయలో ఎర్రగా కనిపిస్తున్నారు. అమ్మకంటే ఈవిడకి తనంటే మక్కువ అనిపించింది.

రాజారామన్ తల్లి బలహీనంతో, నిత్యమూ తన్ను మెల్లమెల్లగా నశించే వ్యాధితో, రెండు సంవత్సరాలకొకసారి ప్రసవంలో బాధపడుతూ ఎల్లప్పుడూ చిరచిరలాడుతూ ఉంటుంది. తన శరీరంలో నిత్యమూ ఎక్కడో ఒక అంగంలో నొప్పి ఉన్నట్టు పెదిమలు కొరుకుతూ ఉంటుంది. ఆవిడ బొట్టు చూస్తే అది నుదురులోని ముడతలవలన ఒక గీతలాగ కనిపిస్తుంది. రక్తహీనమైన ఆ తెల్లని ముఖంలో ఆమె పూసుకున్న పసుపు అతుకులు అతుకులుగా కనిపిస్తుంది. నిత్యమూ చంటిపాపని అణచుకొని పడుకొనివుంటుంది. ఆమె బతికి ఉన్నంతవరకూ పిల్లల గతి ఆ ఇంటిలో కఠినంగానే సాగింది.

'పిల్లలు పరగెత్తకూడదు, ఏడవ కూడదు, సద్దు చెయ్యకూడదు' - ఇంటిలో ఇలాగ ఎన్నో షరతులు ఖచ్చితంగా పాటించేవారు.

అసలు రాజారామన్ని తీర్చిదిద్దిన క్రమశిక్షణ ఈ నియమాలే అనవచ్చా? ఆ విధులు మీరినప్పుడు రఘుపతితోబాటు తక్కిన పిల్లలుకూడా తిట్లూ, దెబ్బలూ అనుభవించారు.

అమ్మని చూడాలని ఎప్పుడైనా రాజారామన్ గది తలుపు తెరచుకొని లోపలకి వెళ్తాడు. అప్పుడుకూడా తక్కిన పిల్లలలాగే తన్నూ తరుముతున్నారని గ్రహించి మొహం ముడుచుకునేవాడు. ఆ కటువైన అనుభవాలు వాడి మనసులో స్థిరంగా నాటుకున్నాయి.

ఇంటిలోని నౌకరులు, వంట మనిషిగా పనిచేసిన ఒక ముసలమ్మ - అసలు వీళ్ళే ఆ పిల్లలని పెంచారని అనాలి. తరచుగా కృష్ణయ్యర్ పిల్లలతో టూకీగా ఆడడం, బెదరించడం, ఉపదేశం, బుద్ధిచెప్పడం, చేసేవారు; రాజారామన్ విషయంలో అవన్నీ అనవసరమనిపించాయి.

**　　**　　**

రాజరామన్ని కాలేజీలో చేర్చడానికి ముందురోజు కృష్ణయ్యర్ వాడిని చూడాలని పిలిచారు. వాడిని "పిలక తీసేయ్, క్రాపు పెట్టుకో!" అని భోదించారు. వాడి కమ్మలు, పిలక చూసి తక్కిన విద్యార్థులు ఎగతాళి చేస్తారనే కారణం విని రాజారామన్ మొదటిసారిగా చిరచిరలాడాడు.

"జందెం కూడా చింపేసి చెయిలో ఒక సిగరెట్టు కూడా కాల్చమంటారా?" అని వాడు అడిగిన ప్రశ్న విని అతనికి భయం కలిగింది. ముందటి రోజు ఇలాంటి ప్రశ్న అడిగినవాడు మరుదినం కృష్ణయ్యర్ శెలవు పుచ్చుకున్నప్పుడు ఎందుకు ఏడ్చాడని వాడికే అర్థంకాలేదు.

ఆ తరువాత కృష్ణయ్యర్ కమ్మలు, పిలక గురించి ఏ మాటా ఎత్తనేలేదు. 'అదేదో వాడిష్టం!' అని వదిలేసారు. దానిగురించి అతనికి కొంచెం గర్వంకూడాను.

రెండు మాసాల తరువాత అతను వాడిని చూడాలని చిదంబరం వచ్చినప్పుడు రాజారామన్ని 'క్రాపు'తో చూడగానే అతనికి ఆశ్చర్యం కలిగింది. దానితో భయమూ చోటుచేసుకుంది. వాడి చొక్కాయి మెడపట్టిని తెరిచి ఎడమ భుజం చూసారు; జందెం ఉంది!

"ఆంటీ క్రాపు గురించి మాత్రం నాకు చెప్పారు," అని తల వంచుకొని రాజారామన్ అన్నాడు; కృష్ణయ్యర్ నవ్వారు.

వంటగదిలోనుంచి ఆంటీ మాటలు వినిపించాయి: "అంకుల్ కూడా అన్నారు; అందరిలాగే మన పిల్లలూ ఉండాలని నాకు ఆశ. పిలక ఎక్కడకి మాయమైపోతుంది? కావాలంటే ఎప్పుడైనా పెట్టుకోవచ్చు. మన అంబికి క్రాపు కూడా చక్కగా ఉందిగా? క్రాపు పెట్టుకుంటే వాడు మన ఆచారాలేవీ మరిచిపోలేదే? ఈ రోజుల్లో ఏ అబ్బాయి రెండు సార్లు సంధ్యావందనం చేస్తున్నాడు? ఇన్ని పూజలూ, వ్రతాలూ చేస్తున్నాడు? అంబీ అవేం మరిచిపోడు!" అని ధైర్యమిస్తున్నట్టు ఆవిడ మాటాడింది.

"మేం గ్రామంనుంచి బయలుదేరినప్పుడు నేనూ అదే చెప్పాను: వాడు అప్పుడు వినలేదు. నాకు తెలుసు. ఒక నెల తరువాత ఇతరులని చూసి వీడు మారుతాడు అని" అన్నారు కృష్ణయ్యర్.

“హో, అలా అంటున్నారా? వీడెవరిని చూసినా మారే రకం కాదు! మా ఆవిడ చెప్పింది. అంతే, దానికి మారుమాట లేదు!” అన్నారు సాంబువయ్యర్.

“అదీ మంచిదే. నాకూ సంతోషమే! వాడికి బుద్ధిచెప్పడానికి  మరెవరున్నారు?” అన్నారు కృష్ణయ్యర్.

రాజారామన్ ఏమీ అనక ఊరుకున్నాడు.

** ** **

రాజారామన్ వచ్చిన తరువాత సాంబువయ్యర్ ఇంటిని ఒక శోభ ఆవరించుకుంది.

ఇంతకుముందెల్లా పొద్దున్నే లేచి హోటలుకు వెళ్లి, మధ్యాహ్నానం తిరిగివచ్చి, మౌనంగా  భోజనంకి చెయ్యడం, వరాండాలో చాప పరిచి కొంతసేపు నిద్రపోవడం, మళ్ళీ హోటలుకి వెళ్ళి రాత్రి పదగంటలకి తిరిగి రావడం - ఇదే సాంబువయ్యరుగారి దినచర్యగా ఉండేది. ఇప్పుడు రాజారామన్ కాలేజీకి వెళ్లే సమయం తప్పిస్తే తక్కిన వేళలలో వాడు ఇంటిలో ఉన్నాడనే నెపంమీద అతనూ ఇంట్లోనే ఉండడం అలవాటు చేసుకున్నారు.   భోజనం చేసినప్పుడూ, తక్కిన సమయాల్లోనూ ఆంటీతో మాటాడేవారు.

ఆంటీ మొహం చూసి సాబువయ్యరు ఎన్నడూ మాటాడారు; గోడని చూస్తూనో, లేక విసినకర్ర తాటాకును చీల్చుతూనో మాటాడతారు. తను ఈ ఇంటిలో లేనప్పుడు ఆ దంపతులు ఎలా సంభాషించుకొనేవారు అని రాజారామన్ ఆశ్చర్యపడేవాడు.

రాజారామన్ వచ్చినతరువాత ఆ దంపతులమధ్య ఒక వంతెనగా మారాడు.

సాబువయ్యరు ఇంటి నడిమిలో పాచికల ఆట కోసం గీతలు సెమెంటు నేలమీద పదిలమై ఉంటాయి. మధ్యాహ్నమంతా ఆంటీ, ఇరుగుపొరుగు స్త్రీలూ అక్కడ గుమికూడుకొని ఆడుతుంటారు.

ఇప్పుడు కాలేజీ సెలవురోజుల్లో ఆంటీ, సాంబువయ్యర్, రాజారామన్ ముగ్గురూ పాచికలాడాడం అలవాటు చేసుకున్నారు; పద్దెనిమిది సంవత్సరాలు నిండిన రాజారామన్  ఆ దంపతులమధ్య ఉన్న బిగువుని సడలించాడు.

రాజారామన్ ఆ ఇంటికి వచ్చినప్పుడు ఆంటీకి ముప్పైఐదు నిండాయి. ఐనా కూడా ఒక మధ్యాహ్నం కాలేజీనుంచి వచ్చినప్పుడు ఆంటీ పాచికలాడుతున్న ఇరుగుపొరుగు

కన్య స్త్రీల మధ్య ఆవిడని సరిపోల్చుకోలేక, ఆమె యౌవనం అతనికి ఆశ్చర్యం వింతగా కనిపించింది.

రాజారామన్ని యువకుడుగా భావించి వెంటనే అక్కడనుంచి నిష్క్రమించాలా, లేక అతన్నీ కుఱ్ఱవాడుగా భావించి ఆటకి పిలవాలా అని ఆ స్త్రీలు కంగారు పడుతుంటే . . .

“మా అంబీ వచ్చేసాడు,” అని అంటూ అంటీ ఆటనుంచి లేచిపోయింది.

“ఆంటీ, మీరు ఆడండి,” అని చెప్పి రాజారామన్ తన గదికి వెళ్ళాడు.

వాడి వెనకాలే వచ్చిన ఆంటీ “నువ్వూ రా, ఆడదాం,” అని అనగానే రాజారామన్ ఆమెని తేఱిచూసాడు.

“నాకు ఆడవాళ్ళతో ఆడే అలవాటు లేదు . . . ”

“మరి నాతో ఎందుకు ఆడుతున్నావే?”

“మీరు నాకు అమ్మలాగ . . . ” అని వాడు అనగానే ఆంటీ మనసు కరిగిపోయింది.

ఆ మాటలనగానే రాజారామన్ మొహం ఎఱ్ఱపారిపోయింది; తల వంచుకున్నాడు. వాడోమో తటాలున ఎదిగినట్టు, పెద్దవాడుగా మారిపోయినట్టు ఆంటీకి ఇప్పుడు తోచింది. తల వొంచి నిలుచున్న ఆ భంగిమలో తేలికగా పెరిగిన మీసం కనిపించింది. కాని ఆ ఎర్రని పెదిమలు చూస్తే ‘వీడు ఇంకా పిల్లవాడే!’ అని ఆవిడకి అనిపించింది.

“నీలాంటి పిల్లవాడికి తల్లిగా ఉంటే అది ఎంత భాగ్యం!” అని ఆంటీ వాడి బుగ్గని ఊద్చుతూ దృష్టి తీసింది.

సాంబువయ్యర్కి ఇలాగ తన భావనలు నోరు విప్పి బాహాటంగా తెలియజేయడం చేతకాదు. అతను మనసార రాజారామన్ని తన కొడుకుగా స్వీకరంచి చాలాకాలమైంది. ఇప్పుడు కొన్నిరోజులుగా కృష్ణయ్యర్ సమ్మతితో రాజారామన్ని దత్తు తీసుకుందామని అతనికి ఆశ; కాని కృష్ణయ్యర్ అందుకు ఏకీభవించరేమో అని భయమూ ఉంది. ‘సరేలే, దత్తు తప్పనిసరి కాదు; వీడు శాశ్వతంగా ఈ ఇంటిలో ఉండడానికి ఏదైనా ఏర్పాటు చేస్తే చాలు . . . ఇంకా రెండు సంవత్సరాలలో వాడి చదువు పూర్తి ఐపోతుంది. ఆ తరువాత ఇక్కడే వాడికి ఒక ఉద్యోగం ఏర్పాటు చేస్తే వాడెప్పుడూ మనతో ఉంటాడు, . . ,’ అనే పేరాశ కూడా. ఇవన్నీ మెల్లమెల్లగా నెరవేరుతాయనే ఊహలోనే అతను తెప్పతేలారు.

ఇన్ని సంవత్సరాల దాంపత్య జీవితంలో వారిద్దరికీ మధ్యవర్తిగా తమ భావనలు పంచుకోడానికి ఎవరూ లేని కారణంవలనే చాలా రోజులవరకూ ఆ దంపతులు గోడని చూసుకుంటూ మాటాడడం, ఒక మధ్యవర్తిని కల్పించుకొని సంభాషించడం జరిగింది. అందువలనే ఇద్దరిమధ్యా ఒక విధమైన సదూరంతోబాటు విరక్తి, ఎడబాటు చోటుచేసుకున్నాయి. మరి ఇప్పుడో? రాజారామన్ రాకతో ఆ 'దూరం' తక్కువైంది; భార్యాభర్తలు సూటిగా ఒకరినొకరు చూసి మాటాడం అలవాటు చేసుకున్నారు. ఆ మధ్యవర్తిపట్ల తమకున్న ఆలోచనలు, అపేక్ష, బెంగ, అన్నీ పరివర్తన చేసుకున్నారు. ఇంతకాలమూ వాళ్ల దాంపత్యంని ఆవరించుకున్న శూన్యత ఇప్పుడు తొలగిపోయిందికదా?

సాంబువయ్యర్ నవ్వికూడా శారదా ఆంటీ చూడలేదు. అతనికని ప్రత్యేకంగా, శ్రద్ధతో ఆవిడ ఎది వండినాకూడా, 'బాగుంది!' అని అతను ఎప్పుడూ అనరు. అదేలాగ ఆవిడ ఒక రోజు ఉప్పు లేకుండా వంట చేసినా, లేక పొరబాటున ఉప్పు అధికంగా వాడినా, అతను గొణుక్కోరు, మొహం ముడుచుకోరు. ఆ తరువాత, తనే భోజనం చేసినప్పుడు ఆంటీ అది కనిపెట్టి 'నా ప్రాప్తం ఒక పరబ్రహ్మం!' అని ఒక నిట్టూరు వదులుతుంది.

అలాగే తనకేంకావాలో అంటీ హక్కుతో నోరు విప్పి భర్తని ఎప్పుడూ అడగదు. ఆవిడ వంటగదిలో పని చేస్తున్నప్పుడు ఏదో పాట పాడుతున్న రీతిగా ఆ ముందురోజు చీరలమ్మేవాడు వచ్చాడని, వాడిదగ్గర తను రెండు పట్టుచీరలు 150 రూపాయలకి కొన్నట్టు - ఒంటరిగా - తనలో చెప్పుకుంటుంది. ఆ సాయంకాలమో లేక మరుదినమో అంటీ ఇంటి నడిమిని దాటుతుంటే సాంబువయ్యరు లోకప్పుని చూసుకుంటూ మాటాడుతారు:

"గోడలోని గూడులో రెండువందలు ఉంచాను - చీరలవాడికని. మిగతా యాభై రూపాయలు అలాగే ఉండనీ . . . "

ఆంటీ పట్టుచీరలే కట్టుతుంది; వజ్రం నగలే వాడుతుంది.

ఇరుగుపొరుగుల స్త్రీలకి ఆవిడని చూస్తే అసూయ, కడుపు మంట. 'ఆవిడకి ఎది కావాలన్నా భర్త వెంటనే కొని ఇచ్చేస్తారు! మనకి చీర కావాలన్నా, ఎది కావాలన్నీ ఎప్పుడూ పెద్ద గొడవే!" అని వాళ్ళు విసుగ్గునేవారు. కాని ఆంటీ భర్తతో కలిసి

కోవిలకని, సంబరాలకని, బజారుకని, పెళ్ళికని, బయటకి వెళ్ళడం ఎవరూ చూడలేదు. ఇంటిలోనూ ఇద్దరూ కలిసి మాటాడుకోవడం ఎవరూ చూడలేదు.

ఆ దంపతుల అంతరంగ జీవితం వాళ్ళకే ఒక రహస్యంగా గడిచింది.

ఎప్పుడైనా ఒక సారి ఇంటి వసారాలో దోమతెర కట్టి పక్కనే బల్లలమీద విరిసిన సాంబువయ్యర్ పడక ఖాళీగా ఉంటుంది; అదెవరైనా చూసేస్తారోమో అని భయపడినట్టు ప్రాతఃకాలంలోనే అక్కడకివచ్చి పడుకుంటేనే అంకుల్కి నిద్ర వస్తుంది.

రాజారామన్ పరీక్షలకని మెలకువగా రాత్రంతా చదువున్నాడని ఆ దంపతులు కూడా నిద్రపోకుండా ఆ రాత్రంతా పాచికలు ఆడుతూ కాలం గడుపుతారు. మధ్య, మధ్య, శారదా ఆంటీ ఫ్లాస్క్ లో కాఫీ, లేక టీ రామనాధన్కి అందిస్తుంది. "మీరూ నిద్రలేకుండా ఉన్నారే!" అని భర్తకీ కొంచెం ఇస్తుంది. "నీకూ నిద్ర లేదే?" అని సాంబువయ్యరు భార్యకి ఉపచారం చేస్తారు.

రాజారామన్ గదిలో దీపం వెలిగితే ఆ ఇంటినిండా దీపం వెలుగుతుంది; వాడికి నిద్రలేదంటే, ఆ దంపతులూ నిద్రపోరు. వాడి కళ్ళలో కలత కనిపిస్తే, ఆ దంపతుల మనసు తపించిపోతుంది. వాడి మొహంలో రవంతైనా శోకం కనిపిస్తే ఇల్లంతా సంతాపంలో మునిగిపోతుంది.

రాజారామన్ క్షేమంకోసం, వాడి మొహం చూస్తూనే, ఆ దంపతులు జీవించారు. కాని కొన్ని సమయాల్లో ఆ దంపతులు అంగలార్చుకున్నట్టు రాజారామన్ మొహం మాసిపోతుంది. అందుకు కారణమేమిటో అడక్కుండానే ఆ దంపతులు కృశించిపోతారు; ఆ తరువాత, రాజారామన్ మనసు మారి ఆనందిస్తే, అదీ తమకోసమే అన్నట్టు ఆ భార్యాభర్తలు ఆనందిస్తారు.

ఆ దంపతుల ప్రేమానురాగాలు రాజారామన్ని బాహటంగా ఎంత మార్చినా, గ్రామంలో తను అలవాటు చేసుకున్న ఆచారాలేవీ వాడు మానుకోలేదు. పూజగదిలోనో, లేక తన గదిలోనే ఏదో చదువుతూనో, ముందులాగే రాజారామన్ రోజంతా గడిపాడు.

రాజారామన్ కఠినమైన నిష్ఠలు పాటించేవాడు. ఉపవాసం ఉండేవాడు. ఎందుకని తెలియకుండా ఆ భార్యాభర్తలు కూడా నిష్ఠలు పాటించారు, ఉవవాసం ఉంటారు.

అంబికి రేపు పరీక్ష; శారదా ఆంటీ, సాంబువయ్యర్ పొద్దున్నే స్నానం చేసి, ఇద్దరూ కలిసి కోవిలకి వెళ్తున్నారు. ఇన్నిరోజులూ చూడని ఆ దృశ్యం వీధిలో ఇవాళ అందరూ చూసారు. తన కడుపులో పుట్టిన బిడ్డకి కూడా ఆ దేవుడి సన్నిధిలో ఏ దంపతులూ ఆ విధంగా మనసు కరిగించినట్టు పూజ చెయ్యలేదని చెప్పవచ్చు.

రాజారామన్ బయలుదేరేముందు తొందరతొందరగా కోవిలనుంచి పరుగెత్తుకొనివచ్చి వాడిని దీవించుతారు. వాడు వాళ్ళని నమస్కరించి లేచినప్పుడు ఇద్దరూ వాడిని కౌగిలించి నిలబడతారు.

కాని రాజారామన్ ఈ ఉద్వేగస్థాయిలో తనకేం అంటు లేనట్టు కనిపిస్తాడు. 'ఇక నేను వెళ్ళనా?' అని అడుగుతూ, సెలవు పుచ్చుకునే తొందరలో ఇక్కడ తను మెలగుతున్నట్టు కనిపిస్తాడు.

ఏ సమయంలోనూ తన్నెవరో పిలుస్తున్నట్టు, ఆ తొందరలో తను ఇతరుల ప్రేమానురాగాల్లో చిక్కుకున్నట్టు, తను విచ్చలవిడిగా, స్వతంత్రంగా ఎగిరిపోవడానికి సిద్ధంగా ఉన్నట్టు - తన ఏకాంతంని తిరస్కరించే తీరు - వాడిలో కనిపించింది.

అది నిజమేమో? కాని రాజారామన్ మీద తమకున్న వాత్సల్యం ఎంత వ్యర్థమో, చంచలమో అని గ్రహించకుండానే -ఆ దంపతులు తమ ప్రేమానురాగాలు ధారపోస్తూనే రోజులు గడిచాయి.

** ** **

రాజారామన్ పరీక్ష రాసేసాడు. కాలేజీ మూసేసారు. రేపు వాడు తన గ్రామంకి తిరిగి వెళ్ళాలి. సెలవులు అరంభించి అప్పుడే పదిరోజులు గడిచిపోయాయి.

ఈ నాలుగు సంవత్సరాలలో చాలా సార్లు వాడు తన గ్రామంకి వెళ్ళివున్నాడు. కాలేజీ తెరిచిన మొదటిరోజే తిరిగి వాడు వచ్చేస్తాడనే నమ్మకంవున్న ఆ రోజుల్లోనే వాడు ఇంటిలో లేనప్పుడు మళ్ళీ తను గోడనీ, లోకప్పునీ చూసుకుంటూ కాలం గడపవలసిన ఏకాంతంని తలచుకుంటూ శారదా ఆంటీ తపించి పోయేది. ఇప్పుడు వాడి చదువు అంతమవబోతుంది. మరెప్పుడు తిరిగి వస్తాడని యాఢిగా ఏ తేదీ తెలియదే? 'ఎప్పుడైనా వస్తాడు అనే అశతో కాచుకొనివుండవలసిందేనా?" అనే ఆలోచన రాగానే ఆంటీకి తన బతుకే ఒక భ్రమగా అనిపించింది.

రాజారామన్ని తన ఉనికితో నిలకడగా కొనసాగించుకోడడానికి తనకి ఎటువంటి అర్హత లేదని గ్రహించి ఆంటీ మండిపడింది. 'అతనికేం, తలుచుకుంటే మా ఆయన ఒక ప్రయాణంలో అబ్బాయిని చూసి వచ్చేస్తారు!' అనే ఆలోచనతోబాటు మనసులో అసూయకూడా చోటుచేసుకుంది. 'మావారికి రాజారామన్ లేకుండానే ఆ గ్రామంతో పొత్తు ఉంది; నాకు రాజారామన్ లేకపోతే ఇతనితోకూడా పొత్తు లేదే? ఇదేం చుట్టరికం? దిక్కుమాలినవాళ్ళు తమకు తామే మోసం చేసుకుంటున్నారు, అంతే! ఆయువంతా పిల్లవాడిని మడిలో పెట్టుకొని పోషించినా, పది నెలలు కడుపులో మోస్తేనే చుట్టరికం!' అని వాపోవుతూ, తడిసిన కళ్ళూ, ముక్కూ తుడుచుకుంటూ, ఆవిడ తల్లడిల్లి పోతున్నారు. కాని తన వ్యాకులత ఆవిడ ఎవరికీ చెప్పలేదు. ఇతరులు నవ్వితే తనూ నవ్వారు; ఇతరులు మాటాడితే తనూ మాటాడారు.

మరుసటిరోజు రాజారామన్ ఊరుకి వెళ్తున్నాడు. ఆ రోజంతా ఆవిడకి ఇంటిలో పని ఉంది. కాని అంబి సెలవు రోజుల్లోనూ ఆంటీకి ఇంటి పనుల్లో సాయం చేస్తాడు. ఆవిడ వొద్దన్నా ఊరుకోడు. నీళ్ళు తోడుతాడు. రుబ్బురోలులో ఆవిడ పిండి ముద్దలు పోస్తూంటే వీడు నూరుతాడు . . .

అవాళకూడా అలాగే వాడు ఆంటీకి సాయం చేసాడు. ఆ సాయంకాలం, ఎందుకో వింతగా, కోవిలకి వెళ్ళాడు. వాడుకగా వాడు తన పూజగదిలోనే ప్రార్థన చేస్తాడు, కోవిలకి వెళ్ళడు. కాని ఆ రోజు వెళ్ళాడు.

వాడు కోవిలనుంచి ఇంటికి తిరిగి రావడం చూసినట్టు ఎవరో అన్నారు; కాని వాడు ఇంటికి తిరిగిరానేలేదు.

వాడెక్కడికి వెళ్ళాడని ఎవరికీ తెలియదు.

ఆ మరుసటిరోజు సాంబువయ్యర్ తనకి తెలిసిన దేవుళ్ళందరిపేర్లు వల్లించుకుంటూ రాజారామన్ గ్రామంకి పరుగెత్తారు. అక్కడ వాడు లేడని తెలిసి, కృష్ణయ్యర్ని వెంటబెట్టుకొని చిదంబరంకి తిరిగి వచ్చారు. దారిలో ఎవరు కనిపించినా, వాళ్ళకేమైనా పరిచయం ఉందా లేదా అనే ఆలోచన లేకుండానే, "మా రాజారామన్ని చూసారా?" అని అడుగుతూనే ఉన్నారు. అన్ని కోవిళ్ళలో వెదకారు, చెరువు గట్టులన్నీ తిరిగారు. అతని కంఠ్యమైన ధ్వని ఊరంతా వినిపించుతూనే ఉంది.

అతని వాలకం చూసి కృష్ణయ్యర్కి జాలి కలిగింది.

“సాంబూ, నువ్విలా అధైర్యపడకూడదు . . . రాజారామన్ బుద్ధిమంతుడు . . . వాడికేం అపాయం రాదు . . . వాడు తప్పకుండా తిరిగివస్తాడు,” అని అతను ఓదార్చారు.

ఒక వారం తరువాత కృష్ణయ్యర్ సాంబువయ్యరుతో ఆ ప్రాంతంలో ప్రశిద్ధిచెందిన జోస్యుడుకి రాజారామన్ జాతకం చూపించారు.

ఆ జాతకం చూసి ఆ జోస్యుడు గొప్పగా పొగడసాగాడు: “ఇది మీ అబ్బాయి జాతకం అంటున్నారా? స్వామీ, ఇదెవరికీ పుత్రుడుగా మెలిగే వ్యక్తి జాతకం కాదు! . . . కన్నవాళ్ళు అతను తమ సంతానం అని అనుకుంటే అతి ఉత్త భ్రమ! . . . ‘ఆ కర్మ ఏదో మీరే అనుభవించండి!’ అని ఆ జోస్యుడు మీకు చెప్తాడు . . . వినండి, ఈ జాతకంకి అర్థుడు ఒక ఋషి! . . . అతనిగురించి మీకేం విచారం వద్దు, సంతోషంగా, తృప్తిగా, ఉండండి!” అని అంటూనే ఉన్నాడు.

“ఎక్కడకి వెళ్ళాడు, ఎప్పుడు తిరిగి వస్తాడు?” అని సాంబువయ్యర్ క్షోభతో అడగ్గానే ఆ జోస్యుడు నవ్వాడు.

“నేను ఇప్పుడు మీకు చెప్పినది జాతక ఫలం, దానికి పేరు సత్యం. అంతకి మించి మీకు ఏమైనా చెప్తే దానికి పేరు ఊహ! ఊహ నిజమవుతుందా అని మనకి తెలియదు! ఒక వేళ అవొచ్చు . . . మీ అబ్బాయి రావొచ్చు లేక రాకపోవచ్చు!”

పట్టరాని కోపంతో సాంబువయ్యర్ తువ్వాలుని దులుపుకుంటూ లేచారు. “బాగుందయ్యా నువ్వూ, నీ జాతకం!” అని జోస్యుడిని సూటిగా తిట్టి, చిరచిరలాడుతూ, కృష్ణయ్యరుని కూడా లెక్క చెయ్యకుండా తొందరగా వీధిలో దిగి నడవసాగారు.

“సాంబు!”, “సాంబు!” అని అరుస్తూ కృష్ణయ్యర్ అతనివెంట పరుగెత్తుకొని వచ్చారు. సాంబువయ్యర్ నిరాశతోనూ, కోపంతోనూ ఎవరినైనా మొత్తుతారేమో లేక బలాత్కారంగా ఏమైనా చేస్తారేమో అని అతనికి భయం కలిగింది. ఒక దూకు దూకి, గబగబమని పరుగెడుతున్న సాంబువయ్యరిని ఆపి, అతని భావనలు కుదుటపడినట్టు వీపులో మెల్లగా తట్టి మాటాడారు.

"సాంబు, ఇటువంటి సమయంలోనే మనం కొంచెం నిదానంగా ఆలోచించాలి. జోస్యుడు చెప్పినదిలో తప్పేం లేదే? రాజారామన్కి తక్కిన పిల్లలలో ఎటువంటి పోలికా లేదని మనకి తెలుసుగా? అంత చిన్న వయసులోనే వాడంత జ్ఞానస్తుడుగా, భక్తుడుగా కనిపిస్తున్నాడే అని నాకు ఒకటే భయం! 'దేవుడా, వీడు అల్పాయుషులో పోతాడేమో?' అని నాకు దిగులు! మంచి వేళ, దేవుడు మనకి అటువంటి శ్రమ ఇవ్వలేదు. వాడు ఎక్కడో బతికి ఉన్నాడు అని మనకి నమ్మకం ఉంది, అందుకోసం మనం సంతోషించాలి" అని తన కళ్ళు తుడుచుకుంటూ కృష్ణయ్యర్ సాంబువయ్యరిని ఓదార్చారు.

ఇప్పుడు సాంబువయ్యరికి కృష్ణయ్యర్ మీదనే కోపం వచ్చింది.

"నాకేం పోయిందిరా? నేనా వాడ్ని కన్నాను, నేనా వాడ్ని పెంచాను? నా కొడుకైతే ఇలాంటి పని చేసి ఉంటాడా? . . . వాడొక ద్రోహి! ఋషి అని పిలవాలట, ఋషి! వాడొక ద్రోహి! . . . నా బాధ్యత గురించే నేనిలా అల్లాడిపోతున్నాను! నువ్వు నాకు వాడిని అప్పగించావ్ . . . 'ఇదిగో నీ అబ్బాయి!' అని నీకు తిరిగి ఇచ్చేసి 'ఇక మరెప్పుడూ వాడి మొహం చూడకూడదు!' అని గర్జించాలని నాకుంది! కాని ఇప్పుడు నువ్వు 'నా కొడుకు ఎక్కడ?' అని అడిగితే నేను అపరాధ బావంతో ఉరంతా తిరుగుతున్నాను . . . అంతా నా కర్మ! . . . " అని రెండు చేతులతో తలని మొత్తుకుంటూ అతను ఏడవసాగారు.

కృష్ణయ్యర్కి ఏం చెయ్యాలో బోధపడలేదు.

సాంబువయ్యర్ దారంతా ఏడుస్తూనే వచ్చారు. అతన్ని ఓదార్చే విధంగా మరేం ప్రయత్నం చెయ్యక కృష్ణయ్యరు ఊరుకున్నారు.

ఇద్దరూ ఇంటికి తిరిగి వచ్చారు; శారదా ఆంటీ కనిపించలేదు. వంటగదిలోనుంచి వెక్కిళ్ళతో ఏడ్పు, నెత్తిలో బాదుకొనే సద్దు వినిపించాయి. ఆ ఇంటిని పూర్తిగా శూన్యం కప్పేసింది.

సాంబువయ్యరు నడవలో, ఉత్తి నేలమీద కూర్చొని, ఎదుటనున్న గోడని కాలుతో తన్నుకుంటూ, కళ్ళు మూసుకొని రోజంతా గడిపారు. అతని భంగిమ చూస్తే అతని దేహం మెల్ల మెల్లగా గడ్డకట్టిపోతున్నట్టు కనిపించింది.

నేలమీద గొడుగుని ఆనుకొని కృష్ణయ్యరు చాలా సేపు నిలబడ్డారు. ఆఖరికి తనకు తానే వచ్చి ఉయ్యాల బల్ల మీద కొంచె సేపు కూర్చున్నారు. ఆ తరువాత వంటగదికి నడిచారు. తను వచ్చి నిలబడినది కూడా తెలియక ఒక మూల విరియబోసుకొని కూర్చున్న శారదా ఆంటీని చూసి అతను తపించిపోయారు. ఒక దగ్గు దగ్గారు. ఆంటీ అతన్ని చూడగానే చీర మొనని నోటిలో దోపుకొని ఏడ్చింది.

"ఇదేంటి? మీరు వాడిని ఎంత గారాబంగా పెంచారని నాకు తెలుసు. నా మాట వినండి, ఇప్పుడు వాడికిలా ఐపోయిందని మిమ్మల్ని ఎవరూ తప్పుపెట్టరు . . . మనకెందుకు అపనమ్మకం? నాకేమో వాడు తప్పకుండా తిరిగి వస్తాడని నమ్మకం ఉంది . . . వాడెక్కడో బతికే ఉన్నాడు, మీరు ధైర్యంగా ఉండండి!" అని కృష్ణయ్యర్ తేటగా అన్నారు.

"నేనొక పాపిష్టురాలు . . . నాకెందుకీ బతుకు?" అని అంటూ శారదా ఆంటీ తన గుండెలో బాదుకుంది.

తలవంచుకొని కృష్ణయ్యర్ నిష్క్రమించారు; తను ఆ ఇంటిలో ఉన్నంతవరకూ భార్యాభర్తల మనసు కుదుటబడదని అతనికి బోధపడింది.

"సరే, సాంబు, నేను వస్తాను!" అని అతను సెలవు పుచ్చుకున్నారు.

జవాబు లేదు.

"సాంబు, మనం మళ్ళీ కలుసుకుందాం! . . . రాజారామన్ వచ్చాడంటే నీకు రాస్తాను . . . ఇక్కడ వచ్చాడంటే నాకు రాయ్ . . . నేను రాస్తే నువ్వు తప్పకుండా వస్తావు కదూ?" అని పిల్లవాడిని బతిమాలుతున్నట్టు కృష్ణయ్యరు అడిగారు.

కళ్ళుకూడా విప్పకుండా, రెండు చేతులూ జోడించి, పెద్దగా నవ్వుతూ, సాంబువయ్యరు అతన్ని నవస్కరించారు.

ఆ తరువాత, ఒక సంవత్సరం గడిచి, సాంబువయ్యరు శవంని ఆ ఇంటి నడవలో పఱచినప్పుడు కృష్ణయ్యరు పరామర్శకి వచ్చి దాన్ని చూసారు.

అప్పుడే రాజారామన్ B.A., ఫస్ట్ క్లాసులో పాసయ్యాడని అతనికి తెలిసింది.

ఆ ఒక సంపత్సరమంతా సాంబువయ్యరు, శారదా ఆంటీ, తమ జీవితం ఒక శిక్షలాగే గడిపారు. ఇంతకుముందు సాబువయ్యరు గోడనో, లోకప్పునో చూస్తూ భార్యతో

మాటాడేవారు. ఈ సంవత్సరమంతా అతను గోడనీ, లోకప్పునీ నివ్వెఱపోయి చూసారు, కాని అతని నోటినుంచి ఏ మాటా పెగల్లేదు.

శారదా ఆంటీ ప్రాణం ఉన్న శవంలాగ ఆ ఇంటిలో తిరుగుతూ వచ్చింది. ఇరుగుపొరుగుల వాళ్ళు ఆవిడని చూసి చాలా రోజులైపోయాయి.

తను చావడానికి ముందు సాంబువయ్యర్ తన తలని తన భార్య ఒడిలో పెట్టుకొని, ఒక బిడ్డలాగ, ఆవిడ మొహం చూస్తూ, అన్న ఆఖరి మాటలివి:

"వాకెవరిమీదా కోపం లేదు. నువ్వైనా నన్ను క్షమించు!"

సాంబువయ్యరు పోయిన తరువాత అతను అసమగ్రంగా విడిచిపెట్టిన ఆస్తులు నిర్వహించే బాధ్యత కృష్ణయ్యరు తీసుకున్నారు.

ఆ తరువాత, ఎప్పుడైనా ఒక సారి అతను శారదా ఆంటీని చూడడానికి వస్తారు. వచ్చినప్పుడెల్లా వసారాలోనే కూర్చొని ఆమెతో మాటాడతారు. ఆంటీ ద్వారం వెనుక నిలబడి వింటుంది. ప్రతీసారి 'రాజారామన్ తప్పకుండా తిరిగి వస్తాడు!' అనే తన నమ్మకం అతను ఆవిడకి తెలియజేసి కృష్ణయ్యర్ వెళ్తారు.

కాని ఆ రాజారామన్ నిజంగానే ఒక రోజు తన గ్రామంకి తిరిగివచ్చినప్పుడు ఆ కబురు ఆంటీకి తెలియజేయడానికి అతను లేరు; అతను కన్నుమూసారనికూడా ఆంటీకి తెలియదు.

'అతను నన్ను వచ్చిచూసి ఒక సంవత్సరం ఐపోయిందే, అతనెలాగున్నారో?' అని ఆలోచిస్తూ ఆంటీ ఒకరోజు ఒక కార్యకర్తని పిలిచి కృష్ణయ్యర్ గ్రామంకి వెళ్ళి రమ్మంది.

ఆ కార్యకర్త ఆ సాయంకాలమే తిరిగి వచ్చి కృష్ణయ్యర్ తుదిశ్వాస విడిచిన కబురుతో, రాజారామన్ తిరిగివచ్చాడని తెలియజేసారు.

అతను మరికొన్ని కబురులు కూడా చెప్పారు: కృష్ణయ్యరు కొమార్తెలలో ఒకామె తన భర్తతో కలకత్తాలో ఉంది; ఆ దంపతులు ధక్షిణేశ్వరం వెళ్ళినప్పుడు గంగానది తీరం వొడ్డున నదిలో తేలుతున్న నౌకలను చూస్తూ, కాషాయ వస్త్రాలు, గడ్డంతో రాజారామన్ కనిపించాడట. మొదట అతనితో తమిళంలో మాటాడి, అతను తమిళనాడుకి చెందినవాడని తెలుసుకొని, అతను కృష్ణయ్యర్ రెండవ కుమారుడు రాజారామన్ అని పోల్చుకున్న వివరాలు అతను తేటగా వర్ణించారు. ఆ తరువాత రఘుపతి స్వయంగా

కలకత్తాకి వెళ్ళి తమ్ముడ్ని ఇంటికి పిలుచుకొని వచ్చినట్టు చెప్పారు. రాజారామన్ తన సన్యాసంకి ఎటువంటి భంగం రాకూడదని నొక్కిచెప్పిన తరువాత రఘుపతి సరేనని వాగ్దానం ఇవ్వడం వలనే రాజారామన్ తిరిగి వచ్చాడని అతను చెప్పారు. గ్రామంలో వాడికని ప్రత్యేకంగా ఒక ఆశ్రమంలాగ ఒక గుడిసె కట్టారని, అందులో రాజారామన్ ఒక బైరాగిలాగ జీవిస్తున్నాడని అతను భయభక్తితో తెలియజేసారు.

ఇవన్నీ విని శారదా ఆంటీ మనసు చిందరవందర ఐపోయింది.

## 2

కావేరీ నది ఒడ్డుకి ఈ పక్క మెట్లున్నాయి. దానికి ఆనుకొని ఈ మండపం. ఆ మండపం స్తంభం పక్కనున్న గోడని చీల్చుకొని వచ్చిన గార మధ్య కలుపుమొక్కలు పెద్ద వృక్షంలాగ పెరిగిపోయాయి. అక్కడ నేల వాలి, మాసిపోయిన పసుపుపచ్చని ఆకులమధ్య కీర్తిశేషులు మహారాజ శ్రీ కృష్ణయ్యర్ కనిష్ట కుమారుడు, ఇటీవల సన్యాసి రాజారామన్ - నేను - మీకు దర్శనమిస్తున్నాను . . .

అవును . . . అది నేనే . . .

నేను అంటే అహంకారం అని అంటారు. అది నాకు బాగా ఉంది. నేను అహంకారంకి ప్రతినిధిని. నేనే అహంకారం. నా అవగాహనలో నేనే నాకు ఆదర్శం, నేనే నాకు ఓజబంతి. నన్ను మించి, దూరంగా నిలబడి, నాగురించి నాకు మంచి అవగాహన ఉంది.

అదిగో, ఈ ఏరుకి అవతల, వరుసవరుసగా పిడకలు పేర్చి, కట్టెలు పఱచి, ఆ కట్టెలమధ్య, మెట్టు మెట్టుగా మాడిపోతూ, ఎఱ్ఱగా, నారింజ రంగులో అగ్నిగా కనిపించే ఆ జ్వాల చూసారా? అందులో గంభీరంగా ఈ రాజారామన్ నిద్రపోతున్నాడు . . .

అందులో నేను లేను, నా అహంకూరం లేదు, ఏ రాజూ లేడు, ఏ రాముడూ లేడు. ఐతేనేం, ఆఖరికి, అన్ని రాజులకీ, రాముళ్ళకీ, అన్ని అహంకారాలకీ, అన్ని చోట్లా ఇలాగే దహనం అవుతోంది . . .

ఇదేమో చాలా రోజులుగా జరుగుతోంది . . . ఇప్పుడూ, ఇక వచ్చే కాలమంతా ఇలాగే సాగుతుంది . . .

ఇలాంటి సమయాల్లో నాకు నవ్వాలనిపిస్తుంది . . . నవ్వుతున్నప్పుడు బీడీ పొగ నా కంఠంలో దిగడం వలన నేను ఉక్కిరిబిక్కిరైపోతాను, మళ్ళీ దగ్గుతాను, నవ్వుతాను . . .

నేను బీడీ తాగుతున్నాను . . .

అవును, కృష్ణయ్యర్ కనిష్ఠ కుమారుడు, రాజారామన్, బీడీ తాగుతున్నాడు, ఇదేం గ్రహచారం? ఇది నాన్నగారు చూడలేదని రాజారామన్కి చాలా బాధగా ఉంది! అతనుగాని చూసారంటే? ఆ కల్పనలోనే నాకు ఇంకొకసారి నవ్వాలని ఉంది!

అతన్ని కూడా - ఇప్పుడు కనిపిస్తోందే! - అలాంటి చితిలోనే కాల్చివుంటారు; కృష్ణయ్యర్ తండ్రిని, తల్లిని, తాతగారిని, అమ్మమ్మని, అందుకు ముందున్న పెద్దలందరిని అలాగే కాల్చివుంటారు . . .

నన్నుకూడా అలాగే ఇక్కడ పిడకలు పేర్చి, కట్టెలకి నిప్పంటించి, ఉగ్రంగా కాల్చాలనే రఘుపతి అన్నయ్య నన్ను వెదికి ఇక్కడకి తీసుకొని వచ్చాడు. నాకు తెలుసు, రాజారామనన్ని ఇక్కడ మాడ్చుతారని. నేను ఈ మండపంలో పడుక్కొని అటునించి ఇటు కనిపించే అన్ని శవాల్లోనూ నన్నే చూసి చూసి నవ్వుకుంటాను; ఇప్పుడూ అలాగే నవ్వుతున్నాను . . .

నేను తరచుగా నవ్వుకుంటాను. నా మనోవ్యధలో సాలెపురుగు లాగ నా పాత జ్ఞాపకాలని నేను దారం దారంగా అల్లుకున్నప్పుడు, నాకు నేనే నవ్వుకుంటూ ఆ వలని తెంచుకొని బయటకి వచ్చి పరుగెడతాను.

రాజారామన్ని అవతల, దూరంగా నిలబడి వాడిని ఒంటరిగా చూసినప్పుడెల్లా నాకు నవ్వాలనిపిస్తుంది.

వాడి వేషాలన్నీ నాకు బాగా తెలుసు. వాడు ప్రతీ ముసుగు తీసినప్పుడెల్లా 'ఇదిగో, ఇదొక రాజారామన్!', 'ఇది మరొక రాజారామన్!" అని నేను లెక్కపెటుతూవుంటాను!

నన్ను దాచాలని వాడు వేసిన వేషాలు ఒకటా, రెండా?

వాడు అనుష్ఠించిన ఆచారాలు, వ్రతాలు, వేద పారాయణం, పూజలు, పునస్కారాలు, సంస్కృత శ్లోకాలు, వాడి పిలక, జందెం - అన్నీ ఉత్తి వేషాలే! నన్ను

దాచడానికి అవన్నీ వాడు ఉపయోగించిన తెరలు! వాటిని బహిరంగపరచి వాడికి తెలియకుండా దాంకున్న నన్ను చూసి నేనే నవ్వుకుంటాను.

నిజంగా వాడికి అటువంటి సంప్రదాయాల్లో అభిరుచి లేదు. కాని వాడికి నామీదున్న భయం వలన నా దగ్గరనుంచి తప్పించుకోడానికి ఈ వేషాల్లో దాక్కుంటూ, దాక్కుంటూ వచ్చాడు.

వీడు నాస్తికుడు, శూన్యవాది, నిరానుకూలుడు! ఇప్పుడు వీడికి నేనంటే భయం లేదు! అందువలన ఇక ఏ తెరా వీడినీ, నన్నూ కాపాడదని తెలిసి, ఆ వేషాలని తోసిపారేసి, అన్ని గోడలనీ ఒక గెంతు దాటి నేను పరుగెత్తాను.

ఆ తరువాత నేనిక రాజారామన్ కాదు. నేను నేనే . . .

పుణ్య క్షేత్రాలు, పుణ్య నదులు వెతుక్కుటూ నేను వెళ్ళలేదు. నేను వెళ్ళిన దారిలో అన్ని ఊర్లలోనూ - శ్మశానం కూడా పుణ్య క్షేత్రమని అనడం మీకు తెలుసా? - నేను తిరిగాను; పుణ్య నది అని అందరూ నమ్మిన నీళ్ళలో నేనూ పడి, మునిగి, లేచాను - అంతే.

కావేరీ నది; గంగా నది; మురికి కాలువ; మహా సముద్రం - వీటన్నిటికీ పేరు ఒకటేగా?

అన్ని నదితీరాల్లోనూ ఒక శ్మశానం ఉంటుంది. అన్ని శ్మశానాల్లో శవాలుంటాయి. వాటిలో ఏ భేదం లేదే? ఆడ, మగ, తండ్రి, తల్లి - అన్నీ ఒకటే! శ్మశానాల్లో ఎది గొప్ప, ఎది తక్కువ?

కలకత్తా నగరంలో ఉంది కాళీఘాట్ మందిరం - అక్కడ ఒక కాలువ కూడా ఉందే? (మీరలా అంటే ఆ కాళీ ఉపాశకుడు మిమ్మల్ని అక్కడే బలి ఇచ్చేస్తాడు!) - అది కూడా గంగానది అంశమో, లేక గంగానదియే అని అంటున్నారు! అందులో అసలు సగం భాగం శ్మశానం! ఒక పక్కన ప్రాణమున్న శవాలు స్నానం చేస్తూంటే, ఇంకొక పక్కన, కాలిన, మాసిపోయిన శవాలు నదిలో తేలుతుంటాయి! వాటినీ పవిత్రమని భావించి కొందరు వాటిమీద గంగాజలం పోస్తారు! అదీ చూసి నేను నవ్వుకునేవాడిని! అలాగే 'ఋషీ మహరాజ్!' అని కొందరు నా కాలుముందుకూడా పడి లేచేవారు . . .

వాళ్లందరూ ఏ నదిమూలం చూడలేదు, ఏ ఋషిమూలం చూడలేదు . . .

నేను వాటికోసం అక్కడ వెళ్ళలేదు . . . నేను వెళ్ళిన దారిలో నదులూ, శవాలూ కనిపించాయి . . .

నేను కాషాయ వస్త్రాలు ధరించి, సిగ పెంచుకొని మునీశ్వరుడుగా ఆవాలని వెళ్ళలేదు. నేను తొడుక్కున్న బట్టలే కాలక్రమంలో కాషాయమైపోయాయి! నేను సిగ, గడ్డం పెంచలేదు! . . . ఏ వేషమూ వొద్దనేవాడికి ఆఖరికి ఎలాగో ఒక వేషం వచ్చేసింది!

అవును, అన్నీ వేషాలే . . . ఏదీ వొద్దంటే అదీ వేషమే కదా? ఈ ప్రాణంకి దేహం ఒక వేషం; దేహంకి చాలా వేషాలు కావాలి! నాకు నవ్వాలనిపిస్తోంది! . . .

కాని, ఆఖరికి, ఏ వేషమూ, వాడిని కాపాడలేదు . . .

దక్షిణేశ్వరం మఠందగ్గఱ దీర్ఘాయువులాగ పెరిగి మహా సముద్రంలాగ అలలు అలలుగా విరియబోసుకుంటున్న ఆ జీవ నది ప్రవాహంలో ఎవడో పాట పాడుతూ వెళ్ళడం చూస్తూ నేను కూర్చొని వున్నాను.

“అంబీ!” అని ఒక పిలుపు వినిపించింది.

రాజారామన్ చెల్లెలు జగతా, ఆమె భర్త, చలికి స్వెటరు, బొచ్చు టోపీ ధరించి, మూడేళ్ళ పిల్లవాడితో కనిపించారు.

రఘుపతి నన్ను అంబి అని పిలవడం వలన నేనందరికీ అంబి. ఇన్నాళ్ళూ లేని రాజారామన్ ఇప్పుడు తిరిగి వచ్చేసాడు; వేషం తెరగా మారింది; నేను ఆ తెరలోనే దాంకున్నాను.

గంగా నది, కావేరీ నది - నాకు రెండూ ఒక్కటే; ఏ నది తీరమైనా అక్కడొక స్మశానం ఉంటుంది.

మొట్టమొదట రాజారామన్ వీళ్ళని చూడగానే మొండిపట్టుగా పరుగెత్తాడు. పదడుగుల తరువాత ‘నాకెందుకు భయం?’ అని తనంతట ఆలోచించుకొని నవ్వాడు. వీడిని చూడగానే జగతా పిల్లనాడు హోరున ఏడవసాగాడు.

ఆ తరువాత రఘుపతికి టెలిగ్రాం పంపించి అతను వచ్చాడు. వీడ్ని చూసి అందరూ కళ్ళు తడబెట్టుకున్నారు. రఘుపతి వీడిని తనతో రమ్మని పిలిచినప్పుడు వీడు మొండిగా రానన్నాడు.

అక్కడున్న రెండు రోజుల్లోనే రఘుపతి వీడితో కలుకొని వీడు బీడీ తాగడం, హుక్కా పీల్చడం, గంజా తాగడం చూసాడు. చెట్టడుగున బైరాగులు ఇద్దరు ముగ్గురు కలిసి వీడిని 'మహరాజ్!' మహరాజ్!' అని మర్యాదతో గౌరవించడం, అందులో వీడికేర్పడిన సుఖానుభవం గుర్తుచేసుకున్నాడు.

ఆ మరుదినం మధ్యాహ్నం చెట్టడుగున ఉన్న 'మహరాజులకి' రఘుపతి ఒక తోలా గంజా బహుమతిగా కొని ఇచ్చి గౌరవించాడు. ఆ తరుసాతి మూడు రోజలూ వీడికీ, సహ మహరాజులకీ, అతిథి సత్కారం చేసి, వీడిని మాత్రం తనతో రమ్మని పిలిచాడు.

"నాన్నగారు పోయి - ఒక సంవత్సరం ఐపోయింది!" అని కళ్ళు తుడుకుంటూ రఘుపతి అన్నప్పుడు వీడు నవ్వాడు. "ఓ, అలాగా? ఒక సంవత్సరం ఐపోయిందా?" అని మాట వరుసకి మాత్రం అడిగాడు.

"నాకు చలిగా ఉంది. ఒక కంబళి శాలువ కొని ఇస్తావా?" అని వీడు పిల్లవాడులాగ అడిగినప్పుడు, ఇక రఘుపతి భరించలేక పోయాడు; గుండె కట్టుకుంది; వచ్చిన ఏడ్పుని ఎలాగో ఆపుకున్నాడు.

"కొని ఇస్తానురా! . . . తప్పకూండా కొని ఇస్తాను . . . నీకు ఆస్తీ, ఇల్లూ, పొలాలూ, అన్నీ ఉన్నాయే, నీకేం తక్కువరా? కర్మ! కర్మ! చలిలో ఎందుకురా ఇలా . . . "

కాని వీడు అడగడమూ ఉత్తికే అనాలి. ఆ రోజే బజారుకి వెళ్ళి రఘుపతి ఎనభై రూపాయలకి, శశి వర్ణంలో, మూలకి మూలగా పువ్వులు నేశిన సాలువ కొని తెచ్చాడు. వీడు దాన్ని వాడనేలేదు. మడతలు విప్పకుండా అది రఘుపతి దగ్గరే అలాగే ఉంది.

ఆఖరికి, రఘుపతితో రైలెక్కినప్పుడు "అక్కడ నాకు బీడీ ఇస్తావా?" అని అడిగాడు వీడు.

" . . . తప్పకుండా."

"బీడీ అంటే ఇదీ కావాలి!" అని చెయిలోని ఒక చిన్న పొట్లాం చూపాడు.

"విను . . . నీకెది కావాలో అది . . . "

'అవశ్యకత అనేటప్పుడు వీడికి జీవితంలో కావలసిన వస్తువులు ఇంత సులభంగా ఒక చిన్న పొట్లాంలో ఇస్తే చాలు!' అని తెలియజేసి రాజారామన్ పకపకమని

నవ్వాడు. ఆ నవ్వు విని ఆ హౌరా స్టేషన్ లో రైలుబండి వీడిని తేటిపారి చూసినట్టు రఘుపతి హడలిపోయాడు.

చూసారా? ఆ ఎదుట కనిపించే ప్లేట్ ఫారంనుంచి నేను మా ఇంటికి వచ్చేసరికి అగ్రహారంలో ఈ ఊరు జనులందరూ గుమిగూడిపోయారు.

వీడు ముప్పైసంవత్సరాలకి ముందే సన్యాసి ఐపోయాడట. ఆశాపాశలు త్యాగం చేసేడాడట. అదే అందరూ అంటున్నారు. అందరూ నమ్ముతున్నారు. ఆలా చూస్తే వాడు ఋషియే, అన్నీ త్యజించినవాడే. తనకిది కావాలని వాడు నాన్నగారినికూడా ఎప్పుడూ అడగలేదు. 'నాకెదీ వద్దు!' అనే ధోరణే వాడిలో అందరికీ కనిపించేది. తనెది చేసినా అది ఇతరులకోసం, వాళ్ళ తృప్తికోసం అనేకదా వాడు కనిపించాడు? ఆ కాషాయ వస్త్రం, గడ్డం, ఇప్పుడేగా వచ్చాయి? అదికూడా ఇతరులు వాడికి అంటగట్టేసారు. వాడికేం పోయింది? ఒక రోజు వెళ్ళి క్షవర కళ్యాణం చేసుకొని వచ్చేసాడు! అదీ ఒక వేషమే!

సంతోషాలని త్యజించడం, ఇంద్రియాలని అదుపు చేసుకోవడం - ఇవన్నీ వీడికి తెలియనే తెలియదు.

వీడన్నీ సంతోషాలూ అనుభవించేసాడు; ఆశాపాశాలన్నీ రుచి చూసేసాడు. ఇంద్రియాలని తమ తమ తోవలకి స్వేచ్ఛగా వదిలేసాడు.

ఆవు గడ్డి తింటూ నెమరు వేస్తూ, పేడ పఱిచినట్టుంది వీడి వాలకం.

తనకి తానే ద్రోహం చేసుకునే వాళ్ళని చూసి మనం ఎందుకు జాలి పడాలి? 'త్యాగి' అని ఎందుకు పొగడాలి? వీడొక భోగి, సుఖవాసి; వీడిని పూజించడం చూసి నాకు నవ్వాలని ఉంది!

ఈ ప్రపంచంలో ఎవరిని చూసినా నాకు మూర్ఖులే కనిపిస్తున్నారు! వీళ్ళని పిచ్చివాళ్ళు, అల్పులు అనే పిలవాలి! వీళ్ళ అభిమానులు చూసి నాకు నవ్వాలని ఉంది!

నాకు తెలిసిన, పరిచయమైనవాళ్ళందరూ - ఈ కృష్ణయ్యర్, అతని భార్య ఇందుమతి, రఘుపతి, వాడి భార్య, జగత, ఇక ఆ ఇంట్లోని పిల్లలు, సంతానంకి చేతకాని ఆ సాంబువయ్యర్, అతన్ని చూసుకుంటూ రోజూ రోలుతో నువ్వులు దంచిన

శారదా ఆంటీ - వీళ్ళందరూ ఆ రాజారామన్ని తలమీద పెట్టుకొని ఆడారు - ఆఖరికి వాళ్ళందరికీ 'బెబ్బెబ్బే' చెప్పిన రాజారామన్ - వీళ్లందరూ జంతువులే!

ఐతే, ఈ జంతువులు బట్టలు తొడగడం వలన వీళ్ళకి మనుషులని పేరు. అదే మనకి సయన్స్ చెప్తోంది . . . సయన్స్ ఎందుకు, నేనూ అదే చెప్తున్నాను, వినండి, . . . ఆవు, మేక, పులి, సింహం - వీటన్నికి వేరే వేరేగా జంతువుల గుంపులో పేర్లున్నాయి, భేదాలున్నాయి. అటువంటి భేదం మనిషికీ ఉంది. ఆదే విశేషం అని అందరూ అంటున్నారు. నాకేమో అదే లోపంగా కనిపిస్తోంది.

మనుషలని తప్పిస్తే తక్కిన జంతువులకి నీతినియమాలు లేవు. అందువలన వాటికి ఏ నష్టమూ లేదు. కాని మనుష జంతువులకి సదాచారాలు ఉన్నాయి; వాటిగురించి శాస్త్రాలు, ధర్మాలు, కర్మకాండలు, న్యాయాలు, శిక్షలు, అన్నీ విపులంగా రాసిపెట్టారు. వాటిని ఉల్లంఘించాలని జనులు ఆశించడం, అది సాధ్యం కానప్పుడు విసుగ్గోడం, మండి పడడం, మనకి తెలుసు. అందువలనే నైతిక ప్రవర్కన అని వచ్చినప్పుడు ప్రజలు తమకు తామే ఎంపిక చేసుకొని, తమకి తగినట్టుగా ఏదో ఒక వేషంలో మనకి కనిపిస్తారు. మనం చూసేదంతా ఇదే, వాళ్ళ నయవంచన - రకరకాల వేషాలు!

ఇవి ఇతర జంతువుల్లో లేవే? ఇవన్నీ మనుష జంతువులకి మాత్రం ఉన్నాయంటే అదేం గొప్ప?

ఇతర జంతువులని చూస్తే నాకు అసూయగా ఉంది; పక్షులని చూస్తే జాలిగా ఉంది. అవన్నీ ప్రకృతితో సరసమాడుతున్నాయి. కాని మానవుడు ప్రకృతితో నిత్యమూ పోరాడుతున్నాడు. అది వాడికి గొప్పగా ఉంది! అదేం గొప్ప? వక్రబుద్ధి అంటే అదే! ఇవన్నీ తలుచుకుంటే నాకు నవ్వాలని ఉంది! మంచి వేళ, నన్ను పిచ్చివాడని ఎవరూ పిలవలేదు, సన్యాసి అనే అంటున్నారు! అందుకూ నాకు నవ్వాలనిపిస్తోంది!

ఈ జనులందరూ మూర్ఖులు. నాకు నాగురించి తెలుసు. వీళ్ళకి నన్ను తెలియదు, తమగురించీ తెలియదు! నాకు ఇద్దరూ తెలుసు . . .

నేను రాజారామన్ని psycho analysis చేసి చూసాను; వీడొక abnormal case.

నేను వీడిని, వేరే వేరేగా, సూక్ష్మంగా పరిశీలన చేసివున్నాను. వీడికి దూరంగా నిలబడి, వీడిని కౌగిలించుకోడం లేక వీడిని నాశనం చెయ్యడం నాకు సులభం. వీడు నాశనం ఐతే నేనూ నశించిపోతానేమో? అందుకే అది నేను చెయ్యను. వీడు నన్ను బాగా ఆవరించుకొని నాలో మెలుగుతున్నప్పుడు అవన్నీ ఎందుకు?

నాకు ఇటువంటి పరిపక్వం రావడానికి ఇరవైయేళ్ళు పట్టింది. అంతవరకూ ఈ రాజారామన్ ఎన్ని కష్టాలు పడ్డాడు! ఎన్నెన్ని వేషాల్లో దాంకున్నాడో? దాంకోడం సులభం, కాని అది ఎంత కాలం సాధ్యం?

నేను మొట్టమొదట ఎక్కడ దాంకున్నాను? ఎందుకు దాంకున్నాను?

ఇందుమతి - కృష్ణయ్యర్ భార్య - రాజారామన్ తల్లి - స్నానంకి వెళ్ళింది . . .

ఆవిడ తన గది తలుపు తాళం వెయ్యడం మరిచిపోయింది; తాళం చెవి గుత్తి అలాగే ద్వారంలో వేలాడుతోంది. అదే ఆవిడ పడక గది. అందులో ఎవరినీ రానివ్వరు. అక్కడే ఆవిడ రాత్రీ, పగలూ ఉంటుంది. వంటమనిషి ముసలమ్మ మాత్రం 'ఇందు!' 'ఇందు!' అని పిలుస్తూ, కాఫీ, లేక పాలు లోపలికి తీసుకొనివెళ్ళి ఆ గదిలో తిరుగుతుంది. ఏదో చిదంబర రహస్యలాగ ఒక తలుపు మాత్రం ఓరవాకిలిగా తెరిచి, లోపలికి వెళ్ళగానే మూసేస్తుంది. అమ్మ ఉన్నంతవరకు ఆ తలుపు పూర్తిగా తెరిచి నేను చూడనే లేదు.

వంటమనిషి లేకపోతే నాన్నగారు ఒక తలుపు తెరిచి ఆ గదిలోకి వెళ్ళినప్పుడు - తలుపు కొంచెం తెరిచివున్నా - అది బ్రహ్మాండంగా కనిపిస్తుంది. ఈ ఇంటితో సంబంధించని, మనకి స్వంతం కాని మరెవరి ఇంటి గదనిపిస్తుంది. 'ఇదీ మన ఇంటి గదే కదా? మన అమ్మే కదా అందులో ఉంది? మనం ఎందుకు వెళ్ళకూడదు?" అని అడగాలనిపిస్తుంది.

అది చాలా పెద్ద గది. కిటికీలలో నీలవర్ణమైన తెరలుంటాయి. గది ద్వారంని రకరకాల గాజుగొట్టాలు, గంటలు అల్లిన పరదా అలంకరించివుంటాయి. అబ్బబ్బా, అంత పెద్ద మంచం నేనెక్కడా చూడలేదు! ఎంత వెడల్పు అన్న మాట! నేను పిల్లవాడుగా ఉన్నప్పుడు అది పెద్దదిగా కనిపించిందేమో? కాని, నిజంగా, అది చాలా పెద్దదే! అందులో అడ్డంగా రెండు డజను పిల్లలు, వరుస, వరుసగా, పడుకోవచ్చు. ఆ మంచంకి ఎదుట ఒక పెద్ద నిలువుటద్దం ఉంది. మంచంమీద పడుక్కొని ఆ

నిలువుటద్దంలో చూస్తే ఆ గదిని పూర్తిగా చూడగలం. అప్పుడు ఆ గది రెండింతలు ఇంకా పెద్దదిగా కనిపిస్తుంది . . . వేసవి కాలంలో ఆ గది చల్లగా ఉంటుంది. చలికాలంలో వెచ్చగా ఉంటుంది. లోకట్టులో గోడలో మెరుగుతూ ఒక అల్మారా కనిపిస్తుంది. అమ్మ ఎప్పుడైనా దాన్ని తెరచిందంటే గదిని కమ్మని వాసన వచ్చి ఆవరించుకుంటుంది. ఆ గదిలోకి వెళ్ళాలని నాకెప్పుడూ ఆతురత! అందుకు కారణం - ఆ అల్మారా వాసన, అమ్మ వాసన!

నాన్నగారు తరచుగా ఆ గదిలోకి వెళ్తారు. రాత్రి ఆ పెద్ద మంచంలోనే  అతను పడుక్కుంటారు. జగతా, లేకపోతే మీనా,  లేక ఎది ఆఖరి బిడ్డో, అది ఆ పక్కన ఉన్న ఊయలలో పడుక్కుంటుంది. అమ్మకూడా ఆ మంచంలోనే నాన్నగారితో పడుక్కుంటుంది . . . నేను ఊయలలో పడుక్కున్నప్పుడు చూసివున్నాను . . .

మాలో ఎవరికైనా జ్వరం వస్తే ఆ గదిలో పడుకోమని చెప్తారు. రఘుపతి కూడా జబ్బుని వస్తే అక్కడ పడుకుంటాడు. 'మనకీ జ్వరం వస్తే ఎంత బాగున్ను!' అని నాకనిపించేది.

తక్కిన రోజుల్లో పిల్లలు మేమందరం నడవలో వరుస వరుసగా చాపలు వేసుకొని పడుకుంటాం. నేను మాత్రం అమ్మ పడక గదికి పక్కగా నిద్రపోతాను. అందరూ నిద్రపోయిన తరువాతకూడా  నేను మెలకువతోనే ఉంటాను. అందరూ నిద్రపోయిన తరువాత - అంటే, అలా అనుకున్న కరువాత - నాన్నగారు వస్తారు. అతను ఆగదిలోకి వెళ్ళి తలుపు మూసి, తాళం వేసుకున్నప్పుడు ఈ ఇంట్లో నాకేం స్వంతం లేనట్టు, నేనోదో ఒక బికారిలాగ ఇక్కడ ఉన్నట్టు నాకనిపిస్తుంది. ఎందుకో, నాన్నగారిమీద కోపం వస్తుంది. పడకనుంచి లేచి ఎక్కడైనా పారిపోవాలనిపిస్తుంది. అప్పుడు, కొన్నిసార్లు,  రైలు బండి ప్లాట్ ఫారంలో వస్తున్నట్టు గంట వింటాను. ఆ గంట నన్ను పిలుస్తున్నట్టనిపిస్తుంది. ఆ తరువాత రైలు బండి వస్తుంది; అది నాకోసం కాచుకున్నట్టు నిలబడుతుంది. నేను రాలేదని ఒక నిట్టూర్పు వదిలి అది మళ్ళీ ప్రయాణం చేస్తున్నట్టు  నేను కల్పించుకుంటాను.

ఈ నాన్నగారు నన్ను ముద్దులాడడం, నన్ను బుద్ధిమంతుడని పొగడడం, ఇవన్నీ ఉత్తి వేషాలనే అని నాకు ఆ రోజుల్లోనే తెలుసు . . .

రాత్రిపూట మేమందరం నిద్రపోయిన తరువాత మెల్లగా ఆ గది తలుపు తెరుచుకొని లోపలికి వెళ్తున్న దొంగ నాన్నగారే నిజం; పగలంతా మేం చూస్తున్న నాన్నగారు అబద్ధం. ఇతను నన్ను మోసం చేస్తున్నారు, నాకూ వీళ్ళని మోసం చెయ్యడం తెలుసు. నేను మాత్రం ఊరుకోవాలా?

అమ్మ స్నానంకి వెళ్ళింది . . . నడవలో ఎవరూ లేరు . . . అమ్మ గది తలుపు మూయడం మరిచిపోయినట్టుంది . . . తాళం చెవి గుత్తి వేలాడుతూ కనిపిస్తోంది. 'అమ్మ తిరిగివచ్చేముందు గదిలోకి వెళ్ళి చూసేసి వద్దాం!' అనే ఆలోచన రాగానే నా ఒడలంతా జలదరించింది; గుండె దబ్బున కొట్టుకుంది.

నాన్నగారు రాత్రిపేళ వెళ్తున్నట్టు నేనుకూడా తలుపుని మెల్లగా తెరచాను; పక్కవాటుగా నా దేహం వొంగుతూ లోపలికి దూరి, ఊపిరి వదిలాను.

అబ్బా, ఎంత పెద్ద గది! ఆ నిలువుటద్దంముందు నిలబడి నడుముపై రెండుచేతులను ఆనుకొని చూసాను; మంచంమీద ఎక్కి కూర్చున్నాను; కూర్చొని అద్దంని చూసాను; నిలబడి అద్దంని చూసాను; మంచంమీద పడుక్కొని చూసాను; మంచంమీద దొర్లాను.

అయ్యయ్యో, అమ్మ వచ్చేసిందన్నట్టుంది! నడవలో ఎవరో వస్తున్నట్టుందే? ఇప్పుడు నేను చేసేదేముంది?

నేను మంచం దిగి మంచం అడుగున దాంకున్నాను.

అమ్మ వస్తోంది . . . తలుపు తెరచుకొని లోపలికి వచ్చి తలుపు మూసేసి, నిలువుటద్దం ముందు నిలబడి, తన దేహాన్ని కప్పుకున్న తువ్వాలుతో అక్కడున్న కుర్చీలో కూర్చుంది. ఆ తరువాత ఆ తువ్వాలుని తీసి భుజంమీద వాలిన తల జుత్తుని ఆరబెట్టుకుంది. నేను కళ్లు మూసుకున్నాను. నాకు మరేం చెయ్యాలో తెలీదు. అమ్మ అలాగే కూర్చొని ఉంది. ఇంతలో ఎవరో తలుపు తట్టారు.

"ఎవరు?" అని అమ్మ అడుగుతోంది. మంచి వేళ, వంట మనిషే! ఆ తువ్వాలునే దేహమంతా కప్పుకొని అమ్మ తలుపుని కొంచెం తెరిచి కప్పరని, సాంబ్రాణి డబ్బా అందుకుంది. అప్పుడే నేను అమ్మని చూసాను. అమ్మకి ఎందుకు పొట్ట ఇంత పెద్దగా ఉంది? నాకెందుకో ఏడవాలనిపించింది . . . అమ్మని చూస్తే జాలి వేసింది . . . నేనిలా

దాంకొని తన్ను చూడడం తెలియక అమ్మ వివస్త్రగా తనకి తనే పాడుతూంటే నేను అమ్మకి మోసం చేస్తున్నానని బాధ పడ్డాను. 'త్వరగా చీర కట్టుకొని అమ్మ బయటకి వెళ్ళకూడదా, నేనూ పారిపోదాం!' అని ఆలోచించాను. 'ఎందుకురా, ఇక్కడ దాంకున్నాను, ఇప్పుడేం చేస్తాను?' అని నేను కలవరపడుతూంటే అమ్మ కప్పరలో సాంబ్రాణి వేసి, కుర్చీలో బాగా లేచి, పొగ తన కంఠంని పూర్తిగా తాకాలని వెనక్కి వాలింది . . .

మంచం అడుగున నక్కియున్న నేను మెల్ల మెల్లగా వెనుకాడాను; గభీమని అమ్మ చూపు మంచం అడుగున పాకుతున్న నా మీద పడిపోయింది . . .

సాంబ్రాణి నిప్పు కణాలు తనమీద పడినట్టు అమ్మ అదిరిపడి, లటుక్కున లేచింది. ఈ గాబరాలో అమ్మ మీద ఉన్న ఒ ఒక వస్త్రమూ కింద వాలింది. వొంగి, దాని తీయాలనే తొందరలో అమ్మ కప్పరని కాలుతో ఒత తన్ను తన్నింది; తువ్వాలుని తన వక్షంమీద ఎత్తి పెట్టుకొని బిగ్గరగా అరిచింది:

"వెధవ, ఇక్కడకి వచ్చి మంచం అడుగున ఏం చేస్తున్నావ్? రా, బయటకి రా!" అమ్మకి వొంగి మంచం అడుగున చూడడానికి సాధ్యం కాలేదు.

నేను మంచం పక్కనే నిలబడివున్నాను; మా ఇద్దరిమధ్యా మంచం ఉంది. అమ్మకి వెనకవున్న అద్దంలో అమ్మ వెనకభాగం పూర్తిగా కనబడుతోంది. నాకేం చెయ్యాలో బోధపడలేదు. అమ్మ మోహంలో రక్తం కట్టివుంది. అదేం కోపమా? అవమానమా? జుగుప్సా? పళ్ళు కొరుక్కుంటూ ఎవడో ముందెప్పుడూ పరిచయంలేని అన్యుడుని తరుముతున్నట్టు బొబ్బలు పెట్టింది:

"వెళ్లా, వెళ్ళు! ఇంకా నిలబడతావేం?"

నేను తలుపు తెరుచుకొని బయటకి పరుగెత్తాను. నాకిక ఆ ఇల్లు వద్దని అనిపించింది. తోట తలుపు తెరిచి, కావేరీ గట్టుకి వచ్చి చేరాను; ఈ మండపంలో కూర్చొని ఏడ్చాను.

నేను చచ్చిపోవాలని దేవుడ్ని వేడుకున్నాను; నేను పోతే వీళ్ళందరూ ఏడుస్తారనే కల్పనలో నా మనసుకి హాయిగా ఉందనిపించింది.

నేను కావాలనే ఏ తప్పూ చెయ్యలేదే? అమ్మకి నా మీద ఎందుకు కోపం? అదే అమ్మ చేసిన పొరబాటు. నేను కావాలనే మంచం అడుగున దాంకొని దాన్ని చూసానని అనుకుంటోంది. అది తలచుకుంటేనే నాకు ఎడతెగకుండా ఏడవాలని ఉంది; ఇక నేనేం చెప్పినా అమ్మ మనసు మారదని నాకు తెలుసు . . .

ఆ రోజు నేను దేవుడ్ని నూరు సార్లు క్షమాపణ కోరుకున్నాను; అమ్మకి నామీదున్న కోపం పోవాలని వేడుకున్నాను; పూజగదిలో కూర్చొని ఒక పెద్ద నోట్ బుక్లో 1008 సార్లు శ్రీరామజయం రాసాను.

ఆ తరువాత ఆ గదికి వెళ్ళాలనే ఆలోచన నాకు పూర్తిగా పోయింది.

అమ్మ నన్ను చూసినప్పుడెల్లా చిరచిరలాడుతూ కనిపించేది. నాన్నగారిని తప్పిస్తే అందరిదగ్గరా అమ్మ అలాగే విసుగ్గుంటుంది, కాని అది నన్ను చూసినప్పుడెల్లా, నేను ఆ రోజు గదిలో దాంకున్నవలన అలాగ ఉందని నాకనిపించేది. ఎప్పుడైనా ఒకరోజు అమ్మ నన్ను రమ్మని పిలుస్తుంది, పాడమని అడుగుతుంది. ముందల్లా నాకది సంతోషంగా ఉంటుంది, కాని ఆ గదిలో చిక్కుకున్న ఘటన తరువాత ఆ సంతోషం పోయింది! పిలుస్తే వెళ్తాను, వెళ్ళి నిలబడతాను. ఏదైనా పాడమంటే పాడతాను. నన్ను కౌగిలించుకొని ముద్దాడుతుంది. 'ఎప్పుడురా నన్ను వదులుతుంది? మనం ఇక్కడుంచి తప్పించుకోవాలి!' అని నాకనిపిస్తుంది. అమ్మ నన్ను తాకుతేనే నాకు జుగుప్సగా ఉంటుంది. మమ్మల్నందరిని బయటికి వెళ్లమని చెప్పి అమ్మ బిడ్డకి పాలిస్తుంది. నాన్నగారు మాత్రం ఉంటారు. అతన్ని వెళ్ళమని చెప్పదు. మేమందరం బయటకి వచ్చినా అతను మాత్రం ఆ గదిలో ఉంటారు . . .

ఒక రోజు కూడా అమ్మ మాకు అన్నం వడ్డించలేదు; వంటమనిషి, ఆ ముసలమ్మే ఆ పని చేస్తుంది; అమ్మ నాన్నగారికి మాత్రం వడ్డిస్తుంది.

అదీ ఎలాగ? నడవలో స్తంభం పక్కన పీట, విస్తరాకు వేసి, అన్నం, పులుసు, కూర అన్నీ వడ్డించడానికి అమ్మ చెయికి అందినట్టు ముసలమ్మ పెడుతుంది. నాన్నగారు వచ్చి కూర్చోగానే అమ్మ వడ్డించుతుంది; అతను భోంచేసి లేచిన తరువాత, అమ్మకి ముసలమ్మ వడ్డించుతుంది.

నేను మెల్ల మెల్లగా అమ్మకి దూరమౌతూ వచ్చాను; చాలా రోజులు అమ్మని చూడకుండానే గడిపాను.

అమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న రోజులలోకూడా అమ్మ పిలుస్తేనే నేను దాన్ని వెళ్ళి చూసేవాడిని. ఆ మూడురోజులూ రఘుపతి, తక్కిన పిల్లలు అమ్మతోనే ఉన్నారు. నేను మాత్రం పూజగదిలో ఉన్నాను. అమ్మకోసం నేను ధ్యానం చేస్తున్నానని అందరూ మాటాడుకున్నారు. కాని అది నిజం కాదు; నేను పూజగదిలో దాంకున్నాను.

నాన్నగారు ఒకపక్క కూర్చొని "ఇందు! ఇందు!, నన్ను వొదిలేసి వోవద్దు!" అని కళ్ళలో నీళ్ళు పెట్టుకొని, అమ్మ చెయి పట్టుకొని ఏడుస్తున్నారు. ఈ రఘుపతి, జగతా, మీనా, తక్కిన పిల్లలదరూ ఇంకొకపక్క నిలబడి ఏడవడం చూసి నాకు నెత్తిమాద గట్టిగా బాదుకోవాలని ఉంటుంది. ఆ విసుగు తప్పించుకోవాలనే నేను పూజగదిలో దాంకున్నాను.

ప్రాణావస్థలో ఉన్న అమ్మగురించి ఇలా ఆలోచించడం, దాంకోడం ఎంత పాపం అనే భయంతోనే నేను దేవుడిదగ్గర క్షమాపణ కోరేవాడిని; అందుకే రోజు వెయ్యిసార్లు శ్రీరామజయం రాసేవాడిని.

అమ్మ కన్ను మూసేసింది; అందరూ ఏడ్చారు. అందరూ ఏడవడం చూసి నేనూ ఏడ్చాను. రఘుపతే ఎక్కువగా ఏడ్చాడు. నాన్నగారు చెదురుమదురుగా ఏడ్చేవారు. గభీమని కూర్చున్న చోట మొహంలో తువ్వాలు కప్పుకొని ఏడుస్తారు. అప్పుడు నాకు మనసులో సంతోషంగా ఉంటుంది: 'ఇదే నీకు మంచి శిక్ష!' అని అనుకున్నాను. ఇక రాత్రిపూట, దొంగలాగ, పిల్లిలాగ, గది తలుపు తెరిచి, రావడం జరగదు, అవునా?

అయ్యో, పాపం! నాన్నగారి గురించి ఇలా అనవచ్చా? అందుకు కూడా నేను దేవుడుదగ్గర క్షమాపణ కోరడం అలవాటు చేసుకున్నాను . . . దట్టంగా విభూతి నెత్తిమీద ఒత్తుకొని మంత్రాలు వల్లించేవాడిని . . .

అమ్మ కన్ను మూసిన తరువాత నేనెప్పుడూ దానిగురించి ఏడవలేదు . . .

కాని, ఆ రోజు ఆ గదిలో జరిగిన ఘటనవలన అమ్మ నాగురించి అపార్థం చేసుకుందని, అందుకు నన్ను క్షమించమని వేడుకున్నాను.

అమ్మ పోయిన తరువాత ఆ గది రెండు తలుపులూ బాగా తెరచి ఉన్నాయి. ఇప్పుడేమో అది నాకు ఆ ఇంటిలోని తక్కిన గదుల్లాగే కనిపిస్తోంది. నాన్నగారు మాత్రం రాత్రి ఆ మంచం మీద ఒంటరిగా నిద్రపోవడం చూసి నాకు జాలిగా ఉంది. అతనితోబాటు జగతా, మీనా, కొన్నిసార్లు రఘుపతికూడా - నన్నూ, ఆ ముసలి వంటమనిషిని తప్పిస్తే - నిద్రపోయేవారు. పగలంతా ఈ పిల్లలు ఆ గదిలో ఎప్పుడూ అల్లరి చేస్తూంటారు! నేను అందులో ఎప్పుడూ కలుసుకోను! నాకు తెలుసు, అమ్మకి అది ఇష్టం లేదని . . . అంతేకాదు, ముందెల్లా ఆ గది తలుపులు మూసివున్నప్పుడు ఆ గదిగుంచి నాకెన్ని కల్పనలు, ఊహలు ఉండేవో - అవన్నీ ఆ గది తలుపులు తెరచిన వెంటనే చిటికెలో మాయమైపోయాయి! ఆ అల్మారాకి ఇప్పుడేం వాసనా లేదు! ఆ గదికి ఏ అందమూ లేదు, అది అమ్మతో మాయమైపోయిందా? అంతా నా కల్పనే కాబోలు! అవును, అంతా కల్పన! అమ్మ, నాన్న - ఈ బంధాలన్నీ మన కల్పనలే . . .

అమ్మ అనే నిజం కాలక్రమంలో అబద్ధమై, అమ్మ అనే గుర్తు కల్పనగా మారిపోయి, ఆఖరికి అమ్మ కలగా వచ్చి నన్ను ఆవరించుకుంది.

ఆ రోజు నేను గదిలో మంచం అడుగున దాంకున్నప్పుడు వచ్చిందే - అలాగే ఇప్పుడు అమ్మ వచ్చింది. ఛాతీమీద ఆ తువ్వాలుని కప్పుకొని సడిచివచ్చినప్పుడు ఆ చిన్నబట్ట మధ్య మధ్య అనావృతంగా తెరచుకుంటోంది, మూసుకుంటోంది; ఎవరూ లేరనే ధైర్యంవలన అశ్రద్ధగా నడిచి వస్తోంది. తెల్లని మోకాళ్ళు, తొడళ్ళలో, నరాల కణాలూ కనిపిస్తున్నాయి. ఆ రోజులాగే నిలువుటద్దం ముందు నిలబడి, ఆ తువ్వాలుతోనే జుత్తు ఆరబెట్టుకోడం చూస్తున్నాను. నేను ఇప్పుడు మంచం అడుగున లేను. నాన్నగారిలాగే మంచంమీద 'హాయిగా' పడుకొనివున్నాను. నేను కళ్ళు మూసుకోలేదు, బాగానే అన్నీ చూస్తున్నాను. అమ్మ వెనుకనుంచి ఆమె వెనుక భాగం, అద్దంలో కనిపించే ముందుభాగం, నేను పూర్తిగా చూస్తున్నాను. అమ్మ కూడా కూడా అద్దంలో నన్ను చూసింది. నేనీ గదిలో ఉన్నానని తెలుసుకొని చిరునవ్వు నవ్వుతోంది. ఆ తువ్వాలుని తన ఒడలుమీద తేలికగా వేసుకొని నా పక్క వచ్చి కూర్చుంది. నన్ను అలాగే కౌగిలుంచుకుంది. తడిసిన జుత్తు కొప్పులు నా వీపుమీద పడుతున్నాయి, నాకు హాయిగా ఉంది. నేను ఏడుస్తున్నాను; ఎందుకు ఏడుస్తున్నానని నాకు

తెలియదు. కాని దుఃఖంతో గుండె పగిలిపోయినట్టు ఏడుస్తున్నాను. "అంబి, విను. నిన్ను నేనెప్పుడూ వెళ్ళగొట్టను! ఆ రోజుకూడా నాకనికాదురా, మీ నాన్నగారుకోసం నిన్ను తరిమాను!" అని రహస్యంగా నా చెవిలో చెప్తోంది: "మీ నాన్న ఆ కృష్ణయ్య మహా పాపి! నన్నూ, నా పిల్లల్నీ వేరుచేసే పాపి! వాడి ఇందుమతి పోయింది! ఇక వాడు ఆ కావేరీ నగి తీరం మండపంలో కూర్చొని ఆ స్మశానం చూస్తూ రోజులు గడపవలసిందే! ఇప్పుడు నేను నీ ఇందు! . . . " అని ఏమేమో అంటూ నన్ను కౌగిలించుకొని ఈ మంచంలో నాన్నగారితో నిద్రపోతున్నట్టు - అదే ధోరణిలో నన్నుగట్టిగా అదుముకుంటూ . . . నాకు ఊపిరాడుతుంది . . . బాగానే ఉంది . . . కాని . . .

నాకు మెలకువ వచ్చేసింది . . .

దేవుడా, ఇదేం ఘోరం! . . . ఇదేం కల! . . . లేచిన వెంటనే నా దేహమంతా వొణుకుతోంది! . . . కడుపులో ఎలాగో ఉందే . . . నామీద నాకే కోపంగా ఉంది . . . ఎక్కడైనా వెళ్ళి గోడలో నెత్తిని బాదుకొని ఏడవాలని ఉంది . . . నేనెందుకిలాంటి కలలు కంటున్నాను? ఇదేం శాపమా? అమ్మా, నాన్న గురించి నేను ఇంత అధ్వాన్నంగా ఎప్పుడూ ఆలోచించలేదే? ఇలాంటి కలలు కనడం ఎంత పాపం!

ఆ మరుసటి రోజు ఈ పాపాల పరిహారంకి సిద్ధమైయ్యాను. చల్లనీళ్ళు తాగకుండా రోజంతా ఉపవాసం ఉన్నాను. పూజగదిలోనే తాళం వేసుకోని రోజంతా దేవుడికి స్తోత్రం చదివాను. చేతులలో నొప్పులు వచ్చేవరకు శ్రీరామజయం రాసాను . . . రోజంతా ఏడుస్తూనేవున్నాను . . .

నాన్నగారూ తక్కినవాళ్ళూ అవన్నీ చూసి నాకు భక్తి అని అనుకుంటున్నారు. అమ్మమీదున్న ప్రేమవలన నేను వ్రతాలు, పూజలు, చేస్తున్నానని వాళ్ళు నన్ను గొప్పగా పొగడుతున్నారు . . .

నేను తరచుగా ఇటువంటి కలలు కంటున్నాను; ఏడుస్తున్నాను; వ్రతాలు అనుష్ఠిస్తున్నాను; శ్రీరామజయం రాస్తున్నాను.

వయసు పెరుగుతున్నకొద్దీ ఈ కల కూడా వేరే విధంగా మారుతూ వస్తోంది . . .

అప్సరసల్లాగ, దేవకన్యలలాగ, నన్ను ఆకర్షించే యువతుల గుంపులు చాలా నా కలలో వస్తూవుంటాయి. నేను వాళ్ళతో సంభాషణ ఆరంభించగానే వాళ్ళు నా అమ్మగా మారిపోతారు! ఆ కలలు నిజమవకుండా కలలుగానే కొనసాగితే ఎంత బాగున్ను! ఆ కలల ప్రపంచంలో అమ్మతో ఈ అనుభవాలు తప్పనో, పాపమనో నాకనిపించదు. అది న్యాయమే అని, అందుకు నాకే అర్హత ఉందని అనుకుంటాను. కాని మెలకువ రాగానే, అలాంటి ఆలోచనలు రావడంవలపే అది ఇంకా రెండింతలు పాపంగా, దోషంగా ఐపోతుంది.

నేను రెండుగా భిన్నమైపోయాను. అందులో ఒకటి నన్ను కలలో ఉల్లాసపరచుతుంది, కాని నిద్ర లేవగానే, అది నా మనసుని కత్తిలాగ కోస్తుంది. నాలోపల ఒక భూతం ప్రవేశించి అల్లరి చేస్తున్నట్టు నాకొక భ్రమ. నాలోపల వచ్చి కూర్చొని అసహ్యంగా అన్ని పనులూ చేస్తోంది. పగటిపూట నేను దేవుడికి పూజలన్నీ చేస్తున్నాను, కాని రాత్రివేళ ఈ సైతాను నన్ను చిత్రవధ చేస్తోంది. నిద్రపోతే ఈ కల వస్తుందనే భయంతో చాలా రాత్రులు నేను నిద్రపోకుండా ఉన్నాను. ఆఖరికి ఈ కల వచ్చినా సరే అని నిద్రపోతాను. ఈ కల చూడడానికి బాగుంటుంది. దీనిగురించి దేవుడు దగ్గరే మొరబెట్టుకోవాలి . . . మరేం దారి?

నాకు ఆడపిల్లలని చూస్తే మోహం లేదు. మొహించడానికి వాళ్ళదగ్గర ఏముందని? అలాంటి వ్యామోహం, నాకు రానేరాదు. రఘుపతి, నాతో చదువుతున్న స్నేహితులు ఆడపిల్లలగురించి ఏమేమో మాటాడుకుంటారు, నాకది జుగుప్సగా ఉంటుంది.

వాళ్ల మాటలూ, చేష్టలూ నాకు రోతగా కనిపిస్తాయి, నేను వాళ్లతో దెబ్బలాడుతాను. రఘుపతికి నేనంటే భయం; పెద్దలని చూసి భయపడుతున్నట్టు నన్ను చూసి వాడి స్నేహితులు భయపడతారు, మర్యాద ఇస్తారు. నేనొక భక్తిమాన్, ఆచారశీలుడు అని వాళ్ళు నన్ను గొప్పగా పొగడ్తుంటే నాకు మనసులో “ఓరే, పెర్రి పెధవల్లారా!” అని అందరిదగ్గరా మర్యాద తగ్గుతూ వచ్చింది, కాని నేనది బయటకి ఎవరికీ చెప్పలేదు.

తరచుగా, నెలకొకసారి, ఈ సాంబువయ్యర్ అంకుల్ - మందబుద్ధి అంటే అతన్నే చెప్పాలి! - వచ్చేస్తాడు! నాన్నగారూ, అతనూ రోజంతా సల్లాపం చేసుకుంటారు! వీళ్ళ సల్లాపం మధ్య నాన్నగారు “ఈ శ్లోకం చెప్పు!”, “ఆ శ్లోకం చెప్పు!” అని నన్ను

వేధించుతారు. అతనికి ఈ శ్లోకం అంటే ఏమీ తెలీదు! వీళ్ళకున్న అభిరుచి అబద్ధం అని నాకు తెలుసు, మరి వీళ్ల పొగడ్తలు నమ్మడం ఎలాగ?

అతను వచ్చినప్పుడెల్లా "కాలేజీలో చదవడానికి రాజారామన్ని నాతో వదిలేయ్! హైస్కూలువరకే వాడు నీ కొడుకు; ఆ తరువాత వాడు నా కొడుకు!" అని అనడం నేను విన్నాను. నాకు తెలుసు: స్వంతంగా తనకొక కొడుకు కనడం వీడికి చేతకాదు! ఆ లోపం నా మనసుకి  అసహ్యంగా కనిపించేది.

ఆఖరికి అలాగే అయింది; ఆ రోజు నాన్నగారు నన్ను వాళ్ళ ఇంటిలో దిగబెట్టినప్పుడు ఏదో పెద్ద విపరీతం జరగబోతుందని నేను భయపడ్డాను; అందువలనే నేను ఏడ్చాను.

కలలో అమ్మని మాత్రం చూసినప్పుడు నాలో వచ్చిన ఆ భావన, ఆ పరవశం - నిజ ప్రపంచంలో ఏ ఆడది దగ్గరా తోచని, సాధ్యంకాని భావన -  ఆ కలలో వచ్చినట్టే, ఇప్పుడు నిజంగా శారదా ఆంటీని చూడగానే నాకు ఏర్పడింది. దానివలన ఒక విధమైన సంతోషమూ కలిగింది. ఆ సంతోషంకి ఆధారం ఏమిటి? ప్రతీ దినం తన కన్నతల్లిని గుర్తుచేసుకుంటూ దానికోసం జీవితమంతా అల్లలాడుతున్నాడే, ఆ జీవికే అది బోధపడుతుంది.

నన్నడిగితే - నేను ఆ ఇంటికి వెళ్ళి, ఆ కుటుంబంలో ఒక సభ్యుడుగా చేరానే - ఆ రోజే ఆ విపరీతం - జరిగిపోయింది.

శారదా ఆంటీని చూసిన తరువాత నాకు కలలో అమ్మ రానేలేదు. ఆంటీయే వస్తోంది.  అమ్మలాగే వస్తోంది. అన్నీ, అలాగనే.

కాని ఈ కలలగురించి నాకు విచారం లేదు, భయం లేదు; నేనిప్పుడు శ్రీరామజయం రాయడంలేదు. ఇంకా చెప్పాలంటే,  ప్రతీరోజూ ఈ కల రావాలి, రావాలని, నేను కోరుకున్నాను.

కాని, కొన్ని సమయాల్లలో, ఇది పాపమనిపిస్తుంది. తన కడుపులో పుట్టిన పాపలాగ నన్ను గారాబంగా పెంచి, ప్రేమానురాగాలు ధారపోసే ఆంటీని ఇంత అసహ్యయంగా, రహస్యంగా అనిభవించడం ద్రోహం కాదా అని నా అంతరాత్మ ఎత్తి పొడుస్తుంది . . .

ఐతే మనం చేసేదేముంది? కలలు కనడం, వాటిని అసహ్యించుకోడం ఆ కలలు కన్నతరువాతనేకదా జరుగుతోంది? కలలు కనడం మన అందుబాటులో లేదే? ఐనాకూడా నా వివేకం, నా అంతర్బుద్ధి, నా అంతరాత్మ, దీనికోసం నన్ను నిందించుతూనే ఉంది.

అందుకోసమో, లేకపోతే నాకున్న మంచి పేరుని కాపాడుకోవాలనే నెపంతో, నేను ఆ వ్రతాలూ, పూజలూ ఇప్పుడూ కొనసాగిస్తూనే ఉన్నాను. కాని ముందులాగ ఇప్పుడు నాకు వాటిమీద నమ్మకం లేదు. నా వసతికోసం అవన్నీ చేస్తున్నాను.

సాంబువయ్యర్, ఆంటీ నన్ను పెంచి, పోషించినట్టు - చిర కాలం తపస్సు చేసి కన్న తమ స్వంత సంతానంని ఏ దంపతులైనా పెంచివుంటారా? - అని ఎవరికైనా అడగాలనిపిస్తుంది. కాని నాకు ఆ గారాబం పిచ్చితనం అనిపిస్తోంది. నా స్థానంలో మరెవరున్నా ఆ దంపతులు అదే చేసివుంటాని నేను ఏ బాధ్యతలేకుండా వాళ్ళ సత్కారంలో పాల్గొన్నాను. నన్ను కన్నవాళ్ల సత్కార్యమే నాకు పిచ్చిగా కనిపించినప్పుడు, ఇక వీళ్ళ అభిమానం ఇంకా శోచనీయంగా కనిపించిందనాలి. కాని ఇంత ప్రేమ, అభిమానం చూపేవారి మనసుని అనుసరించడం నా బాధ్యత అని నేను గ్రహించాను. ఎవరి మనసూ నొప్పించడం నాకు ఇష్టం లేదు. నా చిన్నవయసులోనే నేనేం తప్పు చెయ్యకుండానే అమ్మ మనసు నా గురించి అపార్థం చేసుకుంది; అందువలనేకదా నా బతుకంతా అయోమయమైపోయింది!

ఈ సత్కార్యం, పిచ్చితనం మించి నాకూ, ఆంటీ మధ్య ఒక కొత్త బంధం మెల్లగా పెరగడం నేను గ్రహించాను. ఆ బంధం సాంబువయ్యర్ అనే ఆమె భర్త స్నేహితుడు కృష్ణయ్యర్ కుమారుడు ఈ రాజారామన్ అనే కారణం వల్ల కాదు. తనకని సొంత సంతానం లేకపోవడం వలన, అతను నన్నొక కొడుకుగా భావించారు; దాన్నికూడా మీరి ఈ బంధం రూపొందింది.

ఎక్కడో, ఒక పరుగెడుతున్న రైలుబండిలో చూసిన, ముందెప్పుడూ పరిచయం లేని యువకుడి మొహం; భవిష్యత్తులో ఇక ఎప్పుడూ కనిపించడానికి సాధ్యం కాని మొహంగా వాడు కనిపించినా ఈ పొత్తు తప్పక చోటుచేసుకుంటుంది అని అనుమానించవలసిన సూచనలు కనిపించాయి.

కాలేజీలో ఎంతోమంది నవనాగరిక దుస్తులు దరించి యువకుల మనసులు చెడగొట్టేవిధంగా నవ్వుతూ వస్తున్నారే, వాళ్ళదగ్గర లేని ఆకర్షణ శక్తిని, బూడిదనీ మొహాన్ని కప్పుకున్న చెమటని తన ముంజెయితో తుడుచుకుంటూ వంటపనులు చేస్తున్న ఆంటీ దగ్గర నేను చూసాను.

నేను ఆవిడని మొట్టమొదట చూడగానే, ఆ రోజే కలలో ఆవిడని చూడడం వలన నాకలా అనిపించిందా? లేక, అలా అనిపించడం వలన ఆవిడ నా కలలో వచ్చిందా?

నేనూ ఆంటీ వాళ్ల ఇంటి నడవలో పాచికలాడినప్పుడు; నా ఎదుట కూర్చొని, మాటమాటకీ నాకేంకావాలని అడిగి ఆంటీ అన్నం వడ్డించినప్పుడు; ఒక నిమిషం నా మొహం వాడిపోతే 'నీకేం తలనొప్పిగా ఉందా? జ్వరంగా ఉందా?' అని హడలిపోయి ఆంటీ నన్ను తాకినప్పుడు; ఆవిడ 'వొద్దు!', 'వొద్దు!' అని ఎంత చెప్పినా, ఆంటీ తిరుగలి మీద పిండి ముద్దలు పోస్తూంటే, నేను వినకుండా తప్పనిసరిగా నా చెయితో వాటిని నూరినప్పుడు; ఇటువంటి సమయాల్లో నేను రోజూ కంటున్న కల ఏ నిమిషంలోనైనా నిజమైపోవచ్చు అనే భావన మరింత తీవ్రంగా పెరిగినట్టు మేం ఇద్దరం గ్రహించేవాళ్ళం. ఆంటీ నన్ను 'నా బిడ్డ!' అని పిలవడం, 'మీరు నాకు అమ్మలాగ . . . ' అని నేను మాటకి అనడం మాకు బాగా అలవాటైపోయింది . . .

ఆఖరికి, ఒక రోజు, ఈ బంధం - నియమం, నీతి, న్యాయం, వయసు, పరిసరాలు - వీటన్నిటినీ మంటలో పడిన ఒక ఎండు ఆక లాగ భస్మం చేసేసిందే? ఆ కల నిజమైపోయిందే?

ఈ రాజారామన్ లోపల ఎన్నో వేషాలలో దాంకున్న నేను ఈ వేషాలూ, తెరలూ, ఒక క్షణంలో చింపి పారేసి 'ఇవన్నీ ఇక వీడికి వద్దు!' అని నిశ్చయించాను.

ఇంటి వెనుగ భాగంలో - పెరడుకి వెళ్ళే తోవలో - ఆంటీ రుబ్బురోలులో పిండిని తోపుతోంది; వీడు తన చెయితో నూరుతున్నాడు.

వీడికి కాలేజీ చదువైపోయింది. పరీక్ష రాసి పదిరోజులైపోయాయి. ఇంకో దేనికోసమో కాచుకుంటున్నట్టు ఏదో నెపంమీద వీడు ఇక్కడే ఉంటున్నాడు. ఏదో వంక మీద వీడు ఇక్కడే ఉంటే మంచిది అని ఆంటీ మనసులోనూ ఉంది. వీడు ఇంటిలో ఉండడం వలన ఇరుగపొరుగులనుంచి స్త్రీలెవరూ రావటం లేదు. ఈ పదిరోజులూ అంటీ

పగటిపూట పాచికలు ఆడుతూ, వీడిని పాడమని ప్రోత్సాహిస్తూ, ఊరు కబుర్లు సంప్రదించుకుంటూ, గడిపేసింది. రేపు వీడు తప్పకుండా ఊరుకి వెళ్ళితీరాలి. ఆ భ్రాంతితోనే ఆంటీ నోరు మూసుకొనివుంది. అప్పుడప్పుడు వీడిని చూసి తల తిప్పుకొనే సమయాల్లో చీర కొనతో కళ్ళూ, ముక్కూ తుడుచుకోవడంలో ఆవిడ మొహమంతా ఎర్రబారిపోయింది. నాలుగు సంవత్సరాలుగా చేతిబిడ్డని పోషించినట్టు వీడిని చూసుకుంటోంది! ఆ భావనలన్నీ ఎంత పిచ్చితనం, వ్యర్థం అని ఇప్పుడు గ్రహించినప్పుడు ఒక అస్పష్టమైన కోపమూ, ఏడుపూ ఆమె కడుపులో పొంగి లేచాయి. ఆంటీ అన్నీ మనసులో అణచుకునే ఉంది. మామూలుగానే అందరితోనూ మాటాడుతోంది, నవ్వుతోంది. ఆంటీ మనసులో పడే అవస్థ వీడికి తెలుసు. దాన్ని అదుపులో పెట్టుకొని ఆవిడ పడే బాధ చూసి వీడు నవ్వుకుంటున్నాడు.

పిండిని చెయితో తోపుతున్న ఆంటీ గభీమని ఆగి తలెత్తి వీడ్ని చూసింది. ఆ చూపు వీడికి చాలా కొత్తగా ఉంది. అదే సమయంలో నాలుగు సంవత్సరాలముందు కలలో చూసి అలవాటు పడిన పాత అనుభవంలాగుంది.

“ఎందుకురా అంబీ అలా చూస్తున్నావ్?” అని అడుగుతున్న ఆంటీ తన రొమ్ముని కప్పుకున్న వస్త్రంని సర్దుకోవాలనే అంతర్బుద్ధి మరిచిపోయి వీడిని తేటిపాటి చూసింది. వీడి చూపూ ఆంటీమీదనే నిలకడగా ఉంది; రెండు చేతులూ గుండ్రాయిని గట్టిగా పట్టుకున్నాయి.

“నాకు అమ్మ జ్ఞాపకం వచ్చేసింది!”

ఆంటీ పెదవుల్లో ఏడ్పు సూచనలు కనిపించాయి.

“నేనూ నీకు అమ్మనే! . . . ”

వీడి చేతులు గుండ్రాయిమీదనే ఉన్నాయి. పెదవులు మాత్రం కదిలాయి.

“మంచి వేళ! అమ్మ పోయింది!”

ఆంటీ కళ్ళు తడిసిపోయాయి.

“నా అదృష్టం, అది పోయింది. లేకపోతే నీలాంటి బిడ్డ నాకెలా దొరుకుతుంది?” అని అంటూ ఒక దూకు దూకి వీడిని ఆవరించుకుంది.

“ఒకే ఒక సారి నన్ను ‘అమ్మా’ అని నన్ను పిలు! . . . ”

వీడు ఉక్కిరిబిక్కిరి ఐపోయాడు: "అమ్మా . . . "

"దేవుడా . . . ఈ జన్మలో నాకీ భాగ్యం దొరుకుతుందని నేను ఎదురుచూడలేదు! ఇది నిజమేనా? కల కాదుకదా?"

కల నిజమైంది.

ఏడుస్తున్న ఆంటీ, ఆనందంగా నవ్వడం ఆరంభించి, ఆఖరికి మళ్ళీ ఏడవసాగింది. ఆవిడ ఏడనడం చూసి వీడూ ఏడ్చాడు.

ఆంటీ వీడిని ఊరడించుతోంది: "విను, నేను నీకు అమ్మనే. ఇప్పుడూ నీకు అమ్మనే. ఏదో, కర్మవలన ఇలా ఐపోయింది. బిడ్డంటే తల్లిదగ్గర పాలు తాగడం తప్పా? అలాగే ఇది కూడా . . . నువ్వు నాకు బిడ్డ ఐపోయావ్!" అని ఏమేమో చెప్తూ కన్నీరు కార్చుతోంది.

వీడి మనసూ మెల్లగా కుదుటబడింది. 'ఈ జీవితంలో నాకు ఈ ఒక అనుభవం చాలు!' అని తృప్తి కలిగింది. ఈ సుఖంని, ఈ సంతుష్టిని, పూర్తిగా అనుభవించలేని మనుష్య జంతువులు, దీనికోసం వెదికి, చెడిపోయి, అందులోనే దొర్లుతున్నారు; కాని తనేదో కాయకల్పం సాధించినట్టూ, దాన్ని విరివిగా అనుభవించినట్టూ, వీడు సంతోషించాడు.

ఇన్నిరోజులూ తన్ను తప్పుదారిలో పీడించిన కలలన్నీ ఇక రావు, తనలో ఆవాహన చేసుకున్న సైతాను ఓడిపోయాడు. 'ఇన్నిరోజులూ నన్ను కన్న తల్లికూడ నాకొక సామాన్య కన్యగా కనిపించింది; ఇక అందరు స్త్రీలు నాకు తల్లిలాగే!' అనే ఆలోచన రాగానే తను మోస్తున్న పాపాలమూటని దించేసినట్టు భావన, సంతోషం కలిగాయి.

చీకటి పడుతుంటే వాడు కోవిలనుంచి తిరిగి వచ్చాడు.

మామూలుగా ఇంటి వాకిలికి రెండు పక్కలావున్న గోడల్లో కనిపించే గూడుల్లో దీపాలు ఆ రోజు కనిపించలేదు. ఇల్లంతా ఒకటే చీకటి. వీధి ద్వారం, తోట ద్వారం రెండూ తెరిచివున్నాయి. "అంటీ, మీరు దీపం వెలిగించలేదా?" అని అడగాలని వీడు లోపలకి వస్తున్నాడు; కాని లోపలనుంచి వస్తున్న వెక్కు, గొణుగు విన్నవెంటనే - ఏదో విపరీతం జరిగిపోయిందనే ముందు జాగ్రత్త వలన నోరు మూసుకున్నాడు.

చీకటిలో ఏమీ కవిపించలేదు. కాని వీడి మనసుకి అంతా అర్థమైంది. సాంబు అంకుల్ కూడా ఆంటీతో అక్కడ ఉన్నారని తెలిసింది. నడవలో వేలాడుతున్న ఊయల సద్దు చేస్తోంది. అంకులో, ఆంటీయో - ఇద్దరిలో ఒకరు - ఉయ్యాలమీద పడుకొని ఉన్నారు; ఇంకొకరు కూర్చొనివున్నారు. ఎది అంకుల్, ఎది ఆంటీ అని తెలీదు. ఉయ్యాలమాత్రం వంకరటింకరగా ఆడుతోంది.

వీడు గుమ్మం దాటి ఇంట్లోకి పాదం పెట్టడానికి ధైర్యం లేక -ఆ గౌతమ ముని శాపం విన్న అహల్యలాగ - అలాగే స్తంబించి పోయాడు.

ఉయ్యాల బల్లలో ఎవరో నెత్తిని బలంగా బాదుకుంటున్నారు - ఆంటీయే కాబోలు - అంకుల్ ఆవిడని ఆపుతున్నారనిపిస్తోంది . . .

“నాకు నీ గురించి తెలియదా? . . . నువ్వేం చేస్తావ్? . . . ‘బిడ్డ!’, ‘బిడ్డ!’ అని నిత్యమూ వాడి గురించే  నీ మనసంతా . . . కాలక్రమంలో నీకొక బిడ్డ పుట్టివుంటే ఇదేం జరిగివుండదు! . . . నన్నూ నువ్వొక బిడ్డగానే చూస్తూ వచ్చావ్, అవునా? అందుకే వాడిని ఇక్కడకి తీసుకొని వచ్చాను . .  . మరి, నీకేమో ఈ లోకమంతా చంటిపాపల్లా కనిపిస్తోంది, అందుకని ఈ లోకానికే తల్లై పోవాలంటే  ఎలాగ? కన్నతల్లికే అత్యాచారాలు చేసే ప్రపంచం ఇది  . . . ”

“లేదు . . . అలాగేం జదగలేదు . . . వాడు ఇప్పుడూ నా బిడ్డే . . . నేను వాడికి అమ్మని . . . నేనేం చెయ్యను? నేను కన్న బిడ్డ నా పాలుకోసం తపించిపోయి నా రొమ్ములో చెయి పెట్టినట్టు నాకనిపించింది . . . ఇప్పుడూ అలాగే ఉంది . . . ఇదంతా కర్మ! . . . మీకు నేను ఏ ద్రోహమూ చెయ్యలేదు  . . . రెండు చేతుల్లోనూ నిప్పు పట్టుకొని ప్రమాణం చేస్తాను . . . మీకు నేను ఏ ద్రోహమూ చెయ్యలేదు! . . . ”

“అయ్యయ్యో, నాకు నీగురించి తెలియదా? నీవేంతప్పు చెయ్యలేదు, నీకే ద్రోహం జరిగింది! . . .  నీ బతుకంతా వ్యర్థం చేసి నిన్ను గొడ్రాలుగా చేసిన ద్రోహి ఎవరు?  నేనే! . . . ”

ఉయ్యాల బల్లలో ఎవరో గట్టిగా నెత్తి బాదుకుంటున్నారు - అంకుల్ కాబోలు.  ఆంటీ అతన్ని ఆపుతోంది.

"అయ్యో, ఇదేంటి? మీరెందుకు నెత్తి బాదుకుంటున్నారు? 'ఏమే, ఇలాంటి పని చేసి నా ముందు వచ్చి నిలబడతావా?' అని కత్తితో మీరే నన్ను రెండు ముక్కలుగా కోసి పారేయవద్దూ? . . అదే చెయ్యండి, అదే ఒక భర్త చెయ్యవలసిన పని! ఇక ఎందుకు నాకీ ప్రాణం?" అని ఆంటీ గుండె బాదుకుంటోంది.

"ఊరుకో, ఊరుకోవే, ఇదేం పురుష లక్షణం? బాగుంది, నిన్ను నేను తెగ నరకాలంటున్నావ్, ఆ పాపం వేరే నన్ను పీడించాలా! నువ్వన్నట్టు ఏదీ జరగలేదంటే రేపు పొద్దున్నే వీడిని వాళ్ళ నాన్నకి అప్పగించి వచ్చేస్తాను . . . మనకేం పోయింది? ఈ నాలుగు సంవత్సరాలు ఏ సొంత తండ్రీ వీడిని ఇంత గారాబంగా పెంచి ఉండడు! వీళ్ళ నాన్న వీడ్ని ఎలా పెంచాడని మనకి తెలుసుగా? . . . నాకు ఒళ్ళు మండుతోంది! . . . వీడు చేసిన పాపంకి . . . "

"వద్దు, నా మాట కొంచెం వినండి! . . . నా బిడ్డని శపించకండి! . . . వద్దు, మరేం అనవద్దు . . . లేవండి, ఇల్లంతా చీకటిలో ఉంది. ముందు నేను దీపం వెలిగిస్తాను . . . ఆ తరువాత మనం కోవిలకి వెళ్దాం . . . "

ఉయ్యాలనుంచి లేచి, వంటగదికి వెళ్ళి, ఆంటీ దీపం తీసుకొని వచ్చింది. నడవలోని చీకటి పెరడుకి పరుగెత్తినట్టు గుమ్మం దగ్గర ఇంత సేపూ నిలబడివున్న వీడు వీధిలోకి పరుగెత్తాడు. గౌతమ ముని శాపంకి భయపడిన ఇంద్రుడులాగ పరుగెత్తాడు . . .

ఎదీ కావాలని, అడుగుతూ, వెదుకుతూ వీడు వెళ్ళలేదు. ఏదీ లేని శూన్యంలో, తనే ఒక శూన్యంగా పరిగెత్తాడు. ఎన్నో బంధాల్లో, తెరల్లో, వేషాలలో, వీడు దాచినవన్నీ ఆ చీకటిలో ప్రత్యక్షమైన తరువాత ఆఖరికి శూన్యమే మిగిలింది.

## 3

ఇంటి ముందున్న పాకలో సిమెంటు నేలమీద పొద్దున్నుంచి ఇంత సేపూ కూర్చొని మర్రి చెట్టు కొమ్మలు, రైలు ప్లాట్ ఫారంని ఒక వినోద దృశ్యంలాగ చూసి, ఆనందించిన రాజారామన్ కొన్ని నిమిషాలముందు తొందరగా చెయ్యవలసిన ఏదే పని గుర్తు చేసుకున్నట్టు లేచి కావేరీనది మండపంకి నడిచాడు.

తూర్పు దిశనుంటి పార్సెలు బండి రాబోతుందని గంట అప్పుడే మోగింది. మండపంకి వెళ్ళే దారిలో తమలపాకు దుకాణం ముందు రాజారామన్ ఆగాడు.

అతన్ని చూడగానే యజమాని నాయక్కర్ మర్యాదతో దుకాణంనుంచి దిగి వచ్చి వీధిలో నిలబడియున్న రాజారామన్ చెయికి ఒక బీడీ కట్ట అందించి నమస్కరించారు.

అది తీసుకొని రాజారామన్ పసిపాపలాగ నవ్వాడు: "అగ్గి పెట్టె?"

"ఇదిగో!" అని అంటూ నాయక్కర్ వీధిలోనించి ఒక పరుగులో దుకాణంకి వెళ్ళారు. ఇంకొక పరుగులో రాజారైమన్ చెయిలో అగ్గిపెట్టె ఉంది. మళ్ళీ, ఇంకోక నవస్కారం. రాజారామన్ నవ్వుతూనడిచాడు. అతని వీపు వెనుక నాయక్కర్ ఒక నిట్టూర్పు వదిలారు. దుకాణంకి వచ్చినవారిలో ఎవరో ఇద్దరు రాజారామన్ గురించి తమకు తామే మాటాడుకున్నారు:

"జ్ఞానమార్గం అంటే ఇదే కాబోలు!" అన్నారు ఒకతను.

"కాదు . . . ఇది ఇంద్రజాలం!" అన్నారు, ఇంకొకతను.

గల్లాపెట్టెనుంచి నాయక్కర్ లెక్కల పుస్కకం తీసి "ఇదిగో, అంబి అయ్యరు లెక్క: 'బీడీ కట్ట, అగ్గి పెట్టె: 32 పైసలు.' అని రాసి "అయ్యా, ఇదేం కర్మ? ఈ అంబి అయ్యరు ఎందులో తక్కువ? ఇతని వంశంలో ఎవరూ చదవని చదువు చదివాడు; మనిషికి బోలెడు ఆస్తి ఉంది, 'పర్సనాలిటి', ఉంది. పెద్దాయనగాని ఇప్పుడు ఉండి వీడ్ని చూసారంటే నిర్ఘాంతపోతారు! ఇదేం వేషం? . . . పిచ్చివాడులాగ కాషాయం, చింపి గుడ్డలతో, బీడీ కాలుస్తూ . . . దేవుడా, ఇదేం శాపమో?" అని నిట్టూర్పు వదిలారు.

మండపం చేరుకున్న రాజారామన్ ఎప్పటిలాగే నేలమీద కూర్చున్నాడు. తన ఒడినుంచి ఒక పొట్లాం తీసి అందులోవున్న గంజాని అన్ని బీడీలలో చాలా తొందరగా దట్టించాడు. ఆ పనికి పది నిమిషాలు పట్టింది. గంజాని పూర్తిగా నింపిన బీడీలని తన ఒడిలో ఒక కట్టగా తీసుకున్నాడు. అందులో ఒక బీడీని తీసుకొని, దాన్ని ఆతురతతో చూసి, నవ్వాడు. దానికి నిప్పంటించి ఒక దమ్ము లాగాడు. ఆ తరువాత సావధానంగా జారుతూ ఆ మండపం నేలమీద పక్కవాటుగా పడుకొని, తలనిండా పొరలుతున్న తన కొప్పుని తన అరచెయిలో భరించుకొని కావేరీనదిని తేటిచూసాడు. రోజూలాగే, కుడికాలుని నిలువుగా లేవసెత్తి, దానిమీద ఎడమకాలుని ఆనుకొని ఎడం పాదంని - కుంపటిలోని నిప్పుని విసురుతునట్టు - జోరుగా ఊపుతూంటే వాడి ఎర్ర కళ్ళ దృష్టి ఆ ఎదుట గట్టులో వాలినప్పుడు . . .

పిడకలు పఱచి, తడిసిన మన్ను పూసిన కట్టెలకుప్పనుంచి పొగ మండలం లేచింది.

తూర్పునుంచి వచ్చిన పాసంజరు రైలు బండి ప్లాట్ ఫారం నుంచి బయలుదేర బోతుందని గంట వినిపించింది.

ఒంటరి బాటసారిగా శారదా ఆంటీ చెయిలో ఒక సంచితో కనిపిస్తోంది. స్టేషన్ మాస్టర్ దగ్గర టికెట్టు అప్పగించి "ఇక్కడ కృష్ణయ్యరు ఇల్లు ఎక్కడ ఉంది?" అని అడుగుతోంది. అతన్ని అడుగుతున్నప్పుడే ఆవిడ చూపు అగ్రహారం ముందు భాగంలో అరిటాకులు అల్లిన ఒక పాక ఉన్న ఆ ఇంటిమీద పడింది; స్టేషన్ మాస్టరూ అదే ఇల్లు ఆవిడకి చూపారు.

ఆంటీకి కృష్ణయ్యర్ కుటుంబంలో అతనూ. రాజారామన్ మాత్రమే తెలుసు. ఎప్పుడో ఒక సారి ఆవిడ రఘుపతిని చూసి ఉంది. రఘుపతికి పెళ్ళి నిశ్చయమైనప్పుడు, రాజారామన్ కనిపించకుండా పోయి రెండు సంవత్సరాలైపోయాయి; సాంబువయ్యర్ కన్ను మూసి ఒక సంవత్సరమైపోయింది. కృష్ణయ్యర్, రఘుపతి వివాహ ఆహ్వాన పత్రిక ఇవ్వడానికి వచ్చారేగాని, ఆహ్వానించడానికి వెళ్ళలేదు. అప్పుడే ఆంటీ రఘుపతిని చూసింది. 'వాడికి నా జ్ఞాపకం ఉంటుందో లేదో? నా కార్యకర్త నాతో వచ్చివుంటే బాగున్ను!' అని ఆంటీ ఆలోచిస్తోంది.

తనకి తెలియని అన్యులతో తనే వెళ్లి మాటాడాలంటో ఆవిడకి మొహమాటంగా ఉంది. 'కృష్ణయ్యర్ బతికి ఉంటే?' అనే ఆలోచన తట్టింది. 'అతను కన్ను మూసినప్పుడే నాకు కబురు పంపించని వీళ్ళు నన్నెలా పోల్చుకుంటారు?" అనే భావనతో అగ్గహారంలో ఉన్న ప్పతీ ఇల్లుని చూసుకుంటూ ఆంటీ నడిచింది.

'ఎవరికి తెలిసినా, తెలియకపోయినా నాకేం బాధా లేదు! నాబిడ్డకి నన్ను గుర్తు తెలియకపోతుందా? దేవుడా . . . ఇప్పుడు వీడడు సన్యాసిగా ఉన్నాడట . . . ఇదేం న్యాయం? నేను వాడిని చూడగానే అదే అడుగుతాను! వాళ్ళ నాన్నగారు చూస్తే ఊరుకుంటారా? వీడి అన్నయ్య "నీ సన్యాసంకి నేను అడ్డు చెప్పను!" అని వాగ్దానం ఇచ్చి వీడిని తీసుకొని వచ్చాడట . . . అంబి నా మాట తప్పకుండా వింటాడు . . .

రాజారామన్ని నేను కళ్యాణరామన్ గా చూసి తీరుతాను!' అని మనసులో అనుకుంటూ ఆంటీ కృష్ణయ్యర్ ఇంటిముందు నిలబడి ఆ పాకని చూసింది.

ఆ పాకని చూడగానే ఆవిడకి కడుపు తిప్పింది.

'నా బిడ్డ ఈ ఇంట్లో ఉంటున్నాడా? పరుపుకూడా కనిపించదే? తాళం, తలుపు అంటూ ఏమీ లేదా? దేవుడా, ఇదేం తలవంపు?' అని ఆంటీ కలవరపటుతూంటే, ఇంట్లోనుంచి బయటకి వచ్చిన రఘుపతి ఆవిడ వీపు మాత్రం చూసాడు.

ఆమె ధరించిన ఖరీదైన పట్టు చీర, బంగారు ఫ్రేం కళ్ళద్దాలు చూసి రఘుపతి చావా మర్యాదగా అడిగాడు:

"మీకెవరు కావాలి? ఇది కృష్ణయ్యర్ ఇల్లు."

రఘుపతి మాటలు విని ఆంటీ తిరిగి చూసింది.

"రండి, రండి . . . నన్ను క్షమించాలి! . . . ఇదేంటి, ఇలా గభీమని? మీరొక కార్డు రాసివుంటే నేను వచ్చి మిమ్మల్ని ఇంటికి పిలుచుకొని వచ్చి వుంటానే? ఎండలో నిలబడివున్నారే, లోపలికి రండి . . . ఏమే, మనింటికి ఎవరు వచ్చారో తెలుసా?" అని హడావుడిగా రఘుపతి లోపలికి పరుగెత్తాడు. ఆంటీ మొహం ముడుచుకొని, తనలో నవ్వుకుంది.

"నేను నాకు ఉత్తరం రాయాలా? మా నాన్నగారు కన్ను మూసారే, అప్పుడు నాకొక ఉత్తరం రాయాలని నీకనిపించలేదే" అని మనసులో తలపోసుకుంటూ ఆంటీ గుమ్మంని ఆనుకొనియున్న సిమెంటు మెట్టుమీద కుర్చుంది.

ఇంటి లోపలనుంచి నడుంలో పసిపాపని ఎత్తుకున్న భార్యతో రఘుపతి తిరిగి వచ్చాడు. ఆంటీని అక్కడే నిలబడువున్న కారణం విని అదిరిపడ్డాడు.

"ఇదేంటి?" లోపలికి రండి . . . " అని బతిమాలాడు.

"సరేలే . . . గుమ్మం దగ్గర నిలబడితే తప్పకుండా లోపల రమ్మంటావ్ . . . ఏం, మీ నాన్నగారు పోయినప్పుడు నాకొక చీటీ రాయకూడదా? నాలాంటివాళ్లు పెళ్ళికే రాకూడదు . . . అది పోనీలే . . . ఇప్పుడు నీకని కుటుంబం, బాధ్యత వచ్చేసాయి! . . . నా బిడ్డ వచ్చాడని విన్నాను . . . ఒక సంవత్సరమైపోయిందన్నారు, నాకెందుకు ఎవరూ చెప్పలేదు? . . . ఇప్పుడు నేను నా బిడ్డని చూడడానికి వచ్చాను, వాడెక్కడ

ఉన్నాడు? ఈ పాకకదా వాడి ఇల్లు? నేనిక్కడే ఉంటాను . . . నేను ముందు వాడ్ని చూడాలి . . . ఆ తరువాత తక్కినవన్నీ మాటాడుకుందాం . . . వాడెక్కడ?" అని ఆంటీ తొందరపడింది.

"మీరు నన్ను క్షమించాలి! . . . అవును, అది నా పొరబాటే! . . . నేను చిన్నవాడిని . . ఏ చిన్న పనైనా నాన్నగారు చెప్పినట్టు చేసి నాకు అలవాటైపోయింది . . . అతను గభీమని భారమంతా నాకు వదిలేసి వెళ్ళిపోయారు, ఆ గడబిడలో ఆ పొరబాటు ఐపోయింది . . . నాకు మీ క్షమాపణ అడగడానికే సిగ్గుగా ఉంది!" అని రఘుపతి రెండు చేతులు జోడించి బతిమాలాడు.

'కావేరీ నదీ తీరలో పెరిగిన బ్రాహ్మణుడికి ఇది తేరగా వచ్చిన విద్య!' అని ఆంటీ మనసులో చెప్పుకుంది, ఈ నకిలీ మర్యాదలకి లొంగకుండా ఆవిడ అడిగింది: "సరేలే, ఇప్పుడు వాడెక్కడ ఉన్నాడు? నేను వాడిని చూడాలే?"

"ఇక్కడే ఉన్నాడు - కొంచెం సమయం ముందు . . . " అని రఘుపతి ఇక్కడా, అక్కడా పరుగెత్తాడు.

"ఇక్కడ లేకపోతే అతను కావేరీ గట్టు దగ్గర ఉంటారు, మీరు వెళ్ళి అతన్ని రమ్మనండి!" అని రఘుపతి భార్య చెప్పింది.

"మీరు మాటాడుతూ ఉండండి . . . నేను వెళ్ళి వాడితో వస్తాను!" అని రఘుపతి సిద్ధమైయ్యాడు. ఆంటీ అతన్ని ఆపి, తన గుడ్డ సంచితో లేచింది.

"వద్దు, నేనే వెళ్ళి వాడ్ని చూస్తాను."

"మీరు మంచి ఎండలో వచ్చారు . . . కొంచెం రెస్టు తీసుకోండి! . . . నేను త్వరలో వచ్చేస్తాను!" అని రఘుపతి అతివినయంగా బతిమాలాడు.

"నా బిడ్డని చూసిన తరువాతే నాకు రెస్టు అంతా. ఇంత దూరం రైలెక్కి నేను వచ్చాను, కావేరీ తీరం నాకెంత దూరం?" అని ఎవరినీ లెక్క చెయ్యకుండా ఆంటీ వీధిలోకి దిగి నడవసాగింది. రఘుపతి ఆమె వెంట నడిచాడు. రఘుపతి భార్య పెదిమలు కొరుకుతూ ఇంట్లోకి వెళ్ళింది.

కావేరీ నది గట్టు మండవంలో పక్కవాటుగా పడుకొని దూరలో స్మశానంలో తన్ను మానసికంగా దహనం చేస్తూ  రాజారామన్ ఇంతలో నాలుగు బీడీలు కాల్చేసి తనలో నవ్వుకుంటున్నాడు . . .

'ఎంత విశాలమైనా, ఇరుకైనా, మానవ జీవితమనేది రెండు గట్టులమధ్య ప్రవహించే ఈ ఏరు లాగ. ఆ దేహాన్ని ఒక నౌకలో ఈ గట్టునుంచి ఆ గట్టుకి తీసుకొనిపోతే . . . ఆ తరువాత ఆ నౌకని, శవంని  గట్టుమీద వదిలేసి ఆ ప్రాణం  మాత్రం తన యాత్ర సాగిస్తుంది . .  . ఆ నౌకని ఎవరు మోస్తారు . . . మోయవద్దు, ఎవరు దాన్ని దహనం చేస్తున్నారు?' అని ఏదో ఆలోచిస్తూ రాజారామన్ నవ్వుతున్నాడు.

"నేనింకా ఈ గట్టులోనే ఉన్నాను. ఆ గట్టు చేరిన తరువాతే నా దహనం ఆరంభం అవుతుంది కాబోలు!"   అని రాజారామన్ ఆలోచిస్తున్నాడు; మరొక బీడీ వెలిగించుకున్నాడు.

అప్పుడే దూరంలో మండపంని, రాజారామన్ని చూసిన ఆంటీ ఎంత తొందరగా పరుగెత్తుకొని వస్తోంది! రఘుపతి  ఆవిడతో ఈడుగా పరుగెత్తలేక పోయాడే . . .

"అంబీ  . .  . నా బిడ్డ . . . ఎలాగున్నావ్?" అని వాడిని చేరుకోడానికి ముందే ఆవిడ పిలుపు ఆ మండపంని ధాటిగా  వచ్చి తాకింది.

ఆంటీ మూడు సార్లు పిలిచిన తరువాత, నోటినుంచి బీడీ వేలాడుతూ, రాజారామన్ తన దృష్టిని ఆ దిశలో మళ్ళించాడు.

రెండు చేతులూ చాచి ఆంటీ వస్తోంది. ఒక చెయిలోని గుడ్డ సంచినుంచి ఏదో నేల వాలింది - దాన్ని లెక్క చెయ్యకుండా - ధారధారగా కన్నీళ్ళు కార్చుతూ ఆంటీ పరుగెడుతోంది. ఆవిడ కాలు జారి పడిపోతుందనే భయంతో తహతహలాడుతూ ఆమె వెనుక వస్తున్న రఘుపతి సంచిలోనుంచి పడిన ఆవిడ కళ్ళద్దాలు తీసుకొని వెంట వస్తున్నాడు.

వాళ్ళిద్దరూ మండపం చేరుకొనే ముందు తనకి సంబంధించని ఎవరో ఇద్దరు ఒకరినొకరు తరుముకుంటూ రావడం ఒక ముచ్చటగా చూస్తున్నట్టు, తనలో నవ్వుకుంటూ  రాజారామన్ లేచి కూర్చున్నాడు.  వాడి వేషం, వాలకం  చూడగానే

ఆంటీకి నోరు పెగల్లేదు; వొళ్ళంతా వొణికింది. కాళ్ళీడుచుకుంటూ మెల్లగా మండపం చేరుకుంది.

రాజారామన్ ఈ వాత్సల్యం, భావనలకీ తనకీ ఎటువంటి పొత్తూ లేనట్టు, దూరంగా నిలబడి అదే నవ్వుతూ ఆంటీని చూసాడు.

ఆ చూపు ఆంటీకి రాజారామన్ తన్ను చూడనేలేదని చెప్తోంది. ఆ తరువాత వాడు నోరు తెరిచి 'నువ్వెవరు?' అని అడుగుతాడేమో అనే దిగిలు, అలా అడిగితే ఆ శోకం ఎలా భరించడం అనితెలియక అల్లాడింది.

"అంబీ, నీకు వీళ్ళెవరో తెలుసుకదూ?" అని రఘుపతి అడిగాడు.

రాజారామన్ ఎప్పటిలాగే నవ్వుతూ తనలో నిత్యమూ తారాడుతున్న మౌనం చెదరినట్టు ఆ ప్రశ్నకి ప్రతిధ్వనిగా జవాబు చెప్పాడు:

"ఎందుకు తెలియదు? . . . బాగా తెలుసు . . . "

"నా బిడ్డకి నన్ను తెలియదా? . . . అంబీ, ఇదేం ఘోరంరా?" అని ఆంటీ ఏడుస్తోంది.

"రఘు అన్నయ్యా . . . వీళ్లని మనింటికి తీసుకొని వెళ్ళు!" అని బీడీ పొగ ఊదుకుంటూనే రాజారామన్ అంటున్నాడు.

"అంబీ, నేను నిన్ను చూడడానికే వచ్చాను . . . నాకేం తొందర లేదు!" అని మండపం మురికి నేలమీద, స్తంభంకి సమీపంగా ఆంటీ కూర్చుంది.

రాజారామన్ గభీమని నవ్వాడు.

ఆంటీకి ఆ నవ్వు భయంకరంగా ఉంది.

నవ్వు ఆగిన తరివాత వాడి చూపు ఆ ఎదుట గట్టులోని చితి మీద ఉంది.

ఆంటీ గుడ్డ సంచినుంచి ఏమేమో తినుబండారాలు బయటకి తీసింది.

"అంబీ . . . నీకు ఇది చాలా ఇష్టం," అని ఆంటీ తేనెలో తడిపిన పనసపండుని - దానికి చక్క పిరట్టల్ - అని పేరు - బయటకి తీసి, వాడికి అందించింది. రాజారామన్ ఒక చెయిలో బీడీ, ఇంకోక చెయిలో దాన్ని తీసుకొని, మారి మారి, ఒక దమ్మూ, ఒక కాటుగా రుచి చూస్తున్నాడు.

"మరి వాడికి . . . " అని రఘుపతిని చూపిస్తూ అడిగాడు.

“నేనిప్పుడే తిన్నాను,” అన్నాడు రఘుపతి.

ఆంటీ పదే పదే వస్తున్న కన్నీరుని చీరకొనతో తుడుచుకుంటోంది.

“అంబీ, నీకు తెలుసా? నువ్వు పాసయ్యావ్! . . . ” అని ఆంటీ గభీమని వాడికి చెప్పింది.

ఇప్పుడే వాడు ఆంటీ మొహం తేరిపాఱ చూసాడు; నోటిలో ఉన్నదేదో మింగలేక బాధపడుతున్నట్టు బిగ్గరగా నవ్వాడు.

ఆంటీకి ఆ నవ్వు భయంకరంగా ఉంది.

“అంబీ, నువ్వు వెళ్ళిన ఒక సంవత్సరంలోనో అంకుల్ పోయారు!”

“అలాగా? . . . అప్పుడే . . . మిమ్మల్ని వదిలి పోయారన్న మాట! అలాగా? మిమ్మల్ని వదిలి పోయారన్న మాట! అవునా?” అని ఎవరో తనకి బోధించిన పాఠం వల్లించుతున్నట్టు రాజారామన్ అన్నాడు.

ఆంటీ వాడిని తీవ్రంగా చూసింది.

‘వీడికి చిత్త భ్రమ పట్టుకుందేమో?’ అని ఆంటీకి అనుమానం కలిగింది. కాని తనెవరని వీడు పోల్చుకున్నాడే, తన్ను వాళ్ళింటికి తీసుకొని వెళ్ళమన్నాడే - అవన్నీ చూస్తే వీడి ప్రవర్తన సహజంగానే ఉంది. కాని ఇంతకుముందు వీడిలో లేనిదేదో ఇప్పుడు ఉంది, అది ఏమిటని ఆంటీ మనసుకి మాత్రం బోధపడింది. ‘వీడి సన్యాసి వేషం - ఆ మీసం, గడ్డం, బీడీ - చూస్తే నాకలా ఉందేమో?” అని ఆవిడ మనసు కలవరపడింది.

కాని వాడిని అలాగ వదిలేసి వెళ్ళడానికి ఆవిడకి మనసు రాలేదు. ఇతరులు తమ బాధ్యతలు నెరవేర్చలేదని ఆవిడ మండిపడ్డారు.

‘నేను చెప్తే వీడు తప్పక వింటాడు, నా మాట కాదనడు!’ అని ఆంటీ మనసులో ఒక పిచ్చి నమ్మకం లేచింది.

“అంబీ, నేనిప్పుడు ఎందుకు వచ్చానో నీకు తెలుసా?” అని నవ్వుతూ ఒక ప్రశ్నతో ఆంటీ సంభాషణ ఆరంభించింది.

వాడి దృష్టి అంతా స్మశానంమీదనే ఉంది.

“నన్ను చూడు!” అని కొంచెం ధైర్యంతో దట్టంగా పెరిగిన వాడి గడ్డంని ఆంటీ తన వంక మళ్ళించింది.

“నా బిడ్డని ముందులాగ చూసి ఆనందించాలని వచ్చాను. నిన్ను కళ్యాణరాముడుగా చూడాలని నా ఆశ. నువ్వు తప్పకుండా తిరిగి వస్తావని పది సంవత్సరాలుగా నేను కాచుకొని ఉన్నాను. మీ నాన్నగారు నీకోసం రాసిపెట్టిన ఆస్తులన్నీ నీకు అప్పగించి నువ్వే నాకు అంతిమ క్రియలు చెయ్యాలనే ఆశతో నేను ఇన్ని రోజులూ బతికివున్నాను . . . నాయనా, నా మాట విను, ఈ వేషం చాలు! నీకేం తక్కువరా? నువ్వు మహారాజులాగ జీవించాలి . . . ఈ మోటుతనం వదిలెయ్ . . . నాతో రా, లేకపోతే ఇక్కడే ఉండు . . . ఈ సన్యాసి వాలకం నేను భరించలేను!” అని ఆంటీ ఏడుస్తోంది.

‘ఇక ఏం జరుగుతుందో మనం చూడవల్సిందే!’ అని ఆతురతతో రఘుపతి అక్కడే నిలబడి అన్నీ వినోదంగా చూస్తున్నాడు.

అంటీ మాట్లాడి ముగించేలోపల రాజారామన్ మరో రెండు బీడీలు కాల్చేసాడు.

ఆవిడ మాటల్లో వాడు రవంతైనా గ్రహించినట్టు కనిపించలేదు. ఏ మూలనో దృష్టి పోనిచ్చి ఏదో ఆలోచనలో పడి, తనలో వీడు నవ్వుకుంటున్నాడు.

తన ఎడం కాలు లాగి కుడి తొడమీద ఒక యోగ దండంలాగ భుజం కింద నిలబెట్టి, ఎడం చెయిని దానిమీద చాటి, తలెత్తి, “ఈ స్త్రీ ఎవరు?” అని అడుగుతున్నట్టు గభీమని ఆంటీని చూసాడు. ఆవిడ కళ్ళని పదుపైన ఒక సూదితో కుట్టుతున్నట్టు మాటాడాడు:

“మీ బిడ్డని - అదిగో - ఆ కట్టెలకుప్పలో - తగులబెట్టారు. మీ అస్తి కూడా తగులబెట్టేసి రండి . . . రాజారామన్ . . . నేనుకూడా ఆ చితిలో ఉన్నాను . . . అలా తిరిగి చూడండి . . . ”

వాడు మాటాడుతుంటే ఆంటీకి భయంగా ఉంది, కాని వాడిని ఆపడానికి, ఆక్షేపించడానికి ఆవిడకి ధైర్యం లేదు.

"లేకపోతే, మరొక పని చెయ్యండి! అన్నిటినీ బీడీలుగా చేసి తీసుకురండి! నేనే అన్నీ కాలుస్తాను, సరేనా?" అని ఏదో పెద్ద హాస్యంగా మాటాడినట్టు రాజారామన్ బిగ్గరగా నవ్వాడు.

తడిసిన కళ్ళు తుడుచుకుంటూ ఆంటీ వీడిని దీర్ఘంగా చూసింది.

'వీడు నా బిడ్డ కాదు! వాడిలా మాటాడడు. వీడు అంటున్నది నిజం, వీడు నా బిడ్డ కాదు, వీడు ఎవరి బిడ్డా కాదు!'

ఆంటీకి ఇప్పుడు అంతా బోధపడింది; తను వాడితో మాటాడినదంతా తప్పేమో అని అనుమానం కలిగింది.

మౌనంగా ఆ కావేరీనది ఒడ్డుకి ఎదుట ఉన్న స్మశానంలోని చితిని చూసి ఆంటీ హోరుమని ఏడ్చింది.

అక్కడ వరుస వరుసగా పిడకలు పేర్చి, కట్టెలు పఱచి, తడిసిన మన్ను పూసిన చితినుంచి వచ్చే పొగ కొంచెం తగ్గినట్టనిపించింది. గభీమని ఆ కట్టెల మధ్య, మెట్టు మెట్టుగా మాడిపోతూ, ఎఱ్ఱగా, నారింజ రంగులో, ఆ జ్వాల లేచింది.

రాజారామన్ బీడీ పొగ మధ్య నోరు తెరిచి ఒక పసిపాపలాగ నవ్వుతున్నాడు.

********

# ఊగెడు కుర్చీలు

# ఊగెడు కురిచీలు

## నేపథ్యం

ఆ చిన్న బంగళా, ఆ వీధిలోవున్న తక్కిన ఇళ్ళతో దెబ్బలాడి, మనస్సు విరిగి, దూరంలో నిలబడుతున్నట్టు కనిపిస్తోంది. ఏవో రహస్యాలని తనలో దాచుకొనే దొంగలాగ, ఇతరులెవరినీ చూడడానికి ఇష్టం లేకుండా, అందరినీ అనుమానించే అన్యుడి ధోరణిలో, కళ్ళు మూసుకొని ఒక మూల, తామసమనే బురదనేలలో మునిగిపోయిన ఒక సోమరిపోతులాగ . . .

ఆ ఇంటి తలుపులు - కాంపౌండు తలుపులు, ప్రవేశ ద్వారాలు, కిటికీలు - అన్నీ నిత్యమూ మూసేవుంటాయి. ప్రవేశ ద్వారం మీద ప్లాస్టిక్ అక్షరాలతో పేరు రాసిన చిన్న చిన్న రేకులు కనిపిస్తాయి.

మిస్ ఎమ్. జానకి, M.A.,

ఎమ్. ఆడలరశన్, B.O.L.,

మిస్. ఎమ్. చెల్లం, B.A., B.T.,

వీటందరికీ మీద ఉన్న ఇంకొక పలకని ఇటీవల తీసేసినట్టు ఒక సూచన మాత్రం కనిపిస్తోంది.

కొన్ని సమయాల్లో ఇంటి ప్రవేశద్వారంలో ఒక పెద్ద తాళం వేలాడుతోంది. అప్పుడుకూడా ఇంటిలోపల మనుషులు ఉంటారు. నౌకరులు, వంటమనిషి కాంపౌండు గేటుని తెరిచి, పక్కవాటుగా వెళ్తున్న ఒక సందులో నడిచి, పెరడుగుమ్మంద్వారా ఇంటిలోకి ప్రవేశిస్తారు; పెరడుగుమ్మం తాళంచెవి ఎల్లప్పుడూ వంట మనిషి దగ్గర ఉంటుంది.

ప్రవేశ ద్వారం మీద రాసిన పేర్లకి అర్హులైన ముద్దుబిడ్డలని కన్న ఆ తల్లి, కీర్తిశేషులు, ప్రసిద్ధ తమిళ పండితుడు రావ్ బహదూర్ మగిళ్మారన్ పిళ్ళైగారి కొమార్తె; తలవంపు, అవమానంకి పాత్రుడై, ఇరవైఐదు సంవత్సరాలముందు ఒక హోటల్లో ఆత్మహత్య చేసుకున్న - ఆ కుటుంబంలో అందరూ కావాలనే పేరు కూడా మరిచిపోయిన ఒక జూదరి భార్య - ఆ శ్రీమతి అలంకాలవల్లియమ్మాళ్.

ఆవిడ తను బయటికి వెళ్ళినప్పుడెల్లా - ఒక ఇనుప పెట్టెలో అమూల్య వస్తువులని భద్రపరచినట్టు - తన పిల్లలని కూడా ఇంటిలో బంధించి, తాళం వేసి వెళ్తుంది.

ఒకానొకప్పుడు - ఆమె సంతానం చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు - అపకీర్తికి, నిందకీ పాత్రుడైన తన జూదరి భర్తనుంచి వాళ్ళని కాపాడాలని ఆ తల్లి పూనుకున్న ఉపాయం అది.

ఆ పథకం సరేనా, అందులో న్యాయముందా అని ఎవరైనా అడిగితే ఆ రోజుల్లో అలంకాలవల్లియమ్మాళ్ వెయ్యిలకొలదీ కారణాలు చెప్పేది; ఈ రోజుల్లో దానికి మించి చాలా కారణాలున్నాయని ఆవిడ ఆలోచించోంస్తోంది కాబోలు! ఆవిడ చెలాయించుతున్న ఆ హక్కుని ఆమె వలన ఆ ఇంటిలో బంధించబడినవారెవరూ - అందులో పట్టభద్రులూ, పెద్ద పెద్ద ఉద్యోగాలలో బాధ్యత వహించేవారూ, వందలూ, వెయ్యిలూ జీతంగా పుచ్చుకొనేవారూ - మగవారు, ఆడవారు, ఉన్నారు! - ఒక సారైనా ప్రశ్నించలేదు.

'అటువంటి ప్రశ్నని అలంకాలవల్లి ఎందుకు ఏ నాడూ అనుమతించదు?' అని అడిగితే ఆ కుటుంబంకి అవతల ఉన్నవాళ్ళెవరూ ఆవిడని ఎదురించలేదు అని చెప్పడం సులభం. కాని M.A., చదువు చదివి టెలిఫోన్ డిపార్టుమెంటులో ఒక శాఖని నిర్వహిస్తూ సమర్ధతతో, ఖరారుగా ఆఫీసరు ఉద్యోగం చేస్తున్న కడపటి కూతురు జానకి; ఒక హైస్కూలులో ప్రధమ ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న ఆమె చెల్లెలు చెల్లం; కాలేజీలో అందరిని హడలుగొట్టుతూ, నిత్యమూ చిరచిరలాడుతూ, నవ్వంటే ఏమిటో తెలియని ఆ 'సీరియస్ టైప్' ప్రధానాధ్యాపకుడు, ఆడలరశన్ - వీళ్ళందరూ ఎందుకు దీనిగురించి ఏమీ పట్టించుకోకుండా, ఆ తల్లి తాళం వేసిన ఇంటిలో ఖైదీలలాగ ఉంటున్నారు?

ఇది అలవాటుగా ఆ కుటుంబ సభ్యుల అంగీకారం అనవచ్చా? 'మన భద్రతకే కదా?' అనే వాళ్ల సంతుష్టి వలనా? లేకపోతే 'తల్లి మనసు నొప్పించకూడదు!' అనే అకాంక్ష?

తెలీదు! తెలీదు! తెలీదు! కాని, రోజువారీ అది అలాగే సాగుతోంది!

పొద్దున్న తొమ్మిదిగంటలకెల్లా ఆ ఇంటి తలుపులు తెరుచుకుంటాయి. ఖైదీలు బయటకి వెళ్ళడానికి అనుమతించే కావలివాడులాగ అలంకారవల్లి గుమ్మం దగ్గర

నిలబడుతుంది; కాని ఆమెలో చెరశాల కాపు కాఠిన్యం కనిపించదు; తన కాళ్ళని చుట్టుకొని మేస్తున్న పిల్లలని తన రెక్కలక్రింద రక్షించే పెట్టకోడి వాలకమే - చురుకుగా - కనిపిస్తుంది.

వాళ్ళకి ముందుగా తను వచ్చి నిలబడడానికి కారణం శకునం చూడడానికే. 'వితంతువు, ఒంటి బ్రాహ్మణుడు, ఎండు కట్టెల బండి - ఇలాంటి అపశకునాలు కనిపిస్తున్నాయా?' అని ఆవిడ నాలుగు పక్కలూ తిరిగి తిరిగి చూస్తుంది.

ఆ తల్లి ఉపదేశం వినడానికి ముప్పదేళ్ళు దాటిన ఆ ముగ్గురు పిల్లలూ సిద్ధంగా నిలబడతారు. వారందరి నుదుటలోనూ ఇంతకు ముందే ఆ తల్లి, పిల్లలు తమ ఇష్టదేవతని[1] పూజించిన కుంకుమం, విభూతి పూసి, “దేవుడా, నా పిల్లలని కాపాడు!” అని ఆ తల్లి ప్రార్థించుకుంటుంది.

శకునం చూసి “జాగ్రత్తగా వెళ్ళిరండి!” ఆ ముగ్గురు పిల్లలకి ఒకసారికి మూడుసార్లు బోధన చేసి అలంకారవల్లి జానకిని మాత్రం దగ్గరకి రమ్మని పిలిచి, ముద్దుపెట్టి, సాగనంపుతుంది. గుమ్మం దగ్గర నిలబడి ఆ పిల్లలు వీధిలో దిగి నడుస్తూంచే, వాళ్ళు ఆ వీధి కొన చేరుకున్నవరకూ చూస్తుంది. జానకి వీధి మూల చేరుకున్న వెంటనే తిరిగిచూసి చెయితో తల్లికి సైగ చేస్తుంది. ఆ నిమిషం అలంకారవల్లిని చెప్పలేని ఆనందం, సంతోషం ఆవరించుకుంటుంది. ఈ పిల్లలందరినీ పెంచి, ఆ పాడైన భర్త అపవాదంలో చిక్కకుండా వారిని కాపాడినందుకు తను అనుభవించిన బాధలన్నీ ఆ క్షణంలో మాయమై, మనసు పులకరిస్తుంది; కళ్ళు తడిసిపోతాయి. చీర మొనతో కళ్ళు తుడుచుకొని, తలుపు మూసేసి, లోపలికి వెళ్ళి, మళ్ళీ మురుగన్ పఠంముందు నిలబడి పిల్లలక్షేమంకోసం ప్రార్థిస్తుంది.

రోజువారీ - శనివారం సమేతంగా, వర్జ్యం ముందే పిల్లల్ని సాగనంపడంవలన ఈ వాడుకలన్నీ పొద్దున్న తొమ్మిది గంటల లోపల పూర్తి అవుతాయి.

ఉదయం కలిసి వెళ్ళిన ఆ ముగ్గురూ సాయంకాలం వేరువేరుగా తిరిగివస్తారు; ఒకరి తరువాత ఒకరు తిరిగి వస్తుంటే వాళ్ళకి స్వాగతం చెప్పడానికి అలంకారవల్లి గుమ్మందగ్గర నిలబడివుంటుంది.

---

[1] వీళ్ళ ఇష్టదేవతత మురుగన్; సుబ్రమణ్యస్వామికి తమిళంలో పేరు

ఐదున్నరనుంచి ఆరు గంటలులోగా ముగ్గురూ వచ్చేస్తారు; ఆ తరువాత మూసుకున్న ఇంటి తలుపులు మళ్ళీ మరుదినం తొమ్మిది గంటలకే తెరుస్తారు.

ఇంటి హాలులో కొంచెం ఎత్తు తగ్గిన ఒక గుండ్రని మేజా, దాని చుట్టూ, వరుసగా ఐదు ఊగెడు కుర్చీలు, ఉంటాయి. మేజామీద ఆంగ్ల, తమిళ మాస, వార, దిన పత్రికలు, కనిపిస్తాయి; పక్కనే ఒక రేడియో, హాలు మూలలో ఒక టెలిఫోను - కాని వాటిని ఎవరూ ఎక్కువగా ఉపయోగించరు.

ఎప్పుడైనా అలంకారవల్లి ఆఫీసుకి ఫోనుచేసి తన కూతురుతో మాటాడుతుంది; కొన్నిసార్లు ఆడలరశన్ ఇంటికి ఫోను చేసి "ఇవాళ నేను రావడానికి అర్ధగంట ఆలస్యమవుతుంది," అని చెప్తారు; ఇంటిలో ఉన్నవారిని తప్పిస్తే, వాళ్ళలో తామే మాట్లాడుకోడం మించి అన్యులతో ఫోనులో ఎవరూ, ఎప్పుడూ మాటాడరు; ఎప్పుడైనా రేడియోలో సినిమా పాటలు వింటారు.

ఆఫీసునుంచి, స్కూలునుంచి, కాలేజీనుంచి ఇంటికి తిరిగివచ్చి దుస్తులు మార్చుకున్న తరువాతనే, దీనికోసమే కాచుకున్నట్టు, ముగ్గురూ హాలులో ఉన్న ఊగెడు కుర్చీలమీద వాలుతారు. ఆ కుర్చీలకి కాళ్ళుండవు; విల్లులాగ రెండుపక్కలా కనిపించే పాదాలు ముందూ వెనుకా కదలినప్పుడు హాయిగా ఉంటుంది. 'కిర్రు', 'కిర్రు' మని వినిపించే ధ్వని లయలాగ చెవులకి ఇంపుగా ఉంటుంది. తమ మానసిక స్థాయికి తగినట్టుగా ఆ కుర్చీని మెల్లగానో, మధ్య మధ్య ఆపుతూనో, లేక దాన్ని, తొందర తొందరగా, రెండు మూడు సార్లు కోపం, ఉత్సాహం, లేక విసుగ్గు వలన ఒక యంత్రంలాగ నడిపించే అలవాటు ఆ ఇంటిలో అందరికీ ఉంది. అలంకారవల్లి కుర్చీ వడ్రంగి పనితో చెయ్యబడిన పాతకాలపు వాలుకుర్చీలాగుంటుంది. అది చాలా పురాతన మోస్తరు, కిత్తనారుగుడ్డ పనికిరాదు. బెత్తెంతో వలలాగ అల్లి ఉంటుంది. కొబ్బరి పీచుతో మెత్త దిండులు కూడా వాడుతారు.

అబ్బాయి, అమ్మాయిలూ ఇంటికి వచ్చిన తరువాత తల్లి తన కుర్చీలో కూర్చొని, దాన్ని ఆడుతూ, మాటలాడిన తరువాతనే, ఆవిడ ప్రశ్నలడిగిన తరువాతనే, ఆవిడ నవ్వుతూ సంభాషణ ఆరంభించిన తరువాతనే, ఇతరులు మాట్లాడతారు.

కొన్ని రోజులు ఆ తల్లి  మనస్థితి సరిగ్గా లేదంటే ఆ రోజంతా ఆవిడ మాటాడాదు; పిల్లలూ ఎవరితోనూ మాటాడరు.

అటువంటి రోజల్లో - 'అమ్మ ఎందుకో మాటాడదు, పోనీలే, మన మాటాడుకుందాం!', అనికూడా ఆ పిల్లలకి అనిపించదు. ఇదేం న్యాయం? వాళ్ళెందుకు అలాగున్నారు? ఎందుకు ఆ ముగ్గురూ వారంతటవారే విరోధం ఉన్నట్టు ఒకరితో ఒకరు మాటాడకుండా, మొహం చూడకుండా, తమ తమ ఊగెడు కుర్చీలలో కిర్రు. కిర్రు మని ఆడుతూ ఉంటారు?

తమలో తమే అలా మాటాడుకుంటే తల్లిని దూషించినట్టు అర్థమా?

తల్లి మాటాడపోతే దానికి మంచి కారణం ఉండి తీరాలనే వాళ్ళు ఏకీభవిస్తున్నట్టు ఆ మూడు కుర్చీలుకూడా ఆడుతున్నాయా?  అదేనా మనం చూస్తున్నాం?

తెలీదు! తెలీదు! తెలీదు!

కాని, రోజువారీ అది అలాగే సాగుతోంది!

నియమంగా వంటమనిషి - ఆ ముసలమ్మ - పళ్ళెంలో టిఫన్ తెచ్చి పెడుతుంది; వేడి తేనీరు ఒక తట్టలో తెచ్చి వీళ్ళెవరినీ చూడకుండానే వెళ్ళిపోతుంది.  చూసిందంటే, అంతే? పనినుంచి దాన్ని తొలగించి ఇంటికి పంపేస్తారు!  కుటుంబ సభ్యులందరూ అలాగే కూర్చుంటారు; వాళ్ళ మధ్య ఒక దగ్గు, మూలుగు కూడా వినిపించదు!

ఊగెడు కుర్చీలు మాత్రం కిర్రు, కిర్రుమని ఆడుతుంటాయి.

గభీమని అలంకారవల్లి మాత్రం ఒక పెద్ద నిట్టూర్పు వదిలి "ఓ, భగవంతుడా!" అని నిరాదరువుగా కన్నీరు కార్చుతుంది.

ముగ్గురు పిల్లలూ తల్లిని చూస్తారు; వాళ్ళ కళ్ళూ తడిసిపోతాయి.

నవ్వంటే ఏమీ ఎరుగని ఆడలరశన్ రెండు కళ్ళనీ చేతులతో కప్పుకుంటారు. నిత్యమూ  కుర్చీలో కూర్చొని, యంత్రంలాగ రెండు చేతులతో  చురుకుగా స్వెటరు అల్లుకుంటున్న చెల్లం సూదులూ, దారం కండెలు మేజామీద పెట్టేసి, లేచి, తల్లి కాలుదగ్గరవచ్చి కూర్చుంటుంది. జానకి "అమ్మా, మీకేమైంది? మీరెందుకు

ఏడుస్తున్నారు? . . . ఏడవకండి! . . . " అని బతిమాలుడుతూ తల్లి బుగ్గని తాకి, ముద్దు పెట్టి, బిగ్గరగా తనూ ఏడుస్తుంది.

ఈ ముగ్గురూ బిగ్గరగా ఏడవడం చూసి అలంకారవల్లి వాళ్ళని తన రెండు చేతులు చాచి, తనముందు లాగ్గొని కౌగిలించుకుంటుంది.

"వొద్దు, ఏడవకండి! . . . మరేం లేదు . . . నా మనసు బాగా లేదు . . . మీరు ఏడుస్తే నేను భరించలేను . . . " అని ఆ తల్లి వాళ్ళని, దగ్గరకి బాగా లాగ్గొని ముద్దుపెట్టుకుంటుంది.

మెల్లమెల్లగా వాళ్ళ ఏడ్పులూ, కన్నీరు కార్చడమూ తగ్గుతుంది.

అలంకారవల్లి గతించిన తమిళ విద్వాంసుడు తన తండ్రి మగిళమారన్ పిళ్ళై ప్రజ్ఞ గురించి మాటాడుతుంది; లేకపోతే తన మెట్టినిల్లులో తను పడిన బాధలని తడిసిన కళ్ళతో  విపులంగా వాళ్ళకి వర్ణించి చెప్తుంది. ఆఖరికి, ఈ లోకం గురించి, మనుషుల గురించి, వాళ్ళ పాపిష్టి గుణాల గురించి, విపరీతంగా తన 'పిల్లలకి' ఎచ్చరిక చేస్తుంది. ఆవిడ సల్లాపంలో తమవంటి అధికోన్నత జీవులు, ఉత్తమ శ్రేణికి చెందినవారు ఎలాగ, జాగ్రత్తగా ఈ సమాజంలో మెలగాలనే బోధనలే ముఖ్యంగా చోటుచేసుకుంటాయి. ఐతే, ఆ ప్రసంగం  సాగడానికి ముందు ఆ ముగ్గురు పిల్లలు ఆ రోజు తమ తమ అనుభవాలని,  ఆఫీసులో, కాలేజీలో, స్కూలులో, జరిగిన ఝటనల గురించి వివరాలు , వరుస వరుసగా, ఒకరి తరువాత ఒకరు, ఆ తల్లికి, తెలియజేస్తారు.

కొన్ని సమయాల్లో వాళ్ళమధ్య విమర్శనలు, సంభాషణలు, బలమైన వాదనలు క్లిష్టమైపోయి ఒకరితో ఒకరు దెబ్బలాడుకుంటారు. చెయిలో వున్న వార్తా పత్రిక లేక పుస్తకాన్ని కోపంతో విసరడం, 'నీకెందుకు నేనంటే ద్వేషం? నాకెందుకీ బతుకు? నేనిక ఆత్మహత్య చేసుకుంటాను!' అని ఒకరినొకరు నింద మోపడం, బిగ్గరగా ఏడవడం - ఇవన్నీ తరచుగా జరిగేవే. అటువంటి సమయాల్లో పిచ్చెత్తి, ఆత్మనాశక మానసికావస్థలో చిక్కుకున్నట్టు, వేరు వేరుగా, ముగ్గురూ తమ తమ నెత్తులు గోడల్లో బాదుకోడమూ జరుగుతుంది.

తల్లికీ, పిల్లలకీ మధ్య ఇటువంటి ఘర్షణలు లేచినప్పుడు వాళ్ళు తమ పరస్పర ప్రేమానురాగాలు, మర్యాద పోగొట్టుకొని ఒకరిమీద ఒకరు పైబడతారు. తిట్టుకుంటూ, పిచ్చిగా ఏమేమో చెప్పుకొని రోజంతా గడుపుతారు.

ఆఖరికి గోడలో వేలాడుతున్న ఆ పెద్ద మురుగన్ పఠం ముందు నిలబడి దాన్ని తేరిపాఱ చూసి, అలంకారవల్లి వెక్కి వెక్కి ఏడుస్తుంది; తన మొహాన్ని, ఛాతినీ, వెర్రిగా బాదుకుంటుంది.

"దేవుడా, నీకుగాని శక్తి ఉంటే ఇక నా బతుకు చాలించు! నేను భరించిన కష్టాలు చాలవా? ఆఖరికి నా కడుపులో పుట్టిన పిల్లలకోసం నేను పడిన కష్టాలన్నీ వ్యర్థమై పోయాయే! . . . ఇదొక కృతజ్ఞతలేని ప్రపంచం! . . . నాకీ బతుకు వద్దు, నన్ను త్వరగా తీసుకొని పో!" అని ఆమె అంగలార్చుకున్నప్పుడు చెల్లం లేక జానకి ఒక దూకు దూకి, తల్లిని గట్టిగా అణచుకొని ఓదార్చుతారు.

ఆఖరికి తమకున్న అపార తల్లి ప్రేమ వలనో లేక తమ పొరబాట్లు తల్లిని మనసుని ఎంత ఘాటుగా నొప్పించాయో అని గ్రహించినట్టు ఆ పిల్లలు తల్లి దగ్గర క్షమాపణకోసం బతిమాలుతారు.

"ఇదంతా నీవలనే . . . అవును, నువ్వే కారణం! . . . " అని తల్లిమనసు నొచ్చుకుందని ఆ పిల్లలు - తమలోనే - ఒకరినొకరు నిందించుకుంటారు.

ఆఖరికి ఆ తల్లి దయాళు హృదయం పిల్లలందరిని క్షమించుతుంది; కాని తనపై ఇంత ఘాఢమైన ప్రేమానురాగాలు చూపించే పిల్లల సంతోషంకోసం అలంకారవల్లి ఒక పాట పాడుతుంది; పాట అంటే మరేం కాదు, ఒక భక్తిగీతం అన్నమాట, మురుగన్ గురించి.

తల్లి ఒక వరుస పాడి ఆపిన తరువాత ముగ్గురూ ఆమెను అనుసరించి పాడతారు; మైమరచి పాడతారు. ముఖ్యంగా ఆఖరి కూతురు జానకి, కళ్ళు మూసుకొని, కన్నీరు కార్చుతూ పాడుతుంది. ఆడలరశన్ రెండు చేతులతో తాళం వేస్తూ, కుర్చీలో కూర్చొనే, ఆడుతూ, ఊగుతూ, లయతో, పాడతారు. తమ్మల్ని ఆవరించుకున్న దుష్ట శక్తులని చెదరగొట్టాలని ప్రార్థన చేస్తున్నట్టు, భయభక్తితో, అందరూ కళ్ళుమూసుకొని పాడతారు.

ఒక ఘుట్టం తరువాత, ఊగెడు కుర్చీల మధ్య ఆడుతూ, పాడుతూ ఉన్న ఆ కుటుంబ సభ్యుల ధోరణి చూసినవారికి వాళ్ళందరూ భక్తి సముద్రంలో సంతోషంతో తేలుతున్న నౌకలులాగ కనిపిస్తారు.

ఆ తరువాత, గభీమని, ఆ భక్తి ప్రవాహంలో సత్తువ తగ్గిన తరువాత ఎవరో ఒకరు - మామూలుగా అలంకారవల్లి - కళ్ళు తెరిచి నిద్రనుంచి అప్పుడే లేచినట్టు ఆ పరిసరాలు చూస్తారు.

మామూలుగా, ఘర్షణలు, కోపతాపాలు లేవంటే, రాత్రి భోజనం సరిగ్గా ఎనిమిదిన్నర గంటలకి సమాప్తి అవుతుంది. భోజనం చేసినప్పుడుకూడా పాటించవలసిన నియమాలన్నాయి, వాటిని అమలు చెయ్యడం అలంకారవల్లి బాధ్యత. ఎది ఎక్కువగా తినవచ్చు, ఎది ఎక్కువగా తినకూడదు, భోజన పదార్థాలలో మనం గమనించవలసిన అంశాలు - ఉష్ణం, శీతలం, వాయువు - ఇవన్నీ మనసులో పెట్టుకొనే తల్లి పిల్లలకి అన్నం వడ్డిస్తుంది.

రాత్రి భోజనం తరువాత అందరూ ఇంటి డాబా మీదకి వెళ్ళి కొంచెం సేపు విశ్రాంతి తీసుకుంటారు. పౌర్ణమి రోజులైతే చిన్న పిల్లల్లాగ ఆడుకుంటారు; ఎవరి కళ్ళైనా మూసేసి దాగుడుమూతలాడుకుంటారు.

పదిగంట్లకి ముందే అందరూ మేడదిగి కిందకి వచ్చేస్తారు. నిద్రపోయేముందు అందరికీ అలంకారవల్లి ఒక గ్లాసులో పాలు, ఏదో ఒక మాత్ర ఇస్తుంది. ఆఖరికి తనూ ఒక మాత్ర మింగి పాలు తాగుతుంది.

జానకి మాత్రం, ప్రతీ రోజు, ఆ మాత్ర ఇవ్వగానే గొణుకుతుంది:

“ఇదేంటమ్మా? . . . ఎందుకు ఇది రోజు? . . . ”

“ఊరుకోవే, నీకేం తెలుసు? ఇవన్నీ ఎందుకని నాకు తెలుసు . . . రోజంతా ఆఫీసులో పని చేసే దేహంకి కొంచెం రెస్టు వద్దా? అందుకే ఇది . . . ” అని ఆవిడ అన్నప్పుడు ఆ క్షణం వాళ్ళందరి మనసులోనూ తమలో కనిపించని ఒకతను గుర్తుకు వస్తాడు.

“అమ్మా, పెద్దన్నయ్య ఎప్పుడు వస్తారు?” అని తడిసిన కళ్ళతో జానకి అడుగుతుంది.

అలంకారవల్లి జానకిని గట్టిగా అణచుకుంటుంది.

“దేవుడి దయవలన వాడు త్వరగా వచ్చేస్తాడు! . . . వాడికేం కొఱితా, రోగం లేదమ్మా! . . . . నిన్న కూడా నేను వాడిని చూసినప్పుడు నీ గురించి అడిగాడు, నేను నీకు చెప్పానుగా? . . . వాడొక పెద్ద జ్ఞాని . . . వేదాంతి . . . వాడు ఎక్కడ ఉంటే ఏం, వాడున్న చోట ఒక కోవిలగా ఐపోతుంది . . . ” అని కన్నీరు కారుస్తూ, జానకి వీపుని ప్రేమతో తట్టి ఓదార్చుతుంది. ఆ తరువాత జానకి నిద్రపోతుంది.

ఆ పొటుగాటి హాలులో వరుస వరుసగా ఉన్న మంచాల్లో అందరూ పడుకొని చాలాసేపు కబుర్లు చెప్పుకొని నిద్రపోతారు; కొన్ని సమయాల్లో తెలివి తప్పినట్టు మాటాడుతూనే నిద్రపోతారు.

కొన్ని రోజులు అలంకారవల్లి ఆ మాత్ర తీసుకోకుండా, నిద్రపోవడానికి ఇష్టం లేక, తన పిల్లలందరికీ మాత్ర ఇచ్చి వాళ్ళందరూ నిద్రపోయిన తరువాత హాలులోవున్న తన కుర్చీలో కూర్చుంటుంది.

ఏకాంతంలో, ఆ చీకటిలో, కిర్రు కిర్రుమని ఆ కుర్చీ లయబద్ధంగా, అనేక విధాలుగా ఆడుతూనేవుంటుంది.

అలంకారవల్లి ఎందుకిలా ఆడుతోంది?

అదేం మాత్ర?

ఆ పెద్దన్నయ్య ఎవరు? అతనెక్కడ ఉన్నారు? అతనెప్పుడు వస్తారు?

తన పిల్లలని ఇంత ప్రాయం వచ్చినా ఇలాగే పోషించుతోందే, ఈ తల్లిని ఏమనాలి? వాళ్ళ జీవితంలో తన్ను తప్పించి మరొక తోడు, దాంపత్యం అనే బంధం ఏర్పడాలనో, అందుకు తను దోహదం చెయ్యాలనే ఆలోచన కూడా - ఏ తల్లికైనా సహజంగా కలిగే భావన - ఈమెలో రవంతైనా కనిపించదేం? ఆ పిల్లలు కూడా దీని గురించి ఎప్పుడూ ఆలోచించరా?

వాళ్ళు అసలు ఆలోచించరా? లేక అలంకారవల్లి వాళ్ళకది సాధ్యమవకుండా చేస్తోందా?

ఒక వేళ - ఇవన్నీ తల పోసుకుంటూ, కలవరపడుతూ, ఏం చెయ్యాలో తెలియక, అలంకారవల్లి, ఏకాంతంలో, చీకటిలో, అర్ధ రాత్రిలో, తన మనసూ, జ్ఞాపకాలు ఇలాగా అలాగా ఊగుతుంటే ఆ ఉపద్రవం తాళలేక తన కుర్చీని ముందుకీ, వెనక్కీ నెట్టుతుందా?

‘కిర్రు’, ‘కిర్రు’,  మని ఆడుతున్న ఆ కుర్చీయే జవాజు చెప్తోంది!

తెలీదు! తెలీదు! తెలీదు!

## రంగం - 1

ఇవాళ ఆదివారం కాదు, గురువారం. కాని జానకి ఆఫీసుకి వెళ్ళలేదు; శెలవు తీసుకొని ఇంట్లేనే ఉంది; ఇంట్లో మరెవరూ లేరు.

ఇప్పుడు సమయం మధ్యాహ్నం మూడు గంటలు. కొంచెం సమయం ముందు అలంకారవల్లి, జానకికి అన్నం వడ్డించి. తనూ భోజనం చేసి, దేవుణ్ణి నమస్కరించి, నుదుటమీద విభూతి పూసుకొని, జానకిని జాగ్రత్తగా ఇంటిలో ఉండమని హెచ్చరించి, బయటికి వెళ్ళింది. వంటమనిషి - ముసలమ్మ - నాలుగు గంటల తరువాత వస్తుంది.

జానకి తన ఊగెడు కిర్చీలో కూర్చొని మెల్లగా ఆడుతోంది.

ఎక్కడో, బయటనుంచి - పొరుగింటినించో లేక మూడవ ఇంటినించో - రేడియోలో, ఒక సినిమా పాట వినిపిస్తోంది.

అది సాధారణంగా సినిమాల్లో,  అందరికీ పరిచయమైన ఒక సరాసరి పాటే; బుగ్గలు, ముద్దు, పెదవులు, తీయని కలలు, స్వర్గం, అనే పదాలు పలుకుతూ నిషాతో ఆడవారు, మగవారు - ఒకరి మార్చి ఒకరు - తమ తమ వక్రబుద్ధిని ప్రేరేపించినట్టు సల్లాపం చేసుకుంటున్నారు.

గభీమని జానకి కుర్చీనుంచి లేచింది; తల తిప్పి పరిసరాలు చూసింది; తను ఏకాంతంగా ఉండడం గ్రహించగానే  ఒక క్షణం ఆమె మనసు జలదరించింది.

‘అవును, ఎవరూ లేరు! ఇంటిలో ఎవరూ లేరు!’ అని జానకి తన ఒంటరితనం దృడంగా గుర్తుచేసుకుంది.

‘అవును, అమ్మ లేదు!. . . ” అని తనలో తనే గొణుక్కుంటూ ఆ గదిలో మాలనున్న రేడియో మీటని నొక్కింది. వెంటనే “ముద్దు . . . పెదవులు . . . నడుము . . . నిషా . . . స్వర్గం . . . ” అనే మాటలతో ఆ పాట వినిపించింది.

జానకి మళ్లీ కుర్చీలో కూర్చుంది. మళ్ళీ ఆ కుర్చీ ఆ పాట లయకి అనుగుణంగా, నేపధ్యంలో వాయించే వయలిన్ లాగ . . .

'కిర్రు', 'కిర్రు' మని ఆడుతోంది.

ఆమె ఒడలంతా పట్టు పురుగులు గీకుతున్నట్టు వణకింది. కారణం లేకుండా కళ్ళు తడిసిపోయాయి. ఊయలలో ఆడుతున్న పసిపాపలాగ నవ్వాలని ఉంది.

"బుగ్గలు . . . ముద్దు . . . పెదవులు . . . నడుమూ . . . "

జానకి మనసుని చవుకబారమైన, చందస్సు లేని ఈ చెత్త సినిమా పాటే ఇంత గొప్పగా చిత్రవధ చేస్తుందన్నమాట!

పాట ముగిసింది. తర్వాత వచ్చే పాట గురించి రేడియోలో ప్రకటన రావడానికి ముందే జానకి లేచి రేడియోని ఆపేసింది.

"ఛీ, ఛీ, vulgar music!" అని ఉమ్మేతూ ఆ పొరుగింటినించో లేక మూడవనింటినుంచో వస్తున్న ఒ పాట సద్దుకూడా వినకూడదనే ఆతురతతో జానకి ఆ ఇంటిలో తెరిచివున్న ఒక కిటికీని దభాలున మూసేసింది.

మళ్ళీ తిరిగివచ్చి, కుర్చీలో కూర్చొని, జానకి తన బుగ్గలని తాకుతూ ఒక నిట్టూర్పు వదులుతోంది. పక్కనే ఉన్న గుండ్రం మేజానుంచి ఒక ఆంగ్ల పత్రికని అందుకొని పేజీలని తిరగవేస్తోంది; ఏదో పేజీలో ఉన్న ఒక హాస్యం చదివి తనలో నవ్వుకుంటోంది:

"How mischievous! Men are really mischievous - yes, all of them!" అని జానకి తనలో చెప్పుకుంటోంది. తరువాత తన చూపుడు వేలుని తన పెదిమలమీద ఒత్తుకొని ఏదో, ఎవరిగురించో, తుంటతనంగా గుర్తు చేసుకొని, లోపలికి వెళ్ళి, ఒక hand bag తీసుకొని వచ్చి దానిలోపల వెతికి ఒక visiting card బయటికి తీసి చదువుతోంది.

"A.P. సుందరం . . . ఫోటోగ్రాఫర్స్! . . . "అని రెండు మూడు సార్లు తనలో వల్లించుకుంటూ జానకి ఆ హాలులో రెండు సార్లు ఇటూ అటూ నడుస్తూ, ఆలోచిస్తూ, నవ్వుకుంటోంది. రహస్యంగా, ఒక దొంగలాగ టెలిఫోను రిసీవరు తీసుకొని, రెండు అంకెలు డయల్ చెయ్యగానే ఆమె ముఖభావం మారుతోంది; భయంతో రిసీవరుని పెట్టేసింది.

జానకి మొహమంతా చెమట పట్టేసింది. ఫోను పక్కనే కొంచెం సేపు నిలబడి, ఎక్కడో చూస్తూ ఇంకొక మనిషితో మాటాడుతున్నట్టు తనలో తనే బిగ్గరగా చెప్పుకుంటోంది.

"What's wrong with it? సుందరం నా classmate . . . Nice fellow . . . నేనెందుకు అతన్ని పిలవకూడదు? అతన్ని అవాళ చూసానని అమ్మకి చెప్పానే, అమ్మ ఏమీ అనలేదే? How about inviting him? Why not?"

మళ్ళీ రిసీవరు తీసుకొని, ఈ సారి దృఢంగా, జానకి ఐదు అంకెలూ డయల్ చేస్తోంది.

అవతల ఎవరో ఫోను అందుకున్నారు, గంట ధ్వని వినిపిస్తోంది. ఇక్కడ మళ్ళీ జానకికి చెమట పట్టేసింది; చీర కొనతో మొహం తుడుచుకుంటోంది; గభీమని ఒళ్ళంతా వొణుకుతోంది . . .

"Yes . . . Sundaram speaking . . . ."

"Mr. Sundaram? . . . This is Janaki . . . "

జానకి చెవులూ, మెడా ఎఱ్ఱబారిపోయాయి. అప్పుడప్పుడు దగ్గుకుంటూ మెల్లగా మాటాడుతోంది.

"మీరు మా ఇంటికి వస్తానని అన్నారే! . . . మరిచిపోయారా? Why don't you join me for tea this evening?"

". . . Now? This evening? . . . "

" తెలియకపోతేనేం? నేను మీకు పరిచయం చేస్తాను . . . నా మదర్, సిస్టర్, బ్రదర్ - మేం ముగ్గురున్నాం . . . I am the last one . . . "

"Not necessary! ఇప్పుడు ఇంట్లో మరెవరూ లేరు . . . నాకు చాలా 'బోర్' కొట్టుతోంది! . . . మీరు వస్తారా?"

"You have my address, don't you? అవాళ మీకు ఇచ్చాను, గుర్తుందా? Number 16 . . . మా ఇల్లు వీధికి లోతట్టుగా ఉంటుంది . . . అవును . . . ఆ playground ఉందే, దానికి ఎదురుగా మా ఇల్లు చూస్తారు! . . . Thanks! తప్పకుండా వస్తారుకదూ?"

జానకి రిసీవరుని పెట్టేసి ఉత్సాహంతో ఇక్కడా అక్కడా తిరుగుతూ హాలుని చక్కబెడుతోంది; మేజామీదున్న పత్రికలని సొగసుగా సర్దుతోంది. అద్దంముందు నిలబడి తొందర తొందరగా అలంకరించుకొని, వేరే చీర మార్చుకొని కుర్చీలో కూర్చొని దాన్ని మెల్లగా నడుపుతోంది.

గభీమని ఏదో గుర్తుచేసుకొని, కుర్చీనుంచి లేచి ఎదుటనున్న గోడలో కనిపించే తాళంచెవిని తీసుకొని హాలులో మళ్ళీ ఇలాగా అలాగా తిరుగుతోంది.

'అయ్యో, నాకు మతి పోయింది! అతన్ని రమ్మని పిలిచేసాను . . . కాని ఇల్లు బయట తాళం వేసి ఉందే? ఇంట్లో ఎవరూ లేరని అతను తిరిగి వెళ్ళిపోతారేమో? కిటికీని తెరచిపెడితే అతను రావడం చూసి, అతనికి తాళంచెవి అందించి లోపలికి రమ్మని చెప్తాను . . . కాని, అతనేమనుకుంటారో? 'మా అమ్మ రోజు ఇలాగే తను బయటకి వెళ్ళినప్పుడు నా భద్రతకోసం తాళం వేసి వెళ్తుంది!' అని చెప్పేయవలసిందే! 'నా మీద నమ్మకం లేకపోవడం వలన అమ్మ అలా చేస్తోంది!' అని అతను అనుకుంటారేమో? బాగుంది! అలాగైతే మరి  అమ్మ నాకెందుకు తాళంచెవి ఇచ్చి వెళ్తుంది? మీరెలాగ లోపలికి రాగలిగారు?' అని తనలోనే తనే అడుక్కుంటూ జానకి కాచుకొనివుంది.

ఇంటి బయట ఒక పాత కారు ఏక ధ్వనితో వచ్చి నిలబడింది; దాని శృంగ నాదం చెవులని పగలగొడుతున్నట్టుంది.

జానకి పరుగెత్తుకొని వచ్చి కిటికీ తెరచింది.

"మిస్టర్ సుందరం, ఇల్లు తాళం వేసివుందని ఆశ్చర్యపడుతున్నారా? Come on . . .  ఇదిగో, తాళంచెవి . . . " అని కిటికీద్వారా దాన్ని  అందించింది.

"Please come in,"  అని మర్యాదగా అతన్ని ఇంట్లోకి ఆహ్వానించింది.

సుందరం నవీన దుస్తులతో - ఘనతతో కనిపిస్తున్నాడు. అతని దుస్తులు - షర్టు, ఇజారులు - ఏకరీతిలో, బూడిద రంగులో, బిగువుగా - అతని దేహాన్ని ఆవరించుకొని ఉన్నాయి. ఆ షర్టులో కనిపించే తెల్ల బొత్తాముల వరుస కళ్ళకి ఇంపుగా ఉంది. కూలింగ్ గ్లాసులని తీసేసి అక్కడున్న ఒక ఊగెడు కుర్చీలలో కూర్చోవాలని అతను ప్రయత్నించినప్పుడు - ఇంత వరకూ అతని దుస్తులూ,

రూపమూ,  మైమరచి చూస్తూ నిలబడివున్న జానకి - "Please . . . Please . . . ఇక్కడ కూర్చోండి . . . " అని వేరే ఒక కుర్చీ అతనికి చూపించింది.

"That's a rocking chair . . . " అని చెయితో చూపిస్తూ ఆమె తటపటాయించుతుంటే "ఇది కూడా rocking chair," అని సుందరం అన్నాడు. అది విని జానరి మొహం ఎర్రబడిపోయింది.

"I am sorry . . . అది మా పెద్ద అన్నయ్య వాడుతారు,  మేం ఎవరూ అందులో కూర్చోం! . . . " అని నకిలీ నవ్వుతో జానకి వివరించగానే సుందరం "నాకూ ఈ tights తో అందులో కూర్చోడం కష్టమే! నేను ఆ కుర్చీలలో ఒకటి ఎంచుకుంటాను!" అని అంటూ డైనింగ్ టేబులుకి దగ్గర ఉన్న కుర్చీలని చూపాడు. జానకి తనే వెళ్ళి ఒక కుర్చీ అతనికి తీసుకొని వచ్చి అందులో కూర్చోమంది.

సుందరం అందులో కూర్చున్నాడు; జానకి తనూ తన కుర్చీలో వచ్చి కూర్చోంది.

ఇంటి ద్వారం తలుపు తెరిచి ఉంది.

జానకి అతన్ని చూసి నవ్వుతోంది; సుందరంకి అది ఇబ్బందిగా ఉంది.

"మీకు తెలుసా నేనెందుకు మిమ్మల్ని రమ్మని పిలిచానో?" అని జానకి అడిగిన ప్రశ్న విని, సుందరం భుజాలు ఎగవేస్తూ,  పెదిమలు బిగించి "నాకు తెలియదు!" అని నవ్వాడు.

"మీరొక ఫోటోగ్రాఫరు, అవునా?"

"అవును."

"మీకు నేను కొన్ని ఫోటోలు చూపించాలి, అందుకే పిలిచాను . . . Wait a minute . . . " అని చెప్పి జానకి లోపలికి వెళ్ళింది.

సుందరం పాంటు జేబునుంచి ఒక సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టె బయటకి తీసి, పరిసరాలు చూస్తూ, ఆ హాలులో ash tray లేదని గమనించాడు. 'ఇక్కడ హాలులో సిగరెట్ కాల్చడమా వద్దా?' అని తెలియక, కలవరపడుతూ, మళ్ళీ  ఆ సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టె తన పాంటు జేబులో దాచుకున్నాడు.

తను కాలేజీ రోజుల్లో వాడిన ఒక పుస్తకంతో, దాని ధూళిని దులుపుకుంటూ తిరిగి వచ్చిన జానకి అందులోనుంచి రెండు ఫోటోలు తీసి, వాటిని చూస్తూ హాలులో నిలబడింది . . .

ఆమె అందులో పూర్తిగా లీనమైపోయిందని గ్రహించిన సుందరం ఆమెతో ఏదైనా మాట్లాడి సంభాషణ సాగించాలనే ఉద్దేశంతో, "మీ అమ్మగారు ఎక్కడికి వెళ్ళారు?" అని, మామూలుగా, అడిగాడు.

అతని ధ్వని విని జానకి తిరిగి చూసింది; ఆమె చూపు ఎవరో అన్యుడి మీద వాలినట్టు, ఇంతకుముందు తనెప్పుడూ అతన్ని చూడనేలేదన్నట్టు ఆమె మొహంలో గాబరా, కాఠిన్యం చోటుచేసుకున్నాయి.

"Did you say something about my mother?" అని ఆమె గభీమని అడగ్గానే సుందరం మొహంలోనూ మార్పు కనిపించింది.

"మరేం లేదు . . . 'మీ అమ్మగారు ఎక్కడకి వెళ్ళారు?' అని అడిగాను . . ."

జానకి కలవరం ఇంకా ఎక్కువైంది.

"Why? . . . ఎందుకు? ఎందుకు మా అమ్మగురించి అడుగుతున్నారు?" అని జానకి తడబడుతూ అడగడం చూసి సుందరం తారుమారైపోయాడు.

"ఉత్తికే . . . Just . . . No particular reason . . . " అని సుందరం ఆయాసపడుతూ ఆమెని ఊరడించాడు, కాని జానకి మొహం బాగా ఎఱ్ఱబారిపోయింది.

" Mr. Sundaram, నాతో ఆటలాడవద్దు! మా ఇంట్లో అన్నయ్య, అక్కయ్య కూడా ఉన్నారు. మరి మీరెందుకు మా అమ్మగురించే అడుగుతున్నారు? ఎందుకు? What's the reason? చెప్పండి, please . . . "

"I am sorry . . . జానకి, వినండి! . . . I didn't mean anything . . . నన్ను నమ్మండి! . . . నేనెప్పుడూ ఇతరుల వ్యవహారాల్లో జొరపడను . . . నేనడిగినది తప్పంటే నన్ను క్షమించండి! . . . నా మనసులో రహస్యంగా ఎటువంటి ఆలోచనా లేదు, అందుకే అడిగాను!" అని తన మనసు కొంచెం గాయం పడిన భావనతో, మౌనంగా సుందరం తల వంచాడు.

జానకి కళ్ళు తడిసిపోయాయి; ఏడుప్పు గొంతుని ఉక్కిరిబిక్కిరి చేసేసింది.

"Sundaram, I am sorry . . . Please . . . నన్ను చూడండి . . . " అని అతన్ని తాకి జానకి తిరిగినప్పుడు ఆమె మొహంలోని ఆవేశపూరితం అతనికి అర్థమైంది.

"Janaki, what's this?" అని నవ్వుతూ పరిస్థితిని సహజంగా మార్చాలని సుందరం పూనుకున్నాడు.

"'మీరు అడిగినది పొరబాటు!' అని నేను అన్నానా, లేదే? మరెందుకు మీరు క్షమాపణ, 'నేను ఇతరుల వ్యవహారాల్లో జొరపడను!' అని ఏమేమో మాటాడుతున్నారు?"

"సరేలేండి . . . మీరు ఆ ఫోటోలగురించి - నాతో మాటాడాలని అన్నారుగా? అవెక్కడ?"

"నేను ఇవ్వను! మీరు మళ్ళీ ఒక సారి - ఇంతకుముందు అడిగినట్టు - అమ్మగురించి అడిగితేనే ఇస్తాను . . . అప్పుడే మీకు నా మీద కోపం లేదని నమ్ముతాను . . . అడగండి . . . ఇప్పుడు అడగండి . . . " అని జానకి బతిమాలుతోంది; సుందరం అడక్కపోతే జానకి మళ్ళీ ఏడవడం ఆరంభిస్తుందనే సూచనలు కనిపించాయి.

'మీ అమ్మగారు ఎక్కడకి వెళ్ళారు?" - ఒక చంటి పాపని ఊరడించినట్టు - దాని తృప్తికోసం అడుగుతున్నట్టు - సుందరం అడిగాడు.

జానకి కూడా చంటిపాపలాగే - సంతోషంతో, తృప్తితో - అతనికి జవాబు చెప్తోంది.

"అమ్మ కోవిలకి వెళ్ళారు. ఆరు గంటలకి వచ్చేస్తారు - సరేనా?"

"అవును, నిజం! అమ్మ కోవిలకే వెళ్ళారు!" అని ఇంకొక సారి జానకి వక్కాణించి చెప్తోంది. ఆమె మొహం శోచనీయంగా ఉంది. తను చెప్పేది సుందరం నమ్మాలని బతిమాలుకుంటోంది.

"దయచేసి ఇవాళ నన్ను మరేం - ఏ ప్రశ్నా అడగవద్దు! నేను ఏం చెప్తున్నానో మాత్రం వినండి! Please! నేను ఒక కారణం వలనే ఈ మనవి చేసుకుంటున్నాను . . . పోనూ, పోనూ మీకన్నీ వివరించి చెప్తాను . . . మీదగ్గఱ నేను ఏదీ దాచను . . . కాని మీరు నన్నేం అడక్కూడదు, సరేనా? . . . చెప్పండి, సరేనా?"

"సరే . . . ఇవాళ మాత్రం ఎందుకు? ఇక మిమ్మల్ని, ఎప్పుడూ, నేను ఏ ప్రశ్నా అడగను, చాలా?"

"చూసారా . . . చూసారా, . . . మీకు నా మీద కోపం వచ్చేసింది! 'మీరు నన్ను ఏమీ అడక్కూడదు!' అని నేను అన్నానా?"

"సరే, అలాగే కానీ . . . ఇవాళ మాత్రం . . . జానకి, మిమ్మల్ని ఒక సంగతి అడిగి తెలుసుకోవాలి . . . "

"సరే, అడగండి . . . "

"నాకెప్పుడూ మీమీద కోపం రాదు, నేను మిమ్మల్ని అపార్థం చేసుకోను! సరేనా?"

"అబ్బా, మీరెంత చలాకీగా మాటాడుతున్నారు! . . . సరే, ఇక ఆ ఫోటోలగురించి మాటాడదామా?"

"Oh, yes!"

"మొదట దీన్ని చూడండి . . . "

"అరేరే, ఇది మన రామనాధన్ కదూ?"

"No more questions!"

"I am sorry . . . 'నేనూ, ఇతనూ First Year Intermediate లో కలిసి చదివాం' అని చెప్పాలనుకున్నాను . . . "

"అది నాకు తెలియదా? నేనూ అక్కడేగా చదివాను? కాని నాది వేరే గ్రూపు. మీరు Intermediate తరువాత చదువు ఆపేసారు. అతను M.A., వరకూ నా కాలేజీలో చదివారు, నా classmate . . . అది పోనీలెండి . . . ఈ ఫోటోగురించి మీ అభిప్రాయం ఏమిటి?"

"'Well taken' అని అంటాను . . . ఒక ఫోటోగ్రాఫరుగా నేనంతే చెప్పగలను!" అని పరిమితంగా సుందరం చెప్పిన మాటలు విని అతన్ని మనసులో మెచ్చుకుంటూ, పెదిమలు కొరుకుతూ, తలూపుతూ, జానకి అతనికి ఇంకొక ఫోటో అందించింది.

సుందరం అదీ చూసి అందులోని యువకుడెవడో తనకి తెలియదు అని చెప్పి రెండు ఫోటోలూ ఆమెకి తిరిగి ఇచ్చేసాడు.

"No comments?" అని జానకి అడిగింది.

“Equally good,” అని సుందరం జవాబు చెప్పాడు.

“Sundaram, you are very clever! Too much clever! Very deep - a cunning man!” అని అంటూ జానకి అతని చెవిని మెలిదిప్పింది.

‘ఇదేంటి, ఈమెకి నా దగ్గర ఇంత చనువూ, ధైర్యం, ఎలా వచ్చాయి?’ అని సుందరం విస్తుబోయాడు; కాని ఒక యువకుడుగా ఆ స్పర్శ అతనికి నచ్చింది.

అతనికి ఎదుట, ఆ గుండ్రపు మేజామీద ఆనుకొని, రెండు చేతులూ ఛాతీమీద పెట్టుకొని, పెదిమలు కొరుకుతూ, జానకి ఒక పెద్ద నిట్టూర్పు వదిలి, జంభంగా నవ్వింది; సుందరమూ నవ్వాడు.

“సుందరం, మీకు బోధపడిందా? మనిద్దరం నటిస్తున్నాం, నాటకమాడుతున్నాం! మాయలమారితనం అంటే ఇదే!” అని జానకి బిగ్గరగా నవ్వుతోంది:

“ఈ ఫోటోలు ఎలా ఉన్నాయని మీ అభిప్రాయం అడగాలని నేను మిమ్మల్ని పిలిచానని నమ్ముతున్నారా? ఇక మన ఆటలు ఆపి అసలు సంగతేమిటో మాటాడుదాం! ఆ రెండు ఫోటోల్లోని యువకుల గురించి మీ అభిప్రాయం ఏమిటి? దయచేసి ఏదీ దాచకుండా మీరు నాకు చెప్పాలి.”

జానకి అనర్గళంగా ఇంగ్లీషులో మాట్లాడడం విని సుందరం ఆహ్లాదించాడు.

“జానకి, మీరు ఎంత చక్కగా ఇంగ్లీషు మాటాడుతున్నారు! మీరు నాతో కలిసి చదివారని నమ్మలేకున్నాను. ఎవరో ఆఫీసరు ముందు నిలబడి వుంటున్న భావన నాకు కలుగుతోంది!” అని పొగడాడు.

“Don’t change the subject! అని వేలూపుతూ జానకి అతన్ని హెచ్చరిక చేసింది.

“నాకు తెలిసినంత వరకూ ఆ రోజుల్లోనే ఈ రామనాధన్ ‘ఒక రోమియో’ అని అందరూ చెప్పుకొనేవారు . . . ”

రామనాధన్ గురించి సుందరం మాటాడుతుంటే జానకి మొహంలో కాఠిన్యం పెరుగుతూ వస్తోంది; కంఠధ్వని మారుతోంది.

“రోమియో? . . . అవును . . . అన్ని కాలేజీలలోనూ రోమియోలాంటి వేషం వేసే యువకులు ఉంటారు . . . ఆఖరికి ఆ రామనాధన్ కధ ఎలాగ అంతమైందో

మీకు తెలుసా? ఒక country brute - ఒక పెకిలి, పడుచు జూలియట్ గా వచ్చి చేరింది! అంతా డబ్బు కోసం! ఆమె అతని బంధువురాలు అని అంటున్నారు! మరి ముందుగా ఎందుకు అతనికి ఆ బుద్ధి రాలేదు? . . . నాకొక పెద్ద ఉత్తరం రాసాడు - ఒక love letter - I will show that to you some time . . . ఎందుకలా చేసాడు? దానికే male prostitution అని పేరు! It's okay . . . "
కోపమూ, ద్వేషమూ, ఏకకాలంలో కలిసివచ్చి దానికి మించి ఆమె నోటినుంచి మాటలు రాలేదు; పెదిమలు మాత్రం కంపించాయి.

ఆమెలో కనిపించే ఆవేశం, కోపంతో ఆమె పలికిన మాటలు విని జానకి, రామనాధన్ మధ్య ఏం జరిగి ఉంటుందని సుందరం ఆలోచించాడు. 'నా ఆలోచన కల్పన కాదేమో?' అని అతనికి భయమూ కలిగింది.

కాని అతని ఆలోచనకి, కల్పనకి, చోటు ఇవ్వకుండా జానకి వివరంగా మనసు విప్పి మాటాడుతోంది:

"మిస్టర్ సుందరం! ఇంతవరకూ నేనెవరితోనూ ఈ సంగతులు మాటాడలేదు. వీటిగరించి సంప్రతించుకోడానికి నాకెవరూ లేరు . . . మా అమ్మగారు మేమందరం తనదగ్గర రోజూవారీ ఎదీ దాచకుండా చెప్తున్నామని అనుకుంటున్నారు . . . ఐతే, నేను చాలా కబుర్లు ఆవిడకి చెప్పకుండా దాచివున్నాను . . . కాని, నేనేం తప్పూ చెయ్యలేదు! Please, సుందరం, నన్ను నమ్మండి! నేనేం పొరబాటూ చెయ్యలేదు. కాని ఇదికూడా మా అమ్మగారు భరించలేరు! అవమానంతో నలిగిపోతారు! అందుకే నేను దాచాను. పాపం, అమ్మకి నేను పెద్ద ద్రోహం చేసేసాను! ఇప్పుడూ ఆవిడ నన్ను చంటిపాపలాగ నమ్ముతున్నారు . . . She's a great soul . . . Mother!" అని మొహంని రెండు చేతులతో కప్పుకొని జానకి వెక్కి వెక్కి ఏడుస్తోంది.

'సరే, ఆమెకి ఏడవాలని ఉంది, ఏడవనీ!' అని సుందరం మరేం అనక ఊరుకున్నాడు. కొంచెం సేపు ఏడ్చిన తరువాత, జానకి కళ్ళు తుడుచుకొని, అతన్ని చూసి నవ్వుతూ చెప్తోంది: "I am sorry . నాకు మా అమ్మే ప్రపంచం, దైవం . . . ఆవిడ మనసు బాధపడకూడదు, అది చాలు . . . నాకు మరేం వద్దు! You must meet her . . . మమ్మల్ని పెంచి, పోషించడానికి అమ్మ ఎంత బాధ

పడిందో తెలుసా? అవన్నీ నేను మీకు వివరంగా చెప్తాను . . . హూం, ఇప్పుడు ఇక్కడ ఉక్కగా ఉంది కదూ? రండి, మనం డాబాకి వెళ్దాం," అని చెప్పి వీధి ద్వారం మూడడానికి వెళ్ళింది. కాని ద్వారం మూసేముందు సుందరంతో "మీరు మొదట మేడమీదకి వెళ్ళండి," అని ఆజ్ఞ ఇచ్చింది. సుందరం మౌనంగా మెట్లు ఎక్కుతున్నాడు. వీధి ద్వారం మూసిన తరువాత జానకి మేడ మెట్లకింద నిలబడి, మర్యాదగా "Shall I bring you a cup of tea?" అని అడిగింది.

"I won't mind."

డైనింగ్ టేబిలు మీదున్న కెట్టిల్ నుంచి రెండు కప్పుల్లో టీ కలిపి, ఒక tray లో పెట్టుకొని, జానకి మేడమీదకి వెళ్ళింది. ఆమె చాలా ఉత్సాహంలో ఉన్నందుకు ఆనవాలుగా ఒక పాటని ఝుంకారం చేస్తూ వెళ్ళింది.

డాబాలో చాలా భాగం నీడలో ఉంది. ఆ ఇంటి ఎదుటనున్న మైదానంలో, అక్కక్కడ, పిల్లలూ, పెద్దలూ, ఆడుకుంటున్నారు. ఒక యువకుల గుంపు volley ball ఆటకి సిద్ధమైయ్యే సూచనలు కనిపించాయి. లావుగా, పుష్టిగా పెరిగిన తొడలతో ఒక యువకుడు - బిగువుగా, ఒక ఎర్ర రంగు లాగు ధరించి - ఒక కంభం మీద ఎక్కి వలని కట్టుతున్న దృశ్యం జానకి కళ్ళు తేరిపాటి చూసాయి.

ఆమె చెయినుంచి tray తీసుకొని సుందరం పక్కనున్న మేజామీద పెట్టాడు. మైదానంలో జరుగుతున్న ముచ్చటలు చూస్తూ జానకి అక్కడున్న కుర్చీలో కూర్చుంది. సుందరం ఆమెకి దగ్గర ఇంకొక కుర్చీలో కూర్చున్నాడు.

ఇద్దరూ మౌనంగా టీ తాగుతున్నారు. ఆ 'రామనాధన్' గురించి ఇంకా మాటాడాలని, అదెలా ముగించాలని జానకి తీవ్రంగా ఆలోచిస్తోంది.

గభీమని ఆమె ఆరంభించింది:

"Yes, I liked him. నేను అతన్ని ప్రేమించాను అని కూడా చెప్తాను. 'ప్రేమ' అంటే మీరెలా అర్థం చేసుకుంటారో నాకు తెలీదు. కాని, నేను, నాకు అర్థమైయే విధంగా అతన్ని ప్రేమించాను. మిస్టర్ సుందరం, ప్రేమ అంటే మీ ఉద్దేశం ఏమిటి? నేను అడుగుతున్నది 'సామాన్య పామరుల దృష్టిలోని ప్రేమ' కాదు; 'బుద్ధిపూర్వకంగా - మీ అవగాహన ఏమిటి?' అని అడుగుతున్నాను. ప్రేమ అంటే మామూలైన అర్థం అందరికీ తెలుసు, నేను దానిగురించి అడగలేదు . . . "

“అలాగా? . . . నాకు దాని సామాన్య అర్థమే తెలుసు . . . ప్రేమంటే . . . ”

“Please! . . . Don’t say anymore! నేను దానిగురించి అడగలేదు! How mischievous! అందరు మగవాళ్ళూ ఒకే లాగ . . . ”

“జానకి, వినండి, I am not joking! నేను సీరియస్ గానే మాటాడుతున్నాను! నాకు ప్రేమ అంటే దాని సామాన్య అర్థమే తెలుసు; మీరు దాన్ని బుద్ధిపూర్వకంగా గ్రహించాలంటున్నారు. ఆ అవగాహన ఏమిటో మీరే వివరించి చెప్పండి, నేను తెలుసుకుంటాను.”

జానకి కొంచెం సేపు ఆలోచిస్తోంది. ఆ తరువాత ఒక ఉపాధ్యాయినిలాగ, ఒక పెద్ద సిద్ధాంతం వివరించే ప్రొఫెసరులాగ, చమత్కారంగా ఒక అబద్ధంని సత్యమని నిరూపించే వకీలులాగ, మాటాడుతోంది: “ప్రేమంటే sex కాదు; ప్రేమ శ్రేష్టమైనది, పవిత్రమైనది. Sex అంటే అసహ్యమైనది, క్రూరమైనది. ఒకరి శరీరం చూసి ప్రేమ కలిగిందంటే, అందరికీ అటువంటి ప్రేమ సాధ్యం, అవునా? ఆ తరువాత ఆ శరీరం, వ్యాధి వలనా, వయసు వలనా, నశించిపోయినట్టు ఆ ప్రేమకూడా ఆఖరికి నాశమైపోతుంది. కొంచెం ఆలోచించి చూస్తే ఎవరూ తమ శరీరంని ప్రేమించరు. అలాంటప్పుడు ఇంకోక శరీరం మీద మనకి కలిగే భావనకి ప్రేమ అనే ఒక పవిత్రమైన గౌరవం ఇవ్వడం పెద్ద పొరబాటు. దానికి పేరు - infatuation - చపలం!

సుందరం తల గోకుకున్నాడు.

ఇంతకుముందే పదిలం చేసిన రికార్డులాగ జానకి సాగుతోంది:

“ఆ రోమియో - రామనాధన్ నన్ను ప్రేమించనేలేదు. వాడికి నా శరీరం మీద చపలం! ఆ భావన ఎలా దాచాడో తెలుసా? యోగ్యుడులాగ నామీద పద్యాలు రాసాడు! అతని ప్రేమ పవిత్రమని నేను రెండు సంవత్సరాలవరకూ నమ్మాను. నన్ను నమ్మించాలనే ఆ వేషం వేసాడు, లేకపోతే నేను నమ్మివుండను. మేమిద్దరం గంటలకొలదీ ఏకాంతంలో మాటాడేవాళం. అవన్నీ తలచుకుంటే నాకిప్పుడు భయంగా ఉంది! మిస్టర్ సుందరం, ఇన్నిరోజులవరకూ దీనిగురించి నేనెవరికీ చెప్పలేదు. ఎందుకో తెలీదు, ఈ సిగ్గుమాలినతనం మీకు మాత్రం చెప్పాలనిపించింది, అందుకే చెప్తున్నాను. ఎందుకో మీ దగ్గర నాకక నమ్మకం, ధైర్యం ! ఇదిగో, నా చెయి - అది ఎంత చల్లగా ఐపోయిందో చూడండి! నా ఒళ్ళంతా

వొణుకుతోంది!" అని అంటూ జానకి అతని రెండు చేతులూ తన చేతుళ్ళతో పట్టుకుంది.

జానకి నాలిక ఎండిపోయింది. మొహాన్ని భయం కప్పుకుంది. తడబడుతూ మాటలాడుతోంది: "నేను వాడితో బీచుకి వెళ్ళాను. అవాళ ఏమేమో మాటాడాడు. 'ఆ మరుదినం కారులో మహాబలిపురం వెళ్దామా?' అని నన్ను అడిగాడు. College Students Excursion Party తో వెళ్తున్నట్టు ఇంటిలో అబద్ధం చెప్పమన్నాడు." ఇది చెప్తున్నప్పుడు ఆమె మొహం చిరచిరలాడింది.

"నేను మా అమ్మదగ్గర అబద్ధం చెప్పాలట! అక్కడ హోటల్లో అన్ని ఏర్పాట్లు చేస్తాడట! 'నీకు మరేం భయం వద్దు, మనం ఇద్దరం ఒక రోజు పెళ్ళి చేసుకుంటాం!' అని అన్నాడు. ఆ తరువాత ఏం చేసాడో తెలుసా? He tried to kiss me! Horrible! నేను అక్కడినుంచి పరుగెత్తాను, బస్ స్టాండు దగ్గర వచ్చిన తరువాత ఆగాను. పరుగెత్తినప్పుడు నా కాలు అడ్డు వస్తుందని చెప్పులని ఇసకమీద పారేసాను. అందరూ చూస్తున్నారు. ఈ shameless fellow నా చెప్పులు మోసుకొని బస్ స్టాండు వరకూ నా వెనుక పరుగెత్తుకొని వస్తున్నాడు. ఆ చెప్పులు నా కాలుముందు పడేసి ఏడుస్తున్నాడు. నేను వాడి పరువు తీసానట! నాకు హృదయం లేదని వాపోయాడు. 'ఇక నీ మోహం చూడను!' అని చెప్పి వెళ్ళిపోయాడు . . . It's all right . . . Who cares? That's the end of the story! అని జానకి చెప్పి ముగించే లోపల ఆమె మొహంలో రకరకాల క్రూర భావనలు కనిపించాయి; వాంతి చేసినట్టు ఆమె మొహం వికారంగా మారింది.

"You know, I like men. అంటే నేను వాళ్ళకి పూర్తిగా లొంగిపోతానని కాదు. ఇదే ఏ మగవాడికి అర్థం కావడం లేదు! It's a pity! ఎందుకో, మీరలాంటి మనిషి కాదని నా మనసు చెప్తోంది. అందువలనే మీతో నేను ఇంత చనువుగా మాటాడుతున్నాను. చెప్పండి, Am I right? Will you misbehave?"

సుందరం ఆమె కళ్ళని సూటిగా చూస్తూ మాటాడాడు:

"మీరింత చెప్పిన తరువాత నాకేం పిచ్చా? నేనటువంటి తప్పు ఎప్పుడూ చెయ్యను! మీరు నన్ను పూర్తిగా నమ్మవచ్చు . . . నిజం చెప్పాలంటే ఇవాళ మీరు నా కళ్ళు తెరిచారు. ఎందుకంటే, మీరు నన్ను ముందు పిలిచినప్పుడు, ఇక్కడికి

రావడానికి ముందు, నేను ప్రేమ అంటే దాని సామాన్య అర్థంని నమ్ముకొని వచ్చాను. కాని దానికి అపూర్వమైన అర్థాలున్నాయని ఇప్పుడే తెలుసుకున్నాను. మీ విశ్వాసంకి నేను అర్హుడని తెలిసి నాకు చాలా సంతోషం. Thank you very much! ఆ రెండో ఫోటోగురించి మీరేం చెప్పలేదే. . . ?"

మైదానంలో volley ball ఆడగాళ్ళు బంతిని బాదుతున్న ధ్వని వినిపిస్తోంది. అలా బాదుతుంటే, ఒక్కొక్క దెబ్బలోనూ జానకికి ఎలాగో ఉంది; గోడదగ్గర నిలబడి ఆమె ఆటని చురుగ్గా చూస్తోంది.

మైదానంలో volley ball ఆట తీవ్రంగా సాగుతోంది. ఇంత సేపూ వేరే కబుర్లు, ఆలోచనల్లో లీనమైపోయిన జానకి గమనం ఆ కొన్ని క్షణాల్లో పూర్తిగా మారిపోయింది. సుందరం అడిగిన ప్రశ్న ఆమె మనసులో పదిలమవలేదు. ఆ రెండవ ఫోటో గురించి అతను అడిగినది మాత్రం చెవిలో వినబడింది, కాని అది మనసులో నిలకడగా చోటుచేసుకోలేదు. "దాని కథ కూడా అలాగే ముగిసింది! అది ఇంకో రకం! ఆ ఫోటోల్లో కనిపించే ఇద్దరూ మగవాళ్ళు మాత్రమే కాదు, ఈ ప్రపంచలోని అందరు మగాళ్ళూ అలాంటివారే!" అని అంటూంటే ఆమె దేహమంతా పట్టు పురుగులు మేస్తున్నట్టూ, నరాలన్నీ ఉత్సాహంతో తన్మయత్వంలో పడిపోయినట్టనిపించింది. ఆ ఆటలో బంతికి తగిలే ప్రతీ దెబ్బా తన్ను బాదుతున్నట్టు, దేహమంతా వొణుకుతూ జానకి ఆ ఆటని చూస్తూనే నిలబడి ఉంది.

మలుపు తిరిగిన బలమైన చేతులతో ఆడుతున్న రెండు పక్షములవారు మారి మారి ఆ బంతిని బాదుతుంటే తన దేహమే చీలిపోయినట్టు, బద్దలైనట్టు జానకి అదిరిపడింది. పక్కనే నిలబడివున్న సుందరం చెయిని పట్టుకొని, పళ్ళు కొరుకుతూ అరిచింది

"Sundaram, please help me . . . I can't stand it anymore!" అని మకమకలాడుతూ, గోడమాద ఆనుకొని,  కిందకి వెళ్ళడానికి జానకి ప్రయత్నం చేస్తోంది.

"ఇదేంటి? ఏమైంది మీకు?" అని సుందరం నివ్వెఱపడిపోయాడు.

“Please . . . ‘మరేం అడక్కండి!’ అని నేను మీకు చెప్పాను . . . రండి, మనం కిందకి వెళ్దాం! Help me! . . . నేను మీకన్నీ చెప్తాను!” అని అంటూ తడబడుతున్న జానకి చెయిని అందుకొని సుందరం మెల్లగా మెట్లు దిగి వచ్చాడు.

హాలుకి రాగానే జానకి తన ఊగెడు కుర్చీమీద వాలింది. ఆమె దేహాన్ని – మెడ, కాళ్ళు, చేతుల్ని - చెమట కప్పేసింది. Electric fan అడుగున కూర్చొని, చెమట పట్టిన చీర కొనతో జానకి మొహం తుడుచుకుంటోంది.

ఆమె భావనలు అదుపులోకి వచ్చాయని గ్రహించిన తరువాత సుందరం అడిగాడు: “What happened? మీరెందుకు ఇలాగ గభీమని . . . ?”

“అది అలాగే . . . ఆ రోజు ఇలాగే ఒక కల . . . ఇరవై మంది – రాక్షసుల్లాగ ఉన్నారు, volleyball ఆడుతున్నారు . . . కాని ball లేదు! . . . దానికి బదులు నన్నే రెండు పక్కలా మారి మారి ఆకాశంలో విసురుతూ ఆడుతున్నారు! అబ్బా, ఎంత ఘోరం! What a horrible dream!” అని వణకింది.

కొంచెం సమయం కళ్ళు మూసుకొని కుర్చీలో అలాగే ఉన్న జానకి కళ్ళు తెరిచి ఒక అన్యుడిని చూస్తున్నట్టు సుందరంని, ఆ పరిసరాలని చూస్తోంది.

“అమ్మా!” అని హీనంగా గొణుకుతూ జానకి కుర్చీనుంచి లేచింది.

“అమ్మగారు కోవిలకి వెళ్ళారు . . . త్వరలో వచ్చేస్తారు.”

“అయ్యో, అందుకే చెప్తున్నాను! Please, get out! Don’t mistake me . . . నేను మీ సహాయం మరిచిపోను . . . మా అమ్మ ఇంట్లో ఉన్నప్పుడు ఒక రోజు మీరు రావాలి! తరచూ రావాలి! దయచేసి ఇప్పుడు వెళ్ళండి! Please . . .” అని సుందరంని బతిమాలుతూ, జానకి వీధి ద్వారం వరకూ అతన్ని తోసుకొని వచ్చేసింది. అతను బయటకి వెళ్ళగానే ద్వారం మూసేసి, తొందరగా కిటికీ తలుపు తెరిచింది.

“మిస్టర్ సుందరం, ఒక నిమిషం ఆగండి!” అని అతన్ని పిలిచి, అతనికి, తాళం, తాళంచెవి అందించి, “Please lock the door and return the key to me!” అని అంటోంది.

సుందరం తాళం వేసాడు. తాళంచెవిని తీసుకొని కిటికీద్వారా చెయిని చాటి జానకి అతనికి వీడ్కోలు చెప్పింది.

ఆ పాత కారు వెళ్ళిన తరువాత జానకి మళ్ళీ తన ఊగేడు కుర్చీలో వచ్చి కూర్చొని ఉంది.

ఊగేడు కుర్చీ ఆడుతోంది.

## రంగం – 2

సుందరం వచ్చి వెళ్ళిన మూడు గంటల తరువాత . . .

చెల్లం తన మేజా పక్కన కూర్చొని చురుకుగా స్వెటర్ అల్లుతోంది; ఆమె కూర్చున్న ఊగేడు కుర్చీ మెల్లగా ఆడుతోంది.

ఆడలరశన్ లోపలనుంచి వచ్చి కుర్చీలో కూర్చున్నారు. అతను తొడుక్కున్న బనియన్ని ఒక టర్కిష్ తువ్వాలు పూర్తిగా కప్పుకొనివుంది. అతని నుదుటమీద దట్టంగా కనిపించే విభూతి చెవులని దాటి తల జుత్తుకి రెండు పక్కలా బాగా వ్యాపించివుంది.

అలంకారవల్లి ఒక కుర్చీలో కూర్చొని ఏదో పత్రిక చదువుతోంది.

జానకి హాలు మూల ఒక చిన్న మేజా దగ్గర నిలబడి ఉతికిన బట్టలని ఇస్త్రీ చేస్తోంది; మేజాపై ఒక పక్కన ఇస్త్రీ చేసిన చీరలు, రవికలు, మడతబెట్టివున్నాయి.

జానకి నుదుటమీద అలంకారవల్లి పూసిన కోవిల కుంకుమం కొంచెం అతీతంగానే కనిపిస్తోంది.

జానకి తనలో మగ్నమైపోయినట్టు – ఏదో ఆలోచనలో పడిపోయి - తన పని చూసుకుంటోంది; తరచుగా పెదిమలు కొరుకుతోంది; భావనలని మింగుతోంది. ఇక కొన్ని నిమిషాలలో ఏడుస్తుందేమో అనే సూచనలు కూడా కనిపిస్తున్నాయి. ఈ వ్యాకులత గమనించని అలంకారవల్లి కొడుకుని అడుగుతోంది:

“ఒరేయ్ చిన్నవాడూ, ఇవాళ మధ్యాహ్నం భోజనం చేసావా? పెరుగన్నం, ఊరగాయ మాత్రం పెట్టాను. సరే, ఇవాళ మీ కాలేజీలో ఏమిటి విశేషం?”

“మరేం లేదు. మామూలుగా మా కాలేజీలో ఎది జరిగినా నేను పట్టించుకోను. ఇప్పుడెల్లా నా కళ్ళకి ఏదీ అనుచితంగా కనిపించదు. కాని ఇవాళ మా College

Principal గదిలో ఒక ఘటన జరిగింది. దానిగురించి మీకెలా వర్ణించి చెప్పడం అని నేను ఆలోచిస్తున్నాను."[2]

అలంకారవల్లి ఆసక్తితో ఆ కథ వినాలని ఆతురతతో అతన్ని చూస్తోంది.

జానకి – ఇస్త్రీ పెట్టె ప్లగ్గుని తీసి మేజామీద పెడుతూ – తనూ ఆ కబురు వినాలని తొందరపడుతోంది.

"అమ్మా, ఈ శుద్ధ తమిళం చాలు అని చిన్న అన్నయ్యకి చెప్పండి. అప్పుడే అతను చెప్పేది వినడానికి బాగుంటుంది," అని అంటూ ఇస్త్రీ చేసిన దుస్తులని పోగు చేసుకొని "అన్నయ్యా, . . ప్లీజ్!" అని జానకి వేడుకుంది.

"అవును, నిజం," అని జానకిని ఆమోదిస్తూ అలంకారవల్లి కొడుక్కి చెప్తోంది: "చిన్నవాడూ, కొంచెం సేపే ఆ తమిళం వినడానికి బాగుంటుంది; అసలు చెప్పడానికి ఏమీ లేదనుకో, దాన్ని వింటూనే ఉండాలనిపిస్తుంది. అలాంటి రోజులు ఒకప్పుడు ఉండేవి – మీ తాతగారు అలాగే మాటాడేవారు . . . అతనికున్న ప్రజ్ఞ, పాండిత్యం ఎలా వర్ణించడం? ఆ రోజుల్లో ఆ భాషకి ఘనత, మర్యాద ఉండేది . . . మరి, ఇప్పుడో? అన్నీ పాడవుతున్నట్టు మన తమిళ బాషకూడా అధ్వాన్నంలో పడిపోయింది . . . సరేలే, మీ కాలేజీలో ఏం జరిగింది. చెప్పు!"

"చిన్న అన్నయ్యా, కొంచెం ఆగు. నేనూ వస్తాను!" అని జానకి పిలుపుకూడా వినిపించింది. తొందర తొందరగా ఆ ఇస్త్రీ పెట్టెమీద తన బొటనవేలుని నొక్కుకుంది. ఆ వేడిని భరించుకుంటూ, పళ్ళు కొరుకుతూ ఆమె మొహం నిమిషంలో మారింది. "అమ్మోయ్!" అని గోల పెడుతూ గెంతుతోంది.

"అమ్మా, జానకీ, నీకేమైంది?" అని అలంకారవల్లి పరుగెత్తుకొని వస్తోంది. ఆడలరశన్ ఒక దూకు దూకి చెల్లెలు చెయి పట్టుకున్నారు. కొంచెం సేపు భ్రమతో అక్కడ కూర్చున్న చెల్లం వీళ్ళ మొహాలు చూసి, తనూ కలవరపడి, "ఏమే జానకి, నువ్వు ఇస్త్రీ పెట్టె వాడినప్పుడు అజాగ్రత్తగా ఉంటే ఎలాగ? . . . అమ్మా, అక్కయ్యకి మరేం అపాయం లేదుకదా?" అని తల్లిని అడిగింది.

---

[2] ఇక్కడ ఆడలరశన్ శుద్ధ తమిళంలో మాటాడుతున్నారు. అతని పేరుకి శుద్ధ తమిళంలో అర్ధం, 'నాట్యమాడే రాజు' - నట రాజు - పరమ శివుడు. తక్కిన వివరాలకి అనుబంధం చూడండి.

జానకి పసిపాపలాగ చెయిని చూసుకుంటూ ఏడుస్తూనేవుంది. చెల్లం తల్లితో "అమ్మా, జానకికి ఏమైనా ointment వేస్తారా?" అని అడిగింది. అలంకారవల్లి "ఊరుకోవే! ointment ఏం గొప్ప? నాకన్నీ తెలుసు!" అని చిరచిరలాడుతూ, 'మురుగా!', 'మురుగా!' అని దేవుడి పేరు వల్లించుతూ, పళ్ళెంనుంచి విభూతి తీసి జానకి చెయికి పూసింది. "ఇదే అన్నిమందులకంటే శ్రేష్ఠమైనది, కొంచెం సమయంలో నీ బాధ తీరుతుంది!" అని ధైర్యమిచ్చి, "సరే కాని, నువ్వెందుకు ఈ పనులన్నీ చెయ్యాలి? ఆ పనిమనిషి ఎక్కడ? దాన్ని పిలు!" అని జానకి చెయిని ఊదుతూ, తల జుత్తుని లాలించుతూ, కుర్చీలో కూర్చోబెట్టింది. జానకి వెక్కి, వెక్కి ఏడుస్తూ, ఆఖరికి ఊరుకుంది.

"సరే, ఇక మీ principal office లో ఏమైందో చెప్పు, విందాం!" అని అలంకారవల్లి ఆడలరశన్ని అడగ్గానే, జానకి తల్లితో కలుసుకొని, "అవును, చిన్నన్నయ్యా, నాకూ అది వినాలని ఉంది. ఆ తొందరలోనే ఇస్త్రీ పెట్టెని ముట్టుకొని చెయి కాల్చుకున్నాను!" అని చెప్పింది.

"వొద్దు! ఆ principal కథ ఇవాళ వొద్దు!" అని చెల్లం అరిచింది.

చెల్లం మాట విని ఏమైందని ఆ ముగ్గురూ ఆశ్చర్యపడుతుంటే చెల్లం దానికి కారణం చెప్పింది:

"చిన్నన్నయ్య చెప్పదలచుకున్నదేదో అంత మంచి కబురు కాదేమో? అందువలనే మనం దాని గురించి మాట్లాడే సమయంలో జానకి తన వేలు కాల్చుకుంది కాబోలు! మంచి వేళ, దేవుడు మనకి హెచ్చరిక చేసాడు! ఇదే మనకి శిక్షేమో! అందుకే నేనంటున్నాను . . . నాకలా అనిపించింది . . . అమ్మా, మీరేమంటున్నారు?"

అలంకారవల్లి కొంచెం ఆగి ఆలోచించింది. తర్వాత ఒక చిరునవ్వు నవ్వి, చెల్లంకి చెప్పింది.

"నీకనిపించింది సరే! . . . చిన్నవాడూ, ఇవాళ మీ principal వ్యవహారం మనకి వద్దు! అంటే - ఇవాళ వద్దు - అంటున్నాను. శకునం బాగా లేదు. ఇంకో రోజు చెప్పు, విందాం . . . తల అని ఉన్నంతవరకూ తలనొప్పి రాకుండా ఉంటుందా? అందువలన తలనోప్పి కావాలని మనం వేడుకుంటామా? లోక జ్ఞానం

కావాలంటే మనం అన్నిరకాల మనుషులతో కలుసుకోవాలి, వాళ్ళ జిత్తులనుంచి తప్పించుకోవాలి. చెల్లం, మీ స్కూల్లోనూ వినడానికి సరసమైన కథలు ఉన్నాయికదూ? మీ crafts teacher గురించి చెప్పు, విందాం!," అని ప్రేరేపించింది.

"అవును, ఒకటా, రెండా? వందలకొలదీ కథలున్నాయి. కాని నాకు పొత్తు లేదంటే నేను చూసి చూడనట్టు ఊరుకుంటాను, చెవులు మూసుకుంటాను! ఐతే కొన్ని కర్మకాండలు మన కళ్ళముందు జరుగుతుంటే నేను కళ్ళు మూసుకుంటే పాఠం చెప్పడం ఎలాగ? ఇవాళ నాకు వచ్చిన చెప్పలేని కోపంలో ఆ దున్నపోతు రుక్మిణిని స్కూలునుంచి వెళ్ళగొట్టాలనుకున్నాను . . . కాని ఎవరైనా నేనెందుకలా చేసానని అడిగితే, నేనేకదా నా నోటితో దాన్ని వివరించి చెప్పాలి? అందుకే "Get out of my class!" అని అరిచాను. క్లాసంతా హడలిపోయింది!"

"ఎందుకు?" అసలు ఏమైంది?"

"ఎందుకు?" అసలు ఏమైంది?"

"హూం, నేను చెప్పను! . . . ఛీ, నాకు మోమాటంగా ఉంది! . . . " అని అంటూంటే చెల్లం దేహమంతా వణుకుతోంది. ఆమె చెప్పడానికి వెనకాడుతుందనే కారణం వలనే వీళ్ళకి ఆతురత ఇంకా తీవ్రంగా పెరుగుతోంది.

"చిన్న అన్నయ్యా . . . మీరు కొంచెం అవతలకి వెళ్ళండి . . . " అని చెల్లం వేడుకుంది.

"ఏం, ఎందుకు? అమ్మా, చూసారా? నన్నొక అన్యుడుగా చేసి . . . "

"అదేదో ఆడవాళ్ళ కబురైవుంటుంది, నీకెందుకు చెప్పాలి?" అంది అలంకారవల్లి.

"చూసారా, మీరు కూడా నన్నిలా వేరు చేసారంటే - దానికి నేను ఇంకా చులకనగా కనిపిస్తాను. నేను అవాళ మా principal office లోని ఘటన గురించి మాటాడినప్పుడు - అది మగాళ్ళ గురించేకదా? - మీరెంత ఆతురగా 'చెప్పు!', 'చెప్పు!' అని గెంతారు? నేనెక్కడికీ వెళ్ళను, ఇక్కడే ఉంటాను!" అని అంటూ ఆడలరశన్ ఒక పత్రికని తీసుకొని తన మొహం దాచుకున్నారు.

'నేను నీకు తర్వాత చెప్తానులే! - అమ్మా!' అని చెల్లం కనుసైగ చేసింది.

జానకి తను చేసిన తప్పు ఒప్పుకొనే సమయం వచ్చేసిందని భయంతో అందరి మొహాలు చూస్తోంది.

సుందరంని పిలిచి తను మాటాడినది, అతను ఇంటికి వచ్చిన ఘటన - ఇవన్నీ తను దాచడం - ఒక పెద్ద పొరబాటు అని జానకి బాధపడుతోంది. అందువలనే ఆమె మొహం, నుదుటని చెమట కప్పేసింది; కళ్ళలో కలవరం; పెదిమలు వొణుకుతున్నాయి . . .

"అమ్మా!," "అమ్మా!" అని గద్గద స్వరంతో జానకి తల్లిని పిలిచింది.

"ఏమిటే? . . . చెయి ఇంకా మండుతోందా? నూనె రుద్దమంటావా?"

"హూం, అది కాదమ్మా! నేనొకటి చెప్తాను, మీరు అపార్థం చేసుకోరుగా? నేనేం తప్పు చెయ్యను! తెలిసి తప్పు చెయ్యను!" అని జానకి మళ్ళీ, మళ్ళీ అంటూంటే అలంకారవల్లి - కూతుర్ని - కౌగిలించుకుంటోంది.

"నా ముద్దుబిడ్డ! జానకి, నువ్వు తప్పేం చెయ్యవు! నాకు నీగురించి తెలియదా? ఎదైనా సరే, చెప్పు! నువ్వు చేస్తే అది పొరబాటు కాదు! . . . "

"అమ్మా, అవాళ నేను చెప్పలేదూ? సుందరం అని పేరు, నాతో కాలేజీలో చదివారు. చాలా మంచివారమ్మా, మీరు చూస్తే మెచ్చుకుంటారు. గుణంలో మన పెద్ద అన్నయ్యలాగ . . . సాయంకాలం అతను మన ఇంటికి వచ్చారమ్మా! . . . " అని చెప్పి, ఒక చిరునవ్వు నవ్వి, జానకి అందరి మొహాలూ చూసింది. 'మీరు నా గురించి పొరబాటు పడకూడదు!' అనే భావనలో చూస్తున్న ఆమె ఆడలరశన్ ముఖంలో కానవచ్చిన కాఠిన్యం చూడగానే, భయరడి, మొహం మార్చుకొని, తల్లిని చూసి ఏడ్చింది.

"అమ్మా, చూసారా? చిన్నన్నయ్య నన్నెలా చూస్తున్నారో?"

"ఒరేయ్, చిన్నవాడూ! ఊరుకో, దాన్ని బెదిరించకు!l జానకి, నువ్వు చెప్పమ్మా! అతను . . . ."

" . . . వచ్చారు . . . వెంటనే వెళ్ళిపోయారు! 'అయ్యో, ఎవరూ లేని సమయంలో వచ్చేసాను! మీ అమ్మగారిని, అన్నయ్యని పరిచయం చేసుకోవాలని వచ్చాను. . . సరే, ఇంకొకసారి వస్తాను!' అని అంటూ వెళ్ళిపోయారు . . . అమ్మా, ఇందులో నేనేం పొరబాటు చేసాను?"

"ఛీ, ఛీ, నువ్వేం పొరబాటూ చెయ్యలేదు! . . . అది సరే, అతనికి మన ఇల్లు ఎలా తెలుసు?

"అదా? . . . అతను మా ఆఫీసు పార్టీకి వచ్చినప్పుడు, నేనే అతనికి - 'మన పాత college mate కదా?' అని మన అడ్రసు ఇచ్చాను . . . "

"ఇవాళ నువ్వు ఇంటిలో ఉంటావని అతనికి ఎలా తెలుసు?" ఆడలరశన్ లాగ కాకుండా అలంకారవల్లి నిమ్మళంగా తన్ను విచారణ చేస్తోందని గ్రహించకపోయినా జానకి తనెలా జవాబు చెప్పాలని తెలియక కలవపడుతోంది.

"అతను మా ఆఫీసుకి ఫోను చేసి ఉంటారు . . . నేను శెలవులో ఉన్నానని చెప్పివుంటారు . . . ఏదో పనిమీద అతను ఈ పరిసరాలకి వచ్చారట . . . ఇవన్నీ నాకెలా తెలుసు? మనకోసం మన ఇంటికి వచ్చిన వాళ్ళని 'రండి!' అని పిలవకుండా ఉండగలమా? నేనే అతనికి తాళంచెవిని కిటికీద్వారా అందించి తలుపు తెరవమన్నాను . . . నాకు మరేం తోచలేదు . . . మేం మరేం మాటాడలేదు . . . ఏముంది, మాటడానికి? అతనూ వెంటనే వెళ్ళిపోయారు, ఏమీ అడగలేదు . . . నేనూ ఏమీ చెప్పలేదు . . . ఇందులో తప్పేముంది?"

"నువ్వు చేసినది తప్పే!" అని నిష్ఠురమైన ధ్వనిలో ఆడలరశన్ అరిచారు:

"ఇంట్లో మనం ఎవరూ లేనప్పుడు, తాళంచేవి అందించి అతన్ని లోపలికి రమ్మని పిలవడం తప్పే! కిటికీ ద్వారా చూస్తూ అతనికి 'మరొక సమయం రండి!' అని చెప్పివుంటే సరిపోను. అతనికెందుకు మనం ప్రత్యేక మర్యాద చూపాలి? నువ్వు చేసినది తప్పే!"

"అమ్మా, అమ్మా, చూసారా? మీరే చెప్పండి, నేను తప్పు చేసానా అని? అలాగైతే మీరే నన్ను మీ చేతులతో చంపేయండి! నా మనసుకి తెలుసు, నేను తప్పు చెయ్యలేదు!" అని కన్నీరు కార్చుతూ జానకి తల్లిని బతిమాలుతోంది.

"జానకి, వాడి మాటల్లోనూ న్యాయం ఉందమ్మా . . . నేనూ, వాడూ నిన్ను తప్పుబెట్టం, కాని ఈ లోకముందే, అది చాలా క్రూరమైనది . . . నీకు ఆ లోకం గురించి ఏమీ తెలియదు, అందుకే వాడంటున్నాడు . . . "

ఆడలరశన్ గభీమని ఏదో ఆలోచించి, లేచి, తొందర తొందరగా మేడమీదకి వెళ్ళారు.

"అమ్మా, ఈ సుందరం మంచివారు . . . అతనికి ఆ రామనాధన్ గురించి కూడా తెలుసు; నాకు రామనాధన్ తో friendship ఉండేదని కూడా తెలుసు. అతను దాని గురించి నన్ను అడిగారు. నేను వెంటనే 'అవేం మాటాడవద్దు! నేనవన్నీ మరిచిపోయాను, మా అమ్మకి అవన్నీ తెలియనే తెలియవు!' అని ధైర్యంగా చెప్పేసాను. అదేకదా నిజం? నేను రామనాధన్ తో సహజంగా మెలిగాను, కాని అతను దాన్ని అపార్ధం చేసుకున్నాడు! 'మనకి అదేం పెద్ద ప్రశ్నకాదు!' అని ఇతనికి తెలియవద్దూ? అందుకే అలాగన్నాను . . . అదేం తప్పా, అమ్మా?"

"అమ్మా!. . . అమ్మా! . . . " అని కేకలు పెడుతూ, చేతుల్లో cups, saucers మోసుకుంటూ, ఏదో రహస్యంని బహిరంగపరచే ధోరణిలో ఆడలరశన్ కనిపించారు. మొహంలో ద్వేషం, కళ్ళలో కోపం రేగుతుంటే -

" . . . అతను వచ్చారు, వెంటనే వెళ్ళిపోయారు, అవునా?" అని పళ్ళు కొరుకుతూ, ఇగిలుంచుతూ, జానకిని రెచ్చగొట్టారు.

"చెప్పండమ్మా, నేను తప్పు చేసానా?" అని మళ్ళీ, మళ్ళీ, జానకిలాగే నటిస్తూ, తల్లి మొహం ముందు అతను ఆ cups, saucers చూపుతున్నారు.

"మరేం కాదమ్మా, ఇది టీ! ఇక్కడ టీ పార్టీ జరిగింది - మన roof garden లో! అందుకే మన ఆఫీసరమ్మగారు ఇవాళ శెలవు తీసుకొని ఇంట్లో ఉన్నారు! నేనెందుకు మేడమీదకి వెళ్ళానో తెలుసా? ఆ దొంగ ఇంకా అక్కడ ఉన్నాడేమో అని చూడడానికే! నా అనుమానం పోలేదు! వాడీ ఇంటిలో ఎక్కడో ఉన్నాడు! నేను వెళ్ళి bed room లో చూస్తాను!" అని అంటూ ఆ cups, saucers మేజా మీద పెట్టి ఆడలరశన్ bed room కి పరుగెత్తారు.

ఇంత సేపూ ఓర్పు, భయం, అపరాధ భావంతో నిలబడివున్న జానకి మండి పడింది. "Damn fellow . . . Bastard!" అని పళ్ళు కొరుకుతూ, ఆ cups, saucers లో ఒకటి తీసి అతని మీద రువ్వింది.

అది నేలమీద పడి, ముక్కలైన సద్దు విని ఆడలరశన్, భయపడి, తల్లి పక్కన వచ్చి నిలబడ్డారు.

"అమ్మా, చూసారా, అది నన్నెలా అమర్యాదగా తిట్టుతుందో?"

"ఒరేయ్, నీకు మర్యాద కావాలా? జాగ్రత్త! ఈ బెదిరింపులు నా దగ్గర ఉడకవు, జ్ఞాపకం ఉంచుకో! అవన్నీ దాని దగ్గఱ . . ." అని జానకి చెల్లంని చూపిస్తోంది.

"నేనేం చేసానే? నన్నెందుకు మీ జగడంలో లాగుతున్నారు?" అని చెల్లం, దీనంగా, కలవరపడుతూ అడుగుతోంది.

"ఎందుకా? నిన్ను లాగాలంటే . . ."

"జానకి . . . నోరు పారేసుకోవద్దు!" అని అలంకారవల్లి మందలించుతోంది.

"మీరెవరికీ నా మీద నమ్మకం లేదు! అందరూ దూషిస్తున్నారు! కాని నేను మాత్రం మీరందరికి మర్యాద చూపిస్తున్నాను!" అని జానకి వెక్కి, వెక్కి, ఏడుస్తోంది.

"చిన్నవాడూ, నీకిప్పుడు మజాగా ఉందా? నువ్వు దాన్ని అనుమానించడం మంచిది కాదు. జానకి మనింటి అమ్మాయి . . . నువ్వే దాన్ని ఇలాగ చులకన చేస్తే తక్కినవాళ్ళకి ఎలాగుంటుంది, చెప్పు . . . నాకు నా కూతురు గురించి తెలుసు . . . జానకీ, నవ్వెందుకు ఏడుస్తున్నావ్? వాడు నీ మంచికే చెప్తున్నాడు . . . నేనూ నిన్ను అపార్థం చేసుకోను! . . . మనమందరం హాయిగా, నిమ్మళంగా ఉంటున్నాం, కాని ఎవడో వచ్చి దాన్ని పాడు చేస్తున్నాడే! నేను నెమ్మదిగా ఉంటే దేవుడు సహించలేడేమో? అంతా నేను బతికివున్నంతవరకే కదా? నేను పోతే, మరేం బాధా ఉండదు! దేవుడా, త్వరలో నన్ను నీ దగ్గరకి చేర్చుకో . . . !"

"అమ్మా, మీరెందుకు ఇలా బాధ పడుతున్నారు?" అని అంటూ ఒక పక్క జానకీ, "దయచేసి మీరలాగ మాటాడవద్దు!" అని ఇంకొక పక్క చెల్లం వచ్చి, తల్లిని కౌగిలించుకుంటున్నారు. ఆడలరశన్ మోహాన్ని రెండు చేతులతో కప్పుకొని మౌనంగా తన కుర్చీలో ఉన్నారు.

అలంకారవల్లి చీర కొనతో మొహం తుడుచుకుంటూ మాటాడుతోంది: "నా కడుపులో పుట్టిన పిల్లలు ఏ తప్పూ చెయ్యరనే నమ్మకం నాకుంది. జానకి చెప్తున్నట్టు ఆ సుందరం మంచివాడేమో? ఎవరి అబ్బాయో? వాడిని చూడకుండా మనమెందుకు అపార్థం చేసుకోవాలి? అందరు యువకులూ ఆ గాడిద రామనాధన్ లాంటివారు కాదు. సుందరం మళ్ళీ వస్తానని చెప్పాడుకదా, అప్పుడు అతని గురించి మరి కొన్ని వివరాలు తెలుసుకుందాం . . . రేపు మనందరం ఇంట్లో

ఉంటాం, వాడ్ని రమ్మని జానకి చెప్పవచ్చుగా? ఒరేయ్, చిన్నవాడూ, ఏమంటావ్?''

''అమ్మా, మీరంటే, సరే!''

''అతను ఎలాంటి మనిషని తెలుసుకుందాం!'' అని జానకికి తెలియని విధంగా అలంకారవల్లి కొడుక్కి కనుసైగ చేస్తోంది.

''సరే, అమ్మా! రేపే అతన్ని రమ్మంటాను. అతను ఫోను నంబరు కూడా నాకు ఇచ్చారు. రేపు సాయంకాలం, ఐదు గంటలకా? చిన్నన్నయ్యా, మీరు కాలేజీనుంచి కొంచెం ముందు వచ్చేయండి . . . చెల్లం, నువ్వు కూడా . . . '' అని సంతోషంగా చెప్పి జానకి తన కుర్చీమీద కూర్చొని ఊగుతోంది.

నలుగురూ తమ తమ ఊగెడు కుర్చీలలో కూర్చొని తమ తమ ఆలోచనలలో లీనమైపోయారు; ఆ కుర్చీలుకూడ వేరే వేరే శైలిలో ఊగసాగాయి.

## రంగం – 3

"అమ్మా . . . చిన్న అన్నయ్యా . . . చెల్లం అక్కయ్యా . . . అతను వస్తున్నారు! మిస్టర్ సుందరం చెప్పినట్టే సమయంకి వచ్చేసారు!"

"ఎందుకే గెంతులేస్తున్నావ్? అతనొస్తే సిగ్గూ, బిడీయం పూర్తిగా వదులుకోవాలా ఏమిటి? మరేం అనక ముందు ఒక మూల కూర్చో! అన్య పురుషులు మన ఇంటికి వస్తున్నారని జ్ఞాపకం ఉండనీ!" అని అంటూ చెల్లం ఊపుతున్న కుర్చీని అలంకారవల్లి ఆపింది. "అతను వచ్చి కుర్చీలో కూర్చున్నంతవరకూ మనం ఎవరూ ఊగకూడదు. అది తప్పు, అమర్యాద. . . . వినండి, నేనే వాడితో మాటాడతాను. మీరు అన్నీ వింటూ ఉండండి. అంటే మీరందరూ నోరు మూసుకొని కూర్చోవాలని కాదు. వాడు ఏమైనా అడిగితే మామూలుగా జవాబు చెప్పండి. ఇప్పుడు మనం వాడిని విందుకి పిలవలేదు. వాడు ఎటువంటి మనిషి అని తెలుసుకోడానికే రమ్మని పిలిచాం. ఐతే వాడు మనల్ని అంచనా వేయడానికి మనం అవకాశం ఇవ్వకూడదు!" అని అలంకారవల్లి చెప్తూంటే సుందరం కారునుంచి దిగి ఇంట్లోకి ప్రవేశించాడు.

ఆడలరశన్, చెల్లం, నాటకంలో పాల్గొనే పాత్రల్లాగ తమ తమ కుర్చీలనుంచి లేచి నిలబడి, నకిలీ నవ్వుతో అతన్ని చూడసాగారు.

వాళ్ళందరూ ఏదో పనిమీద బయటకి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నట్టు కనిపించడం వలన, సుందరం రాగానే మర్యాదగా అడిగాడు: "మీరు చాలా సేపుగా నా కోసం కాచుకొని ఉన్నారా? Am I late?"

"No, no . . . మీరు టైముకి వచ్చారు! . . . Meet my mother, అమ్మా, ఇతనే సుందరం - నాతో కాలేజీలో చదివారు, ఇప్పుడు ఇతనొక పేరు మోసిన ఫోటోగ్రాఫరు! Please come in," అని జానకి అతనికి స్వాగతం చెప్పింది.

"రా, నాయనా, రా . . . వీడు నా రెండో అబ్బాయి ఆడలరశన్ – కాలేజీలో లెక్చరర్ గా పని చేస్తున్నాడు. ఇది మా పెద్దమ్మాయి, హైస్కూల్లో Head Mistress గా ఉంది. రా, కూర్చో . . . " అని అలంకారవల్లి అక్కడున్న ఊగెడు కుర్చీలలో ఒకటి – నిన్న సుందరం కూర్చోవాలని ప్రయత్నించినప్పుడు జానకి ఆక్షేపించిన అదే కుర్చీని - సుందరంకి చూపిస్తోంది.

సుందరం మనసుని ఒక విధమైన భయం కప్పుకుంది, కొంచెం వెనకాడాడు.

ఇంతలో జానకి లోపలికి వెళ్ళి కాళ్ళున్న ఒక కుర్చీతో వచ్చింది.

"అమ్మా, నేను మరిచిపోయాను . . . అతనికి ఇదే వసతిగా ఉంటుందని నిన్న చెప్పారు . . . Please sit down!" అని జానకి అనగానే "Thank you!" అని అంటూ సుందరం అందులో కూర్చున్నాడు.

"నిన్న మీరు వచ్చినప్పుడు – మేమెవరూ ఇంట్లో లేం – మీరు వెంటనే వెళ్ళిపోయారని జానకి చెప్పింది. మీరు మమ్మల్ని అపార్థం చేసుకోకూడదు; మా ఇంటి అలవాటు ఏమిటంటే, ఎమైనా సరే, మేం ముందు తెలియజేసే ఒకరింటికి వెళ్తాం. అదేమో ఆనావాయితీగా మా నాన్నగారు రోజులనుంచీ జరుగుతోంది. మా నాన్నగారు రావు బహదూర్ మగిళ్మారన్ పిళ్ళై ప్రసిద్ధిచెందిన తమిళవేత్త; తాసిల్దారుగా పని చేసారు. నాయనా, మాది చాలా పేరు పొందిన కుటుంబం. మా అందరికీ ఆచారాలు, దైవ భక్తి, తమిళ సాహిత్యంలో అభిరుచి చాలా ఎక్కువ. మరిప్పుడో? మీకు తెలుసుగా, రోజులు ఎలా చెడిపోయాయని? అంతా కర్మ! కర్మబట్టి మనుషులూ పాడైపోతారు! అలాగే లోకమూ బాగా మారిపోయింది! కాని మేం మారలేదు, మేం మా పరువూ, ప్రతిష్ట కాపాడుకొని బతుకుతున్నాం! ఈ తరం జనులు మమ్మల్ని చూసి నవ్వుతారు . . . అది వాళ్ళ పొరబాటు కాదు . . . వాళ్ళ

దారి వేరు, మా దారి మాది, అంతే! . . . నేను - ఒంటరిగా – ఈ నాలుగు పిల్లల్ని ఎంత కష్టపడి పెంచానో మీకు తెలుసా? అది ఆ దేవుడుకే తెలుసు!" అని అలంకారవల్లి అంటూంటే ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి; అది చూసి ఆ పిల్లల మొహాలుకూడా మెరిసాయి.

సుందరంకి తత్తరపాటుగా ఉంది; రానీ రాగానే తనకేర్పడిన ఆందోళ బోధపడక, అతను అలంకారవల్లి మాటలు సానుభూతితో వింటున్నాడు.

"పెద్దవాడికి అప్పుడు ఎనిమిది నిండాయి; వీళ్ళిద్దరూ వాడికంటే రెండేళ్ళు చిన్నవారు. చిన్నవాడికి ఆరు, చెల్లంకి నాలుగు. జానకి చెయిలో బిడ్డ. ఆ రోజులు నీకు గుర్తున్నాయా, నాయనా? ఇప్పుడు నీ వయస్సెంత?"

"ముప్పైనాలుగు."

అలంకారవల్లి చేతివేళ్ళని ముడుచుకుంటూ సంవత్సరాలు లెక్కబెడుతోంది: "అవును . . . మీకు నా చిన్నవాడి వయసు . . . అప్పుడు యుద్ధం జరుగుతోంది . . . కరువుతో జనులు బాధ పడుతున్నారు . . . ఈ నాలుగు పిల్లలకి చర్మంలో బొబ్బలు వచ్చేసాయి! నేను వీళ్ళందరినీ కాపాడాలి! నాకెవరూ లేరు! . . . నా దురదృష్టం, అప్పుడే మా నాన్నగారూ పోయారు" అని తన తండ్రిని గుర్తుచేసుకొని దుఃఖించుతోంది.

"అంటే జానకికి నాన్నగారు లేరన్నమాట!" అని కొంచెం జంకుతూనే సుందరం అన్నాడు.

"అదంతా కర్మ నాయనా, . . . మరేం చెప్పను? . . . నేను మా నాన్నగారి ముద్దు బిడ్డగా పెరిగాను. కాని నా కర్మ నన్ను నరకంలో తోసేసింది . . . దేవుడి దయవలన ఎలాగో బయటకి వచ్చేసాను . . . తరువాత ఈ బిడ్డలకి ప్రియమైన తల్లిగా ఉంటున్నాను. ఆ మధ్యన ఉన్నదంతా నరకం – నాయనా – నరకం! మరేం అడక్కు!"

"అది నరకమంటే ఇటువంటి మంచి పిల్లలు దొరకడం ఎలా సాధ్యం?" అని అడిగాడు సుందరం. అతని మనసులో తను జానకిని, ఇతరులని పొగడుతున్నట్టు ఒక భావన చోటుచేసుకుంది.

"నాయనా, అదే ఒక పెద్ద పొరబాటు. జీవితమంటే ఏమిటో నేను బాగా తెలుసుకున్నాను . . . పెద్దవాడు పుట్టినప్పుడు నాకు పదునాలుగు నిండాయి . . . వాడిపేరు ముత్తు - ముత్యంలాంటి పిల్లవాడు . . . నా పిల్లలందరూ అపూర్వమైనవారే! ముత్యం పుట్టేది ఆలుచిప్పలోనేకదా? అలాగేకదా తామర జన్మ - బురదలో? అందుకని మనం ఆలుచిప్పలని పూలదండలాగ మన మెడలో వేసుకుంటామా? తామర పుట్టిందనే కారణం వలన మనం బురదలో దొర్లుతామా? మీరేమంటారు, చెప్పండి!" అని అలంకారవల్లి ప్రశ్న విని సుందరం నోరు పెగల్లేదు.

"నేనేమో మా కుటుంబం గురించి, నా గురించి మాటాడుతున్నాను. నీగురించి ఏమీ అడగలేదు . . . జానకి చెప్పింది - మీరు దానితో కాలేజీలో చదివారని . . . మీకు అమ్మా, నాన్నా ఉన్నారా? మీకు పెళ్ళయిందా?"

"అమ్మా, నాన్నా, గ్రామంలో ఉన్నారు . . . పెళ్ళి చేసుకోమన్ని నాకు పదే పదే చెప్తున్నారు . . . నాకేమో ఇప్పుడు పెళ్ళి వద్దనిపిస్తోంది . . ."

"అవును నాయనా, నీవన్నది నిజం . . . మా పెద్ద అబ్బాయి పెళ్ళి 'వద్దు!', 'వద్దు!' అని అంటూనే ఉన్నాడు . . . వాడొక పెద్ద వేదాంతి, నాయనా – ఇప్పుడొక సన్యాసిగానే మారిపోయాడు!" అని అతని గురించి తలపోస్తూ, కళ్ళు మూసి, తెరిచి అలంకారవల్లి ఎదుటనున్న మురుగన్ పతం చూస్తోంది.

"సరే, మిమ్మల్ని ఇలాగే కూర్చోబెట్టి 'బోర్' కొట్టడమంటే ఎలాగ? రండి, టీ తాగుదాం," అని సుందరంని పిలిచి అందరూ డైనింగ్ టేబిలు దగ్గరకి వెళ్ళి కూర్చున్నారు.

"మేం ఎప్పుడూ 'సింపుల్' గానే భోంచేస్తాం . . . నాయనా, మీకు మా టిఫన్ నచ్చుతుందో లేదో?" అని అలంకారవల్లి అడుగుతూంటే సుందరం తన నోటిలోని cake మింగాడు . . .

"టిఫనంటూ నేను సాయంకాలం ఏదీ తీసుకోను, కాఫీ మాత్రం తాగుతాను. నాకు 'ఇదే తినాలి', 'అది కూడదు!' అని ప్రత్యేకంగా నియమాలేవీ లేవు . . . మీరడిగారుగా ఎది ఏమైనా మనుషులు ఒకేలాగ జీవించడం సాధ్యమా అని? 'అసాధ్యం!' అని జీవించే సామాన్య ప్రజల్లో నేను ఒకడ్ని . . . మీరూ కూర్చోండి!" అని సుందరం నవ్వుతూ అలంకారవల్లికి చెప్పాడు.

"అందువలనే, ఒక నియమంతో, ప్రతిజ్ఞతో జీవించేవాళ్ళని చూస్తే నాకు ఒక విధమైన గౌరవం, మర్యాద కలుగుతోంది. ఎందుకంటే మనకి చేతకాని పనులు ఇతరులు చెయ్యగలిగితే అది చూసి మనం సంతోషించాలి! అవునా, మీరేమంటారు?" అని సుందరం తన దృష్టిని ఆడలరశన్ మీద మళ్ళించాడు.

"ఆహా, బాగా చెప్పారు . . . ఆదొక సద్గుణం!" అని పొగడుతూ ఆడలరశన్ తల్లి మొహం చూసారు. ఆ తల్లి 'అవును!' అని తలూపుతూ కొడుకు చాతుర్యం మెచ్చుకుంటోంది.

"ఆవిడ ఏమీ మాటాడరేం?" అని సుందరం చెల్లంని చూసి ఒక బిస్కట్టు కొరికాడు. చెల్లం సిగ్గుతో, చిరునవ్వుతో, తల వంచుకుంది.

"అది ఎప్పుడూ అలాగే! ఎవరితోనూ ఎక్కువగా మాటాడదు! అది దాని స్వభావం," అని జానకి అంది.

"నా పిల్లలందరూ – ఒక్కొక్కరూ – ఒక రకం, కాని దేవుడి దయవలన అందరూ అరుదైనవారే . . . మీరు మా పెద్దవాడిని కలుసుకోవాలి . . . అటువంటి అబ్బాయిని మీరెప్పుడూ చూసివుండరు! పూర్తిగా వాడి తాతగారి పోలికే! ఈ నలుగురు పిల్లల్ని నేను కన్నాను, కాని వాడు వేరే రకం! . . . అవునా, నువ్వేమంటావ్?" అని అంటూ అలంకారవల్లి ఆడలరశన్ని చూస్తోంది.

"అతని పేరు వింటే చాలు, చేతులెత్తి దండం పెట్టాలనిపిస్తోంది!" అన్నారు ఆడలరశన్.

"వాడికి ఇప్పుడు నలభై నిండాయి. ఇవాళ ఇంటిలో ఉన్నాడనుకో, బిడ్డలాగ నా పక్కనే నిద్రపోతాడు! నన్ను అడక్కుండా ఏ పనీ చెయ్యడు! నా మాటకి ఎదురు చెప్పడు, 'ఎందుకు?' అని కూడా అడగడు." మాట్లాడుతుంటే అలంకారవల్లి కళ్ళు తడిసిపోయాయి; చీర కొనతో తుడుచుకుంటోంది.

కొన్ని నిమిషాలు వాళ్ళ మధ్య శోచనీయమైన నిశ్శబ్దం చోటుచేసుకుంది.

"ఇప్పుడు అతను ఎక్కడున్నారు?"

జానకి మొహం పూర్తిగా మారిపోయింది. అందరూ సుందరం ఏదో అడగతగని ప్రశ్న అడిగినట్టు, హత్య చేసిన ఒక గుంపుని పోలీలువాడు అరెస్టు చేసి 'బలి ఐన

ఆ వ్యక్తి ఎక్కడ?' అని అడుగుతున్నట్టు, "అమ్మా, మమ్మల్ని కాపాడు!" అని తల్లిని బతిమాలుతున్నట్టు అలంకారవల్లిని రెప్పవాల్చక చూస్తున్నారు.

"I am sorry . . . నా ప్రశ్న మీకు బాధగా ఉందేమో? నన్ను క్షమించండి."

"అలాగేం కాదు, నాయనా . . . మేమందరం అమితంగా ప్రేమించే బంధువు – ఒక రోజు కూడా వాడు మమ్మల్ని వదిలి ఉండలేదు – మాతో లేకపోవడం మాకు బాధగా ఉంది . . . ఇంకా కొంచెం టీ . . . " అని అలంకారవల్లి సుందరంకి అతిథి సత్కారం చేస్తోంది.

"చాలు . . . చాలు!"

టీ తాగి, డైనింగ్ టేబిలు పక్కన కూర్చున్నంతవరకూ ఎవరూ ఏమీ మాటాడలేదు.

మళ్ళీ అందరూ హాలుకి వచ్చి ఆ గుండ్రపు మేజాచుట్టూ కూర్చున్నారు. వాళ్ళందరి మనసులోనూ - అక్కడ లేని - ఆ పెద్దన్నయ్య జ్ఞాపకం నిలకడగా ఉంది.

గభీమని అలంకారవల్లి ఆరంభించింది.

"నాయనా, వాడు నాకొక బిడ్డే! కాని ఒక పెద్ద జ్ఞాని! ఆ రోజుల్లో వాడ్ని B.A., చదివించడానికి నేను చాలా బాధ పడ్డాను . . . First Class లో పాసయ్యాడు. నేనే ఎవరినెవరో కలుసుకొని వాడికి ఉద్యోగంలో చేర్చాను. మీరు వచ్చిన దారిలో కనిపించే బాంకులోనే వాడు ఏజంటుగా పని చేసాడు. వాడి ఆదాయంతోనే తక్కిన పిల్లల చదువుకి ఏర్పాటు చేసాను. అన్నీ బాగానే సాగాయి. అందరిలాగే వాడూ కులాసాగా ఉండాలని ఒక పెళ్లి చేసిబెట్టాను. నాయనా, అదే నేను చేసిన పెద్ద పొరబాటు . . . "

"వాడి పెళ్ళాం చదువుకున్న అమ్మాయి . . . పెద్ద ఇంటి సంబంధం . . . మంచి అందగత్తె కూడా . . . నా అబ్బాయి ఒక వేదాంతి . . . వాడికి ఆ జంతువుని భార్యగా ఎంపిక చేసాను . . . తెలియక నేను చేసిన పొరబాటది. అబ్బబ్బా, నా ముద్దు బిడ్డని ఆ రాక్షసి దగ్గర ఒప్పగించాను . . . ఏమైందో, ఎందుకైందో, ఎవరికి తెలుసు? అర్ధరాత్రిలో 'అమ్మా!', 'అమ్మా!' అని వాడి కేకలు విని వచ్చి చూసాను. నా బిడ్డ మురుగన్ పఠం ముందు నిలబడి, రెండు చేతులూ జోడించి, కన్నీరు

కార్చుతున్నాడు; ఆ రాక్షసి నడుంలో చెయి పెట్టుకొని, నన్ను ఎగతాళిగా చూస్తోంది. 'ఏమిటే, నా పిల్లవాడికి ఏమైంది?' అని దాన్ని అడిగాను. నాయనా, నువ్వే చెప్పు, నేనలా అడిగితే తప్పా? ఒక తల్లి ఆ ప్రశ్న అడక్కూడదా? దానికి అది ఇంగ్లీషులో ఏమేమో చెప్పింది . . . నాకూ కొంచెం ఇంగ్లీషు తెలుసు . . . వాడు 'ఇంపొటెంట్' అని ఊరంతటికీ వినిపించినట్టు బొబ్బలు పెట్టింది . . . అవును, నాకది తగిన శిక్ష అని చెప్పుకోవలసిందే! . . . ఆ మరుదినం అది వెళ్ళిపోయింది! వాడూ సన్యాసిగా, వేదాంతిగా ఐపోయాడు . . . నాయనా, నీకు రామకృష్ణ పరమహంస కథ తెలుసా? ఆదిశంకరుల గురించి నువ్వు విన్నావా? మహాత్మా గాంధీగారి 'బ్రహ్మచర్యం' చదివున్నావా? వాళ్ళందరూ ఎవరు? ఈ రాక్షసి అన్నట్టు వాళ్ళని 'ఇంపొటెంట్' అంటే అది ఎంత మహా పాపం! పందికీ, కుక్కకీ, potency ఉంది, లేదని ఎవరన్నారు? మంచి వేళ, మమ్మల్ని దాపురించుకున్న ఆ శని త్వరలో పోయింది! అబ్బబ్బా, వీళ్ళందరూ ఏం మనుషులో!

"ఇప్పుడతను - మీ పెద్దబ్బాయి ఎక్కడున్నారు? నాకతన్ని చూడాలని ఉంది," అని సుందరం అడిగాడు.

"Oh, what a nice man to move with!" అని పెద్దన్నయ్యని జానకి గుర్తు చేసుకుంటోంది.

"నాయనా, వాడు ఎక్కడున్నా సరే, అదొక కోవిల! నేను కోవిలకి వెళ్ళడం వాడిని చూడడానికే! కొన్నిసార్లు అక్కడకి వస్తాడు . . . ఈ పక్కనే మా గ్రామం ఉంది, అక్కడ ఉన్నాడు. మురుగన్ దయవలన త్వరలో వచ్చేస్తాడు, మాతో కలుసుకుంటాడు . . . "

సమయం ఏడుగంటలవుతోంది. సుందరం తన వాచీ చూసాడు.

"మిమ్మల్ని కలుసుకున్నందుకు నాకు చాలా సంతోషం; రానూ రానూ ప్రపంచంలో మంచివాళ్ళని చూడడం అరుదుగా ఉంది . . . మిమ్మల్ని నా పిల్లల్లో ఒకడిగా చూస్తున్నాను. మీరూ నా పిల్లల్ని మీ తోబుట్టువుగా భావించాలి. ఈ ప్రపంచంకి తోబుట్టువుల మధ్య బంధం గురించి ఏమీ తెలియనట్టుంది . . . ఇంత ఎందుకు, తల్లీ, కొడుకు మధ్య ఉన్న ప్రేమగురించికూడా ఏమీ తెలియదు! నేనెందుకు చెప్తున్నానంటే మీరు ఈ కుటుంబంలోని ఒక సభ్యులుగా ఎప్పుడైనా

సరే ఈ ఇంటికి రావచ్చు . . . నన్ను అపార్థం చేసుకోవద్దు . . . మీరు వీళ్ళని ఆఫీసులో ఫోను చేసి మాట్లాటడం, ఇంటి బయట కలుసుకోడం మాత్రం వద్దు . . . నేను మీ అమ్మలాగ . . . నాకు తెలిసిన లోక జ్ఞానంతో మీకు చెప్తున్నాను . . . మా ఇంటికి వస్తూ ఉండండి, మాటాడండి . . . సరేనా?" అని సుందరం, జానకికి అలంకారవల్లి చెప్తోంది.

"సరే అమ్మా . . . మిస్టర్ సుందరం, మీరు తరచుగా మా ఇంటికి వస్తూ ఉండండి!" అని జానకి అతన్ని వేడుకుంది.

"సరే," అని అంటూ సుందరం చేతులు జోడించి శెలవు పుచ్చుకున్నాడు.

అతను తన పాత కారులో వెళ్ళిన తరువాత అలంకారవల్లి తన ఊగెడు కుర్చీలో కూర్చొని ఆడలరశన్ కి చెప్తోంది:

"అబ్బాయి మంచివాడిలాగే కనిపిస్తున్నాడు. చిన్నవాడూ, నువ్వేమంటావ్?" అని అడుగుతూ తన ఊగెడు కుర్చీ ఊపుతోంది.

"హూం, చూద్దాం . . . అమ్మగారు చెప్తే సరే!" అని గొణుకుతూ ఆడలరశన్ తన ఊగెడు కుర్చీని మెల్లగా ఊపారు.

ఊగెడు కుర్చీలు ఆడుతున్నాయి.

## రంగం – 4

జానకి ఇంకా ఆఫీసునుంచి రాలేదు. సుందరం ఈ ఇంటికి మొట్టమొదటగా వచ్చి అందరినీ కలుసుకొని, రెండు మాసాలైపోయాయి. ఇంతవరకూ – మూడు ఆదివారాలు – సుందరం ఇక్కడకి రావడం జరిగింది. ఎల్లప్పుడూ అలంకారవల్లి అతనితో మాట్లాడడం, తక్కిన పిల్లలు తరచుగా సుందరం అడిగిన ప్రశ్నలకి జవాబు చెప్పడం – మొదటి సమావేశం లాగే ఈ మూడూ గడిచాయి.

కాని ఇందులో ఏదో రహస్యం ఉందని, సుందరం తమ కుటుంబంని, కుటుంబ సభ్యులని పరిశీలన చేస్తున్నాడని, అందుకు అలంకారవల్లి ముద్దుబిడ్డ జానకిని అతను ప్రయోగించుతున్నాడని వాళ్ళందరి మనసులో ఒక గాఢమైన ఒక అనుమానం చోటుచేసుకుంది.

అలంకారవల్లి తన కుర్చీలో కూర్చొని ఉంది; చెల్లం ఇలాగా అలాగా తిరుగుతూ ఒక నూలు కండె వెదుకుతోంది.

'అది ఇప్పుడు నాకు కావాలే,' అని తనలో గొణుకుతూ తొందర పడుతున్న చేతుల్ని చూస్తూ చెల్లం లోపలికి వెళ్ళి ఇంతకు ముందే అల్లిన ఒక scarf ని తీసుకొనివచ్చి, అల్లిన దారంని విప్పుతూ, దాన్ని కండెలో చుట్టుకుంటూ, కుర్చీలో కూర్చొని మళ్ళీ అల్లుతోంది.

నుదుట విభూతితో, బనియన్, టర్కిష్ తువ్వాలుతో ఆడలరశన్ అక్కడకి వచ్చారు.

"చిన్నవాడూ, రా, కూర్చో! ఇవాళ దాన్ని చూసావా? వాడితోనే తిరుగుతోందా?" అని ఆ రోజు principal ఆఫీసులో జరిగిన ఘటన గురించి అడిగిన అదే ఆతురతతో అలంకారవల్లి ఇప్పుడు కొడుకుని అడుగుతోంది.

"అమ్మా, ఇంకా ఎన్ని రోజులు నేనీ గూఢచారితనం చెయ్యాలంటున్నారు? ఇక దానికి అగత్యం లేదు. వరద రావడానికి ముందే ఆనకట్టు కట్టుకోవాలి! వీడొక గజదొంగ! మనింటికి వచ్చినప్పుడల్లా యోగ్యుడులాగ నటిస్తున్నాడు! కాని అక్కడేమో ప్రేమ సల్లాపమే జరుగుతోంది! మనం వాడ్ని మాత్రం దూషించకూడదు! ఈ జానకి ఉందే . . . " అని ఆడలరశన్ పళ్ళు కొరుకుతున్నారు. .

"ఒరేయ్, తొందరపడకు! కోపం వద్దు! నాకు తెలుసురా, మన అమ్మాయి పొరబాటు చెయ్యదు! . . . అది దానికి చేతకాదు! . . . ఈ ప్రేమ సల్లాపం, ఆఖరికి, ఆ రామనాథన్ కథలాగే అంతమవుతుంది . . . నాకేమో ఈ కథలు ఇలా సాగుతూ ఉండడం ఇష్టం లేదు . . . ఈ కాలేజీ వెధవలందరూ ఏ అమ్మాయి దొరుకుతుందని కాచుకొని ఉన్నారు . . . సరే, నువ్వన్నట్టు ఇవాళ జానకిని మందలించ వలసిందే! . . . అది రానీ!" అని అంటూ కళ్ళు మూసుకొని అలంకారవల్లి కుర్చీని ఊపుతోంది.

"నాకేమో చాలా సిగ్గుగా ఉందమ్మా . . . ఇక మన పరువు, ప్రతిష్ట ఏమవుతుందో ఎవరికి తెలుసు? జానకికి మతి పోయినట్టుంది . . . ఇప్పుడు అందరికీ దీని గురించి తెలిసిపోయింది! . . . రోజూ వీడి కారులో ఆఫీసునుంచి జానకి ఇంటికి వస్తోంది . . . ఆఫీసుకి వెళ్ళే దారిలో ఇది బస్సులోనుంచి

దిగినవెంటనే వీడు దీనితో ఆఫీసుకి వెళ్ళడం, ఆ తరువాత హోటలుకి వెళ్ళడం – ఇవన్నీ అందరికీ తెలుసు . . . నేను ఎటువైపు తిరిగినా సరే 'చూడు, చూడు, నీ చెల్లెలు జానకి! నీ చెల్లెలు జానకి!' అని అందరూ నా చెవుల్లో అరుస్తున్నారు. నేను ఒంటరిగా నడుస్తున్నప్పుడూ, నా వెనుక ఎవరో జానకి గురించి నాతో మాటాడుతున్నట్టుంది. తిరిగి చూస్తే ఎవరూ లేరు!" అని ఆడలరశన్ తల్లితో మొరబెట్టుకుంటున్నారు.

"మనకి పరువు, మర్యాద అంటే ఏమిటో తెలుసు, అదే మన కుటుంబం గొప్పతనం . . . నీకే భయం వద్దు! . . . జానకి కూడా అలాంటి పిల్లే, అదేం తప్పు చెయ్యదు," అని అలంకారవల్లి అంటూంటే జానకి వస్తోంది.

ఆమె స్వరూపంలోనూ, మొహంలోనూ, ఒక పెద్ద మార్పు కనిపిస్తోంది. ఆమె మానసికంగా సంతోషంతోనూ, కలలు కంటూ, రోజులు గడుపుతోంది.

జానకి ఇంట్లోకి ప్రవేశించి తన గదికి చేరుకునే ముందు అలంకారవల్లి, కళ్ళు తెరిచి, పళ్ళు కొరుకుతూ, "ఏయ్, జానకి!" అని పిలిచింది.

అబ్బా, ఆ ధ్వనిలో ఎంత కాఠిన్యం!

జానకి తిరిగి చూసింది.

"హూం, రావే . . . దగ్గరకి రా . . . నిన్ను కొంచెం బాగా చూడాలి!" అని అలంకారవల్లి కళ్లు కూతురుని తల నుంచి పాదాలవరకూ పరిశీలన చేసాయి.

"ఇవాళ బీచుకి వెళ్ళావా?"

"అమ్మా . . . నేను . . . "

"వెళ్ళావా?" ఆ హాలు వణుకుతున్నట్టు అలంకారవల్లి అరిచింది.

"హూం . . . వెళ్ళాను."

"అమ్మా, దాని తల జుత్తు ఎందుకు చింపిరిగా ఉందని అడగండి!" అన్నాడు ఆడలరశన్.

"బీచులో గాలి విసరుతోంది, జుత్తు చింపిరవుతుంది!" అని దృఢంగా జానకి అతనికి జవాబు చెప్తోంది.

"బీచుగాలి బొట్టుని కూడా చెరిపేస్తుందా?"

"గాలేమో దాన్ని చెరపదు! కాని hand kerchief వాడినప్పుడు అది పోయుంటుంది! I don't understand these questions!" అని జానకి బొబ్బలు పెడుతోంది.

"You will understand, yes, you will," అని అంటూ ఆడలరశన్ ఆమె మొహంకి ఎదుట తన వేలుని చాటి, పళ్ళు కొరుకుతూ, మెల్లగా కాని, భారంగా, అడిగారు: "Didn't he kiss you?"

"Yes, he kissed me," అని కళ్ళు మూసుకుంటూ, పళ్ళు కొరుక్కుంటూ. తలెత్తి, ఆ సుఖంని కలల్లో అనుభవిస్తునట్టు జానకి ఒప్పుకుంటోంది.

"అయ్యో, పాపిష్టురాలా! . . . " అని అలంకారవల్లి గొంతు చించుకొని అరిచింది: "ఎంత పని చేసావ్! నా కడుపులో పుట్టిన పిల్లకి ఇలా పరువు, ప్రతిష్ట లేకపోవడం నేనెలా భరించగలను? . . . మురుగా, ఇదీ, నా తలరాత కాబోలు!"

"అమ్మా, ఇందులో మన పరువు, ప్రతిష్టకి ఏం నష్టం? ఆ రోజు అతను నీ కడుపులో పుట్టిన పిల్లవాడని అన్నావ్; మరి, నేను పెద్దన్నయ్యతో, చిన్న అన్నయ్యతో బీచుకి వెళ్ళనా? నువ్వు నీ పిల్లలన్ని ముద్దాడడం లేదా? చిన్న అన్నయ్య చెల్లంని ముద్దాడడం లేదా? నేనూ అతన్ని అలాగే ముద్దాడాను, ఇందులో తప్పేముంది?" అని జానకికూడా కేకలు పెడుతోంది. "మీరనుకున్నట్టు అతను చెడ్డ మనిషి కాదు. నేను అతనిగురించి అన్నీ ముందే అడిగి తెలుసుకున్నాను. He will never misbehave . . . మీకేం భయం వద్దు . . . "

"అమ్మా, దీనికి వాడు మాటలన్నీ బాగా నేర్పాడమ్మా! . . . ఇవన్నీ దీని సొంత మాటలు కావు!" అని తన కంఠధ్వనిని తగ్గించి, ద్వేషమూ, అనుమానమూ కలిసి అసహ్యంగా వినిపించే ధోరణిలో, ఆడలరశన్ "అమ్మా, దీన్నీ లేడీ డాక్టరుదగ్గర check-up కి చూపించాలి . . . నాకు అనుమానంగా ఉంది . . . " అని చెప్పి ముగించే ముందు జానకి చెయిలోని tiffin box అతని మీద విసిరి అరుస్తోంది:

"Do it please! Take me to a doctor! అమ్మా, దయచేసి నన్ను డాక్టరుకి చూపించండి! I want to know whether I am fit - capable! Please help me . . . మిమ్మల్ని ఎందుకు అడగాలి? నేనే వెళ్తాను . . . డాక్టరు certificate ఇస్తేనే

నమ్ముతారా? మీరు నన్ను నమ్మాలని కాదు . . . నేనే నన్ను నమ్మాలి . . . I am going to the doctor . . . ”

“జానకి, నా ముద్దుబిడ్డ . . .” అని ఏడుస్తూ వచ్చి అలంకారవల్లి జానకి చెయి పట్టుకుంది. “అమ్మాయీ, నాకు నిన్ను తెలియదా? తల్లి కంటే లేడీ డాక్టరు ఏం గొప్ప? చిన్న అన్నయ్య మాటలు వినకు! వాడిగురించి నీకు తెలుసుగా? ఇలా రా! నలుగురు మన గురించి గుసగుసలాడుతారనే నాకు బెంగ; లేకపోతే నువ్వు తోవ తప్పుతావని నేను అనుకుంటానా? రా, కూర్చో! కోప్పడకు!” అని సముదాయించింది.

జానకి కోపం, ఆవేశం తగ్గలేదు. ఎక్కడో తేటిపారి చూస్తూనే తల్లిమీద ఎదురుతిరిగింది: “అమ్మా, చెప్పండి. మీరు లైంగిక సంబంధం పాపం అంటున్నారా? Is sex sin? అలాగైతే మీరెలాగ నలుగురు పిల్లలు కన్నారు? How? How? How did you give birth to four children?” అని కుర్చీ చేపిడిని గుద్దుతూ, తెగించి, తల్లినే అడిగేసింది.

ఆడలరశన్ ప్రతిపక్షం వకీలులాగ ముందుకు దూకారు.

“Miss Janaki,” అని అంటూ లేచి వచ్చి, ఆమె కుర్చీ చేపిడులలో ఆనుకొని, ఆమె మొహంకి కింద వొంగి “ఇప్పుడు మీ వయసెంత?” అని అడిగారు.

“I am thirty!”

“Thirty! ఈ ముప్పై సంవత్సరాలలో నీ అమ్మని ఇలాంటి ప్రశ్న అడగాలని నీకు తోచనేలేదు! అవునా? ఏం, ఎందుకు తోచలేదు? దానికెందుకు ఇంత కాలం పట్టింది? అమ్మని ఈ ప్రశ్న అడగమని వాడే నీకు సలహా ఇచ్చాడు, అవునా? ఆ తరువాత నువ్వు వాడికి పూర్తిగా లొంగి పోతావని వాడి ప్లాను!”

“అవును, అతనే అడగమన్నారు . . . మేం sex గురించి మాటాడుతున్నప్పుడు అతనే ఇలాంటి ప్రశ్న వేసారు . . . నా అమ్మ పాపం చేసిందని నేను ఒప్పుకోను . . . ప్రశ్న అని వస్తే అది ఎవరడిగితే ఏం? జవాబు చెప్పు! లైంగిక సంబంధం పాపమా? అలాగంటే అమ్మ పాపిష్టురాలు, ఈ ప్రపంచంలో అందరూ పాపాత్ములన్నమాట! అవునా, చిన్నన్నయ్యా, మాటాడవేం?”

"నేను చెప్తానే, విను! . . . నిన్ను కన్న పాపంకి నేనే చెప్తాను - నేను మీ అందరినీ ఎలా కన్నానని, ఆ నరకావస్థ ఎలా అనుభవించానో చెప్తాను!" అని అలంకారవల్లి కడుపుని బాదుకుంటోంది:

"అవునే, అది నరకం! నా శరీరంని చిందరవందరగా ఖండించినట్టు అది జరిగింది - ప్రతీ సమయం ఒక దుర్దేవతకి బలి అవుతున్నట్టనిపించింది! అదొక క్రూర జంతువు, ఆడదిగా జన్మమెత్తినవాళ్ళందరూ దానికి మేత అన్నమాట! ఆ జంతువుకి మనమంటే చాలా రుచి! కాని బలికి అదొక బాధ! ఆ బాధ నేను మిమ్మల్ని నా కడుపులో మోసినప్పుడు అనుభవించాను, మిమ్మల్ని కన్నప్పుడు అనుభవించాను, ఇప్పుడూ అనుభవిస్తున్నాను!" అని బిగ్గరగా అరుస్తూ, కఠినంగా కడుపుని బాదుకొని, అలంకారవల్లి ఏడుస్తోంది.

"అమ్మా, అమ్మా, నన్ను క్షమించండి! . . . " అని ఏడుస్తూ జానకి తల్లి చేతులని బిగువుగా పట్టుకొని ఆపుతోంది. ఆడలరశన్, చెల్లెం, వేరే వేరే దిక్కుల్లో ముఖం తిప్పుకొని, వెక్కి, వెక్కి ఏడుస్తున్నారు.

అలంకారవల్లి మొహం తుడుచుకొని, ఎదుటవున్న మురుగన్ పఠం చూస్తూ, చేతులు జోడించి, తనలో తనే మాటాడుకుంటోంది: "మురుగా! నేను పడిన నరకంలో నా పిల్లలు పడకూడదని నా కోరిక, అది నా పొరబాడా? చెప్పు! కాని, ఎవరి కర్మ వారిది, నేనేం చెయ్యగలను?" అని అంటూనే జానకి పక్క తిరిగి చురుకుగా చూస్తోంది.

"జానకీ, చిన్నవాడూ, చెల్లెం - మీకందరికీ చెప్తున్నాను. వినండి. మీరు ప్రేమించి ఎవరినైనా సముచితంగా పెళ్ళి చేసుకోవాలంటే నేను అడ్డు చెప్పను. ఆ పెళ్ళిని సంతోషంగా జరిపించే బాధ్యత నాది. మీకేం అనుమానం వద్దు!" అని ఆమె అనగానే ఆడలరశన్, చెల్లెం తల్లికి సమీపంలో వచ్చి "ఎందుకమ్మా మీరిలా మాటాడుతున్నారు? మీరు మాతో ఉంటే మాకది చాలు! . . . " అని ఏడుస్తున్నారు. "కావాలంటే జానకి పెళ్ళి చేసుకోనీ . . . మేం ఇలాగే సంతోషంగా ఉంటాం, అమ్మా . . ."

"సరే, జానకి! అతన్ని ఒక రోజు మనింటికి రమ్మను, నేనే మాటాడుతాను . . . కాని ఒకటి గుర్తుంచుకో . . . నువ్వు వాడిని, ఈ ప్రపంచంని నమ్మి మమ్మల్ని

వదులుకుంటే చాలా బాధ పడతావ్ . . . ఒక తల్లిగా నేను నీకు అంతే చెప్పగలను . . . కావాలంటే, నువ్వు అతన్ని ఇక్కడ మన ఇంటికి నీతో వచ్చేయమని చెప్పేయ్! . . ." అని అలంకారవల్లి పలికిన మాటలు జానకి నమ్మలేకుంది; సంతోషంతో నవ్వుతోంది. మరేం అనక తల్లిని కౌగిలించుకొని నవ్వుతుంది, ఏడుస్తోంది. ఏడుస్తూనే నవ్వుతోంది, తన గదికి పరుగెడుతోంది.

ఆడలరశన్ చిరచిరలాడుతున్నట్టు కనిపించారు. అతను తన కుర్చీలో కూర్చొని కళ్ళు మూసుకున్నారు. 'కొంచెం ఒపిక పట్టు! . . ." అని అలంకారవల్లి అతనికి ధైర్యం చెప్తోంది.

ఊగెడు కుర్చీ మాత్రం ఊగుతోంది.

## రంగం - 5

ఆ కుటుంబ సభ్యులకి ఇంత కాలం వరకూ ఎడబాటుగా ఉన్న, వేదాంతి, సన్యాసి అని అలంకారవల్లి వర్ణించిన ఆ తల్లి మాటని ఏనాడూ మీరని తనయుడు - ఇన్ని రోజులూ ఖాళీగా ఉన్న - తన కుర్చీలో కూర్చొనివున్నారు. తెల్ల షర్టు, తెల్ల పైజామా ధరించిన అతనికి నలభై నిండాయి కాని అతని మొహంలో ఒక యోగిలాగ శాంతం, సమరత్వం కనిపిస్తున్నాయి; 'ఇతనికి అరవైయేళ్ళు నిండాయేమో?' అనిపించే ధోరణి కానవస్తోంది.

హాలుని పూర్తిగా సిగరెట్టు పొగ కప్పేసింది. అతను ఏకాంతంగా సిగరెట్టు కాలుస్తున్నారు.

అలంకారవల్లి, లోపలినుంచి వచ్చి, అతని నుదుటమీద వీభూతి పూసింది.

"నేను నమ్మ లేకున్నాను! నువ్వెక్కడరా ఈ సిగరెట్టు అలవాటు నేర్చుకున్నావ్?"

"అమ్మా, దయచేసి నన్ను క్షమించండి! . . . దీనికి మాత్రం అడ్డు చెప్పకండి! . . . మీరు ఆక్షేపిస్తే నేను సిగరెట్టు కాల్చను, కాని చాలా బాధపడతాను," అని అతను బతిమాలుతున్నారు.

“కణ్ణా[3], సరేలే, తక్కిన కుర్రవాళ్ళ చేష్టలు చూస్తే ఇదేం పెద్ద తప్పు కాదు . . . కాని ఎక్కువగా పొగ తాగవద్దు . . . నీ ఆరోగ్యంకి మంచిది కాదు . . . .”

“అలాగే అమ్మా . . . ” అని పసిపాపలాగ అతను నవ్వుతున్నారు. “తమ్ముడూ, జానకి, చెల్లం ఎక్కడ?”

“వాళ్ళు పూజగదిలో ఉన్నారు . . . వస్తారు . . . ”

ఇప్పుడు జానకి వస్తోంది.

“పెద్దన్నయ్యా . . . ఈ రెండు రోజులూ మీరిక్కడ ఉండడం నాకు ఎంత హాయిగా ఉందో తెలుసా? ఆఫీసు మూడగానే ఎగిరి ఇంటికి వచ్చేయాలని ఆతురతగా ఉంది . . . మీరిక మమ్మల్ని వదలి ఎక్కడకీ వెళ్ళకండి,” అని అతని చెయి పట్టుకుంటోంది. ఇంతలో ఆడలరశన్, చెల్లం వచ్చి కుర్చీలలో కూర్చున్నారు.

“అమ్మా, నాకు ఆఫీసుకి వెళ్ళాలని ఉందమ్మా! . . . ”

“ఇంకా ఒక నెల పోనీ కణ్ణా, ఎందుకీ తొందర?”

“అవును, ఒక నెల పోనీ,” అని పెద్దన్నయ్య తల్లితో వెంటనే ఏకీభవించారు.

బయట ఆ పాత కారు లొడ లొడ మని ఇంటి ముందు వచ్చి నిలబడిన తరువాత దాని శృంగ నాదం చెవులని గుచ్చుతూంటే . . .

పెద్దన్నయ్య మినహా అందరి ముఖాల్లో ఒక మార్పు . . .

“అమ్మా, అతను వస్తున్నారమ్మా . . . ” అని ఆహ్లాదపడుతూ జానకి లేచింది.

“సరేలే . . . నువ్వు కూర్చో! . . . ” . .

‘వీడెందుకు ఇవాళ వచ్చాడు?’ అని అలంకారవల్లి తనలో మూలుగుతోంది.

“ఎవరే? . . . ఎవరు వస్తున్నారు?” అని పెద్దన్నయ్య అడిగారు.

“నా friend పెద్దన్నయ్యా . . . ”

“రానీ . . . ఒక friend వస్తే మనం సంతోషించాలి, అవునా?” అని అతనూ లేచారు.

“పెద్దవాడూ, నువ్వు కూర్చో, మరేం అనవద్దు! . . . నేను నీకన్నీ తరువాత వివరంగా చెప్తాను!” అని చెప్పి అలంకారవల్లి ప్రవేశ ద్వారం తెరవాలని వెళ్ళింది. తెరచిన తరువాత వచ్చినతని మొహంకూడా చూడకుండా అలాగే తిరిగి వచ్చింది;

---

[3] చనువు పేరు

చెల్లం తలెత్తక స్వెటర్ అల్లుతూనేవుంది; ఆడలరశన్ కళ్ళని బిగువుగా మూసుకున్నారు.

జానకి లేచి, పరుగెత్తుకొని వెళ్ళి, సుందరంకి ఒక కుర్చీ తీసుకొని వచ్చింది.

"రండి, సుందరం . . . Please meet my elder brother . . . పెద్దన్నయ్యా - ఇతను Mr. Sundaram, నా college mate . . . ఇప్పుడు మన ఊరులో పేరు మోసిన ఫోటోగ్రాఫరు . . . "

"How do you do?" అని సుందరం చెయిని ఊపుతూ పెద్దన్నయ్య అతనితో పరిచయం చేసుకున్నారు: "నా పేరు ముత్తు మాణిక్కం . . . ఇటీవల అస్వస్థత వలన ఆసుపత్రిలో ఉన్నాను . . . Now, I am all right . . . "

"జానకి, అతనికి టీ తీసుకు రా," అన్నారు పెద్దన్నయ్య.

"వద్దండి . . . నేనిప్పుడే తాగాను . . . "

"It's all right . . . నాకిప్పుడు second dose కావాలి! . . . మీతో కలిసి టీ తాగాలని ఉంది . . . నువ్వు తీసుకురావమ్మా!" అన్నారు ముత్తు.

జానకి tray లో తెచ్చిన tea ఇద్దరూ తాగుతున్నారు.

"ఏంటమ్మా, అతను వచ్చారు. మీరందరూ మాటాడకుండా ఉన్నారు?" అని ముత్తు తల్లిని అడిగారు.

"మాటాడానికి ఎన్నో ఉన్నాయి; ఎక్కడ ఆరంభించాలని ఆలోచిస్తున్నాను."

ముత్తు తన సిగరెట్ పేకెట్టునుంచి ఒక సిగరెట్ సుందరంకి అందించారు. సుందరం ఒక నిమిషం వెనకాడి దాన్ని పుచ్చుకున్నాడు. అది చూసీ చూడనట్టు అలంకారవల్లి తల తిప్పుకొని, సుందరం మొహం చూడకుండానే అతనితో మాటాడింది:

"మీరొక మంచి అబ్బాయి అని నమ్మి నేను మా అమ్మాయితో మెలగడానికి మీకు అనుమతి ఇచ్చాను. కాని మీకు నా మాటకి విరుద్ధంగా, ఇంటికి బయట దానితో తరచుగా కలుసుకుంటున్నారు. ఇది పొరబాటు కాదా?"

"కాదు!" అని ఒక్క మాటలో సుందరం జవాబు చెప్పాడు.

"That's right! ఇందులో తప్పేముంది? ఎది ఎలాగైనా అతనికి మన అనుమతి ఇవ్వాలని మనకేం హక్కు ఉంది? మనం మన అమ్మాయికే

బుద్ధిచెప్పవచ్చు. ఐనా, జానకి ఎవరు? అది ఒక ఆఫీసరు, దానికి ముప్ఫైయేళ్ళు నిండాయి! దానికి తెలియదా?" అని ఉత్సాహంతో ముత్తు మాటాడుతున్నారు.

"కణ్ణా, నీకేం తెలీదు! నోరెత్తక ఇక్కడేం జరుగుతుంతో చూడు . . . " అని ముత్తుని మందలించిన తరువాత అలంకారవల్లి సుందరంతో "మీరు దాన్ని మనసుని పాడు చేసేసారు. ఇన్ని రోజులూ ఎది పాపం, తప్పు అని జానకి తన మనసులో అనుకున్నవన్నిటికీ ఇప్పుడు 'సరే!' అనే భావన వచ్చేసింది! దానికి నా మీద తల్లి అనే మర్యాద పోయింది! నన్ను ఏమేమో ప్రశ్నలు అడగమని మీరు దాన్ని రెచ్చగొట్టారు."

"Oh, it is very interesting! మీరు దేనిగురించి మాటాడుతున్నారు?" అని ముత్తు అడిగారు.

"ఓ, అదా? అవాళ నాకూ, జానకికి ఒక discussion - about sex. జానకి వాదం - sex పాపం అని. నేను అన్నాను - 'అలాగైతే మనం అందరం పాపాత్ములం! ప్రతీ తల్లీ, తండ్రీ, పాపం చేసినట్టయితే, మనమూ పాపం చేసినట్టేకదా? మన పాపంకి ఆధారం మన చర్య కాదు. మనం ఎది చేసినా, చెయ్యకపోయినా, మన పుట్టుకకి కారణం పాపమంటే మనందరికి పాపంతో సంబంధం ఉండి తీరాలి!' అన్నాను."

"Well said! You are right!" అని ముత్తు సుందరంని పొగడారు.

అలంకారవల్లి చిరచిరలాడుతూ ఇద్దరినీ చూస్తోంది.

"పెద్దవాడూ - నువ్వు ఊరక కూర్చో . . . " అని కొడుకుని మళ్ళీ హెచ్చరిస్తూ అలంకారవల్లి సుందరంకి చెప్పింది. "నేను మిమ్మల్ని పిలిచినది ఇందుకే. మీరు దాని మనసు మార్చేసారు. అది మిమ్మల్నే పెళ్ళి చేసుకుంటానని అంటోంది," అని అంటూంటే, జానకి సిగ్గుతో తల వంచుకుంటోంది; ముత్తుకి చెల్లెల్ని చూసి ఆహ్లాదం కలుగుతోంది.

అలంకారవల్లి సందేశం సాగుతోంది:

"అందువలనే మీరు మీ నిర్ణయం నిస్సందేహంగా నాకు తెలియజేయాలి. దానికి ముందు నా మనసులో ఏముందే చెప్పేస్తాను. జానకి పిల్ల; దానికి లోక పరిచయం లేదు; మీ మాటలు విని, మీ వశమై చిలకలాగ ఏమేమో వాగుతోంది. నాకు దాన్ని

బాగా తెలుసు. అందువలన మీరు దాన్ని పెళ్ళి చేసుకుంటే నా బిడ్డని నేను మీతో పంపలేను; అదీ నన్ను వదలి ఉండలేదు! మీరే మా ఇంట్లో ఎన్నటికీ ఉండాలి; దానికోసం మీరు మరేం చెయ్యనక్కరలేదు! బాగా ఆలోచించి, మీ నిశ్చయం చెప్పండి, అంతే!" అని తొందర తొందరగా తన మనసు ధారపోసింది.

'సరే అని చెప్పండి!' అని బతిమాలుతున్నట్టు జానకి సుందరంని దీనంగా చూస్తోంది.

వాడెక్కడ 'సరే!' అని ఏకీభవిస్తాడేమో అనే భయంతో ఆడలరశన్. చెల్లెం, సుందరంని చూస్తున్నారు.

అమ్మ సందేశంలో న్యాయం ఉందా అని ఆలోచిస్తూ ముత్తు తన నుదుటని గోకుకుంటున్నారు.

తన పథకం విజయమవుతందనే ధైర్యంతో అలంకారవల్లి కుర్చీలో కదలకుండా ఉంది.

ఒక దగ్గు దగ్గి, మెల్లగా, సుందరం, ఆరంభించాడు.

"ఇక్కడ మనం మూడు అంశాలు గమనించాలి. నేను కాదు - మరెవరైనా సరే, జానకిని పెళ్ళి చేసుకొనే ముందు ఈ మూడు విషయాలు పరశీలన చెయ్యాలి: ఒకటి. పెళ్ళి చేసుకొనే అతను, ఆ వరుడు, పెళ్ళి అనే బంధం గురించి ఏమనుకుంటున్నాడు? అతను దానికి సిద్ధంగా ఉన్నాడా? లేకపోతే, ఇతరులెవరో ప్రేరేపించారని 'సరే!' అంటున్నాడా?"

"Yes, Yes, You are right! అమ్మ చెప్పిందని పెళ్ళి చేసుకొని నేను victim ఐపోయాను . . . What's next?" అని ముత్తు అడుగుతున్నారు.

"రెండోది: మీ అమ్మాయికి దాపత్య జీవితంలో ఒక మగవాడికి - బుద్ధిజీవిగా మాత్రం కాదు, అన్నీ అంశాలలోనూ - అతనికి భార్యగా మెలగడానికి అర్హత ఉందా?"

"Yes, Mr. Sundaram, అందుకోసం నేనొక డాక్టరుని చూడాలనుకున్నాను. It is very important!" అని జానకి అతనికి చెప్తూంటే ఆత్మవిశ్వాసం లేకుండా తహతహలాడుతోంది.

"ఇక, మూడోది: పెళ్ళైన తరువాత వాళ్ళు ఒక కొత్త జీవితం ఆరంభించాలి - ఇక ఈ మీ ఊగెడు కుర్చీల సల్లాపం కూడదు! ఈ వలనుంచి వాళ్ళకి విముక్తి దొరకాలి! పెళ్ళైన తరువాత ఒక యువతికి ఇతరులతో తనకున్న బంధం తగ్గుతూ రావాలి. అప్పుడే కొత్త బంధం దృఢపడుతుంది. ఒక యువతికి ముప్పై సంవత్సరాలు నిండిన తర్వాతకూడా తన తల్లికి పిల్లగా ఉండాలనే ఆకాంక్ష ఉంటే - సరే, ఆమె జీవితం పిల్లగానే సాగనీ! కాని ఆమె, ఒక భార్యగా, తల్లిగా, మెలగడం అసాధ్యం! ఇవన్నీ మీరు ఆలోచించాలి. ఆ తరువాత - నేను కాదు - మీ అమ్మాయికి - శ్రేష్ఠమైన అల్లుళ్ళు- చాలామంది దొరుకుతారు; జానకికి స్వర్గం లాంటి జీవితం లభిస్తుంది. ఆలోచించండి!"

"ఇందులో ఆలోచించడానికి ఏముంది? మీరు బాగా ఆలోచించే ఇవన్నీ చెప్తున్నారని నాకనిపిస్తోంది . . . Mr. Sundaram, you are right . . . జానకీ, నీకు ముప్పై నిండాయి . . . నీ జీవితం నువ్వే నిర్ణయించాలి . . . 'మేం ఏమంటున్నాం, ఇతరులు ఏమంటున్నారు' అని నువ్వు ఆలోచించకూడదమ్మా! జీవితంని జీవించాలి, పాడు చేసుకోకూడదు . . . 'మీరా ఇలా మాటాడుతున్నారు?' అని నన్ను అడుగుతున్నావా? It is too late . . . అదే నా కథ . . . One should live! నేనేమో అమ్మకి పిల్లవాడుగా మారిపోయాను, మా అమ్మకి నేనొకడు చాలు! . . . నేను జీవితం అనుభవించకపోయినా, నాకు ఇతరుల అనుభవాలు చూసి ఆనందించాలని ఉంది. నువ్వు నాకొక ఛాన్సు ఇవ్వకూడదా? నీకు ఇతనికంటే మరొక మంచి భర్త దొరకడు. మిస్టర్ సుందరం, నా చెల్లెల్ని మీరే పెళ్ళిచేసుకోండి . . . I know you like her . . . I see it in your eyes! . . . అని అతను ఆవేశంతో మాటాడుతుంటే "ఛీ, ఛీ, దిక్కులేని వెధవ!" అని అరుస్తూ ముత్తు బుగ్గమీద అఱచేతితో అలంకారవల్లి దఢీలుమని దెబ్బ వాయించుతోంది.

"అమ్మా! . . . ఆ! . . . I am sorry! . . ." అని బుగ్గని తడుముకుంటూ ముత్తు పసిపాపలాగ ఏడుస్తూ కుర్చీలో కూర్చుండిపోయారు; అలంకారవల్లి కెవ్వుమని బొబ్బరించుతోంది:

"వీడు పిచ్చివాడు! . . . ఇన్నిరోజులూ Nursing Home ఉన్నాడు! . . . నాకు పుత్రవాత్సల్యం ఎక్కువ . . . వీడు వేదాంతి, సన్యాసి ఐపోయాడని నన్నే నేను

మోసం చేసుకున్నాను! . . . నేను  కోవిలకి వెళ్తున్నాని అన్నప్పుడెల్లా వీడున్న ఆసుపత్రికే వెళ్ళాను . . . వీడి మాటలు విని మీరు ఏదీ నిర్ణయించకండి! నేను ఆఖరిగా చెప్తున్నాను, వినండి! మీ నాటకం నాకు తెలుసు! నెలకి ఆరువందలు, ఏడువందలు సంపాదించే నా అమ్మాయిని నేను మీకివ్వను! నాయనా, నాకు లోకజ్ఞానం ఉంది! నీకంటే బాగా తెలుసులే! కడుపులో ఒకటి, నడుములో ఒకటి, చెయిలో ఒకటి - అని యంత్రంలాగ పిల్లల్ని కంటూ  వీధుల్లో తిరిగే అమ్మాయికాదు మా జానకి! ఇదిగో, జానకి, విను! నీకు ఆ బతుకే కావాలంటే, నువ్వు ఎవరితో పారిపోయినా సరే, నేను అడ్డు చెప్పను!"

"అమ్మా, అమ్మా,  నాకు మరెవరూ వద్దమ్మా! . . . నేను నిన్ను వదలి ఎక్కడకీ వెళ్ళను!" అని జానకి తల్లిని కౌగిలించుకొని ఏడుస్తోంది.

"That's the end!" అని మూలుగుతూ, సుందరం "Anyhow, Mr. Muthu Manikkam, మిమ్మల్ని కలుసుకున్నందుకు నాకు చాలా సంతోషం! Goodbye!" అని చెప్పి మరెవరినీ చూడకుండా నిష్క్రమించాడు.

అలంకారవల్లి ద్వారం మూసేసి లోపలికి వచ్చింది. బయట కారు సద్దు వినబడుతోంది.

"అమ్మా, అమ్మా, నన్ను క్షమించండి! . . . నేను పిచ్చిగా ఏమోమో అన్నాను, క్షమించండి!" అని ముత్తు తల్లిని మళ్ళీ మళ్ళీ బతిమాలుతున్నారు.

"నాకు పిచ్చని నేను మరిచిపోయాను! నా పిచ్చి పోలేదు, ఇంకా అలాగే ఉంది! పిల్లల ఆరోగ్యం గురించి ఆ డాక్టరుకి ఏం తెలుసు? అది తల్లికే తెలుసు! అవునా? అందుకే కదా  పెద్దలు తల్లి తప్పకుండా కావాలన్నారు? . . . ఐతే, అమ్మా,  నీకు అమ్మలేదే? పాపం, నీకు అమ్మ లేదే!"

అని అంటూనే పెద్దన్నయ్య ఆడడం ఆరంభించారు.

అబ్బా, ఆ ఊగెడు కుర్చీ ఎలా ఊగుతోంది!

********

# అనుబంధం

# అనువాదకుని సందేశం

నేను పాతికేళ్ళకి పైగా జయకాంతన్ రచనలని ఆంగ్ల, తెలుగు భాషలలో అనువదించడం చేస్తున్నాను. ఇందులోని రెండు కథలు - ***ఋషిమూలం***, ***ఊగెడు కుర్చీలు*** - 2015 లో ఆంగ్లంలో అనువదించి www.kurinjipubs.com లో పోస్ట్ చెయ్యడమైంది. ఆ సమయంలో నా మనసులో జయకాంతన్ రచనా విశేషం గురించి కొన్ని కొత్త ఊహలు, ఆలోచనలు లేచాయి. వాటిని ఇక్కడ ఈ అనుబంధంలో పాఠకులతో పంచుకోవాలని పూనుకున్నాను.

జయకాంతన్ కథలని చదవడమనది నాకొక తీయని, ఆహ్లాదకరమైన అనుభవంగా పరిణమించింది. “నేను రాసిన కథలన్నీ నా పాఠకులకే వదిలేస్తాను!” అని అతను అనేవారు. అందువలనే అతని కథలు మళ్ళీ మళ్లీ చదివినప్పుడు నా మనసులో కొత్త కొత్త ఆలోచనలు, గుర్తింపులు చోటుచేసుకున్నాయి.

ముఖ్యంగా ఈ రెండు కథల్లో మనం చూసే వివరణ (Narration), సాహిత్య యుక్తులు (Literary devices) గురించి చెప్పదలచుకున్నాను.

**వివరణ**

వివరణ శైలిలో రెండు కథల్లోనూ భేదాలున్నాయి.

***ఋషిమూలం*** కథ మూడు భాగాలుగా ఉంది. ప్రథమ, మూడవ భాగాల్లో రచయత మనకి సూటిగా కథని వివరించి చెప్తున్నారు. రెండవ భాగంలో కథానాయకుడు రాజారామన్ స్వానుభవ సంఘటనలు అంతర్గత ఏకభాషణ (Internal Monologue) గా మనకి తెలియజేస్తున్నాడు. దానికి కారణం, రచయత ముందు మాటలో చెప్పినట్టు రాజారామన్ అనే పాత్ర తనగురించి ఒక మనోవ్యాధి విజ్ఞాని (psychiatrist) తో మాటాడుకుంటున్నట్టు మనం కల్పించుకోవాలి. లేకపోతే, అతని అంతరంగిక మనోవ్యధ మనకి తెలిసే అవకాశం లేదు.

‘ఋషిమూలం, నదిమూలం చూడకూడదు,’ అనేది నానుడి. అందుకే కథ పేరుతో మనం కథానాయకుడు మనసులోని రభస గుర్తుచేసుకోవాలి.

***ఊగెడు కుర్చీలు*** కథనం వేరే శైలిలో ఉంది. నేపథ్యంలో పాత్రలు, ఇంటి వాతావరణం తెలుసుకున్న తరువాత, మనం ప్రేక్షకులుగా ఒక సభాభవనంలో (auditorium) కూర్చొని ఎదుటనున్న వేదికలో ఒక నాటకం చూస్తున్న భావన కలుగుతోంది. రంగం మారుతోంది; తెర తెరచుకుంటోంది, పాత్రలు కనిపిస్తున్నారు, మాటాడుతున్నారు. కథ నాటకంలాగ సాగుతోంది. అందువలనే కొన్నిచోట్ల కథ వర్తమానకాలంలో జరుగుతున్నట్టు భాష ఉంది.

## సాహిత్య యుక్తులు

***ఊగెడు కుర్చీలు*** కథలో పాత్రల భావనలు మనం వాళ్ళ కుర్చీల గమనంతో పోల్చుకోవాలి. ఇక్కడ ఊగెడు కుర్చీ  ఒక ఉపమానం; అది ఎంత వేగంగా ఊగినా, దానికి గమనమంటూ ఏదీ  లేదు. ఈ కథలో  ఊగెడు కుర్చీలు నిత్యమూ ఊగుతూనే ఉన్నాయి. ఈ కుటుంబ నిశ్చల స్థితినే అని  మనకి చివరకి వక్కాణించి తెలియజేస్తున్నాయి.

అలంకారవల్లి నిత్యమూ తన వంశ ప్రతాపం, గతించిన తన తండ్రి మగిళ్మారన్ పిళ్ళై పాండిత్యం గురించి మాటాడుతోంది. తన కుటుంబంలో అందరూ అధిగొన్నత జీవులు, ఉత్తమ శ్రేణికి చెందినవారు అని ఆవిడ ఏకాభిప్రాయం; ఆ నమ్మకం దృఢపరచే విధంగా  ఆ ఇంటి హాలులో, గోడమీద నిత్యమూ ఆమె తండ్రి ఫోటో కనబడుతోంది. అతని ఆధిక్యం,  ప్రభావం ఆ కుటుంబంని ఇంకా వెంటాడుతుందని చెప్పడానికి ఇది మంచి సాహిత్య యుక్తి. ఇటువంటి ప్రక్రియలు వాడిన Tennessee Williams, Elia Kazin వంటి అమెరిక నాటక కర్తలని జయకాంతన్ శ్లాఘించారు.

## శుద్ధ తమిళ సాహిత్య ఉద్యమం

“సృష్టిలో మొట్టమొదట వచ్చిచేరినది మట్టి; దానికి ముందు వచ్చినది రాతి; దానికి ముందు వచ్చినది తమిళ భాష,” అనే సామెత మీరు విన్నారా?

తమిళులకి తమ భాష గురించి విశిష్ట అభిప్రాయం ఉంది. అది చాలా పురాతనమైనదని, దాన్ని ఎటువంటి కళంకమూ తాకకూడదు అనే ఒక దృఢమైన వాంఛ వలన తమిళ దేశంలో, సామాజిక, రాజకీయ, రంగాల్లో మార్పులు కానవచ్చాయి. మద్రాసు ప్రెసిడెన్సీ రాజకీయాలలో కాంగ్రెసు - బ్రాహ్మణ

ఆధిపత్యానికి జస్టిస్ పార్టీ గట్టి సవాలు విసిరింది. అదే Anti- Congress, Anti-Brahmin, Anti-Aryan, Anti- North India, Anti- Sanskrit, Anti- Hindi, ఆసక్తులకి దారి తీసింది.

శుద్ధ తమిళ సాహిత్య ఉద్యమంకి నాయకులు, ముఖ్యమైన తమిళులు - మర్రైమలై అడిగళ్ (1876-1950), భారతిదాశన్ (1891-1964), దేవనేయ పావాణర్ (1901-1981). వేదాచలం అనే పేరే తమిళంలో మర్రైమలై అడిగళ్ అని అయింది.

1. ఒకప్పుడు తమిళ భాషతో సంస్కృత పదాలు అధికంగా వాడేవారు. దానికి మణిప్రవాళం అని పేరు. అది నిషేధార్థకం అని వాదించడమేకాక, సంస్కృత భాషలోని గ్రాంధిక అక్షరాలుకూడా వాడకూడదని కొందరు పట్టుపట్టారు..[1]

2. ఈ కారణాల వలనే తమకున్న సంస్కృత పేర్లు కొందరు నాయకులు మార్చుకున్నారు. సోమసుందరం మదిఅళగన్[2] ఐంది. గజపతిని వేళ వేందన్ అని పిలిచారు. ఈ పేరు మార్పు కరుణానిధి మినహా అందరూ చేసుకున్నారు. కరుణానిధి పేరుని తమిళంలో తిరువరుట్సెల్వర్ అని పిలవవచ్చు అని కోందరు సలహా ఇచ్చారు. ఆ పేరులో ఒక చలన చిత్రం కూడా 1967 లో వచ్చి మంచి పేరు సంపాదించుకుంది. కాని కరుణానిధి తన పేరు మార్చుకోలేదు.

శుద్ధ తమిళ సాహిత్యం గురించి జయకాంతన్ తమ అభిప్రాయం విపులంగా రాసి ఉన్నారు:

"శుద్ధ తమిళంలో సాహిత్యం కల్పించడం ఒక మంచి ప్రయత్నం. కాని ఆధునిక తమిళ సాహిత్యంకి అది దోహదం చెయ్యదు. సాహిత్యం - వచనం, కవిత్వం - ప్రజల జీవిత శైలికి అనుసరించి ఉంటుంది. నూతన విధులు, ప్రవృత్తులని వస్తే ప్రజలు

---

[1] ఇందులోనూ క్రమబద్ధత కనిపించదు. రాజాజీ అనే పేరుని రాసాసి అని రాయాలని వాదించిన ఈ తీవ్రవాదులు తమిళనాడు రాష్ట్ర ఎన్నికలలో ఎందుకో ఎమ్.జి.ఆర్ పేరుని మార్చలేదు.

[2] ఒత్తిపలికే 'య' అక్షరం తమిళ భాషలోనే ఉంది. దీన్ని za ఇంగ్లీషులో అని రాస్తారు. తెలుగులో మనం 'ళ' వాడుతాం.

వాటిని గ్రహించుకోవాలి. అది సాధ్యం కానప్పుడు ఆ సాహిత్యం ఒకే పద్ధతిలో సాగుతుంది.

ఒకే పద్ధతిలో సాగుతుందంటే ఆదేం భాష? మరేం భాష సాధ్యం కాదంటే రకరకాల పాత్రలు సృష్టించడం ఎలాగ?

శుద్ధ తమిళమే తమిళం అని వాదిస్తే అది సాహిత్యంకి పనికిరాని తమిళం ఐపోతుంది.

తమిళ సాహిత్యంలోని గ్రంధాలు పరిశీలించి చూస్తే అవన్నీ వివిధ ఘట్టాలలో ఆ ఆ శకాలూ, యుగాలూ ప్రతిఫలించడం చూస్తాం. అవన్నీ కవిత్వంగా ఉన్నా, ఒకే శైలిలో లేవు.

తమిళ సాహిత్యంకి చిరాయువు అనుగ్రహించిన మన పురాతన కవులందరూ తమ జీవితాల్లో కలిసివచ్చిన తమిళేతర వార్తలు ప్రయోగించి సాహిత్యంని పోషించి ఉన్నారు. అందుకు ప్రతికూలమైన వ్యాకరణంని లొంగదీసుకొని ఒక కొత్త వ్యాకరణంని సృష్టించగలిగారు.

'అంతోనీ సైకిలులో వెళ్ళాడు. టైరు పంచరు ఐంది," అనే వాక్యం తీసుకుందాం. 'ఇలాగ తమిళ రాయకూడదు!' అని ఎవరైనా వాదించగలరా? శుద్ధ తమిళ పక్షం వారు ఈ వాక్యంలో రెండే రెండు పదాలు అనుమతిస్తారు: వెళ్ళాడు, ఐంది. కాని ఇవి అన్ని శకాల్లోనూ తమిళులు క్రియగా వాడే పదాలని మనం గుర్తు చేసుకోవాలి.

కాని అంతోనీ, సైకిలు, టైరు, పంచరు, నూతన యుగాన్ని ప్రతిఫలించే నిజాలు. వీటిని అనువదించడం మూలం మన అవగాహనలో చోటుకి, సమయంకి ఎటువంటి సంబంధమూ లేదు!

"మాకు సైకిలు కావాలి కాని 'సైకిలు' అనే పదం వద్దు!" అని కొందరు హఠం చేస్తే జీవితం ఒప్పుకుంటుందా?

అందువలనే నేనంటున్నాను, 'తమిళం ఒక బాష; శుద్ధ తమిళంలో సాహిత్యం కల్పించడం ఒక మంచి ప్రయత్నం,' అని.

బాష అనేది కొందరు ఉపాధ్యాయులకీ, విద్యార్థులకీ ప్రత్యేకంగా లేదు. అది జీవితానికి సంబంధించిన అన్ని రంగాల వికాసం అనిపించుకోవాలి; దాని మూలం సాహిత్యం జీవితాన్ని చూపాలి; విశ్లేషించాలి; మనలో స్పందన కలుగజేయాలి."

ఈ కథలో ఆడలరశన్ పాత్ర శుద్ధ తమిళాభిమానులకి ప్రతినిధి, కాని పాఠకులకి అతనిపై ద్వేషభావం కలగడానికి ముఖ్యమైన కారణం అతనికున్న తమిళ వ్యామోహం కాదు, అతనిలో సభ్యత, ఔచిత్యం లేక పోవడమే అని మనం గుర్తు చేసుకోవాలి.

జయకాంతన్ శుద్ధ తమిళంలో అతనికున్న ప్రతికూలతని అలంకారవల్లి పాత్ర మూలంగా మనకి తెలియజేస్తున్నారా అని అడగాలనుపిస్తోంది.

********

# జయకాంతన్



"నేను చూసిన - అంటే, ఈ లోకంలోనాకు పరచియమైనవీ, నేను విన్నవీ, అనుభవించినవీ - నేను ఈ ప్రపంచంకి తెలియజేస్తున్నాను. అవే మీకు మళ్ళీ చూపిస్తున్నాను. అవి అసహ్యంగా, అల్పంగా లేక ఘనంగా, ప్రౌఢిమంగా ఉన్నా, అందువలన నాకేం నింద? కాకపోతే నాకేం కీర్తి?"

రెండు కథలూ వివాదాస్పదమైనవి. కథావస్తువు స్త్రీ పురుష సంబంధాలు, వాటి స్థితిగతులు, లక్షణాలు, గురించి. జయకాంతన్ తమిళ సాహిత్యంలో మరెవరూ ఎంచుకోని, నిషేధమని ఇందులోని భావించే అంశాలని నిష్ఠూరంగానే అయినా స్పష్టంగా ఇక్కడ మనకి తెలియజేస్తున్నారు.

(ముందు మాటలో)